ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
విజయవాడ

fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-3-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 46 పేజీలు: 10+4 వెల: 6.50

పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం ఉండాలి: సుప్రీం

గంగానదిలో ఇఫ్తార్ విందు: 14 మంది అరెస్టు

5లో



మంగళవారం ఎపిఇడిబి నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్. చిత్రంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

# 20లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

## పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి: మంత్రి లోకేష్

**విజయవాడ,మార్చి 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం కావా లని విద్య, ఐటీశాఖల మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. ఆ దిశలో క్రియాశీలక కార్యాచరణ అమలు కావాలన్నారు.రాజధాని ప్రాంతంలోని మయూరి టెక్ పార్క్ భవనం ఐదో అంతస్తులో >>2

# వంట గ్యాస్‌కు కొరతలేదు..

## ప్రస్తుతం 14వేల మె.ట నిల్వలున్నాయి..

## ప్రత్యామ్నాయాలపై కూడా అధ్యయనం చేయాలి

## హాస్టళ్లు, ఆసుపత్రులు, ఆలయాలకు పూర్తి సరఫరా

## ఆర్టీజీఎస్ నుంచి గ్యాస్ లభ్యతపై సిఎం చంద్రబాబు సమీక్ష



మంగళవారం గ్యాస్ సరఫరాపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,మార్చి 17,ప్రభాతవార్తప్రతినిధి:** వంటగ్యాస్ విషయంలో వాస్తవ విరుద్ధ అంశాలతో వదంతులను సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. రాష్ట్రంలో గ్యాస్‌వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఎల్పీజీ సిలెండర్లు ఉన్నాయన్నారు.వంట గ్యాస్ బ్లాక్ మార్కె టర్లపైన చర్యలుంటాయన్నారు.ఆర్టీజీఎస్ నుంచి రాష్ట్రంలో గ్యాస్ సరఫరా అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళ వారం కీలక సమీక్షను నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ. ప్రస్తుతం రాష్ట్రంలో వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నాయన్నారు.మరికొన్ని మెట్రిక్ టన్నుల గ్యాస్ అందుబాటులోకి రాబోతోందన్నారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఇబ్బందులు లేవు అన్నారు. ఆస్పత్రులకు, హాస్టళ్లు, దేవాలయాలకు ఎలాంటి కొరతా లేకుండా చర్యలు తీసుకో వాలి అన్నారు. ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యా మ్నాయాలపై అధ్యయనం చేయాలన్నారు. ఈకేవైసీ, ఓటీపీల ద్వారా గ్యాస్ సిలిండర్ల డైవర్షన్ లేకుండా, ప్రజలు ప్యానిక్ కాకుండా చర్యలు చేపట్టాలి. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్స్ స్టాక్స్ లభ్యత పెరిగేలా చూడాలి. గ్యాస్ కంపెనీలు స్వల్పకాలికంగా ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా చూడాలన్నారు. రాష్ట్రంలో మరింతగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ విస్తరించే అంశంపై దృష్టి సారించాలి. ఏపీలోని కేజీ బేసిన్ లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసేలా చూడాలి. సీఎన్జీ, పీఎన్జీల వినియోగాన్ని గరిష్టంగా పెంచేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలి. పశ్చి మాసియా యుద్ధ నేపథ్యంలో గ్యాస్‌సరఫరాపై ప్రభావం పడింది. ఇప్పటికి ఇళ్లలో వాడుకునే సిలిండర్లపై లేకున్నా కమర్షియల్ సిలిండర్ల కొరత కొనసాగుతోంది. అయితే రానున్న రోజుల్లో గ్యాస్ దొరకదేమోనన్న టెన్షన్ మాత్రం ప్రజల్లో ఉంది. దీంతో అందరూ గ్యాస్ సిలిండర్ల కోసం గోడౌన్లు, గ్యాస్‌కేంద్రాలకు క్యూ కడు తున్నారు. ఈకేవైసీ, ఓటీపీల ద్వారా గ్యాస్ సిలిండర్ల డైవర్షన్ లేకుం డా, ప్రజలు ప్యానిక్ కాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్స్ స్టాక్స్ లభ్యత పెరిగేలా చూడాలని సూచించారు. గ్యాస్ కంపెనీలు స్వల్పకాలికంగా ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా చూడా లన్నారు.రాష్ట్రంలో మరింతగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ విస్తరించే అంశంపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రం లోని కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ >>2

# సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

## రెండేళ్లలో రూ.3.30లక్షల కోట్లు దాటిన అప్పు

## పార్టీ నేతల భేటీలో మాజీ సిఎం జగన్



**విజయవాడ,మార్చి17,ప్రభాతవార్తప్రతినిధి:**విపరీతంగా రికార్డుస్థాయిలో అప్పు చేస్తూ, రాష్ట్రంలో ఏ ఒక్క వర్గానికీ మేలు చేయని టీడీపీ కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో తీవ్ర అసంతృప్తి మొదలైందని వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జగన్ అన్నీ చేసినప్పుడు, ఇప్పుడు చంద్రబాబు ఎందుకు ఇవ్వ లేకపోతున్నాడన్న చర్చ ప్రతి ఇంట్లో జరగుతోందన్నారు. రెండేళ్లు తిరగకుండానే మొత్తం రూ.3.30 లక్షల కోట్లు అప్పు చేసిన ఈ ప్రభుత్వం ఏ ఒక్క సంక్షేమ, అభివృద్ధి పథకం, కార్యక్రమాలు అమలు చేయడంలేదని ఆయన గుర్తు చేశారు.ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ వైయస్సార్‌సీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో,పార్టీకేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్ సమావేశమయ్యారు. నిత్యం ప్రజలతో మమేకమవుతూ, పార్టీలో కూడా అందరినీ కలుపుకుపోతున్న చుండూరి రవిబాబుకు పార్టీ బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. ఏడాదిన్నర కాలంగా ఆయన అంకితభావంతో పని చేస్తున్నారని అభినందించారు. అలాగే ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కూడా చాలా చురుగ్గా పని చేస్తున్నారని ప్రశంసించారు. దేవుడిదయ, అందరి ఆశీస్సులుంటే, ఆయన ఇంకా ఎదుగుతారని వైయస్ జగన్ చెప్పారు.ఆ రెండింటికీ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. మనమంతా కలిసికట్టుగా, ఒక్కటై ఈ పార్టీ నిర్మించుకున్నాం. ఇది కేవలం నా పార్టీకాదు. మనందరిపార్టీ. మహానేత వైయస్సార్‌ని గుండెలో పెట్టుకుని చూసు >>2

## దివ్యాంగ శక్తి పథకం

# నేటి నుంచి అమలు

**విజయవాడ,మార్చి17,ప్రభాతవార్తప్రతినిధి:** దివ్యాంగులకు ప్రభుత్వం ఉచిత కానుక అందిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు రేపటి నుంచి ఉచిత ప్రయాణ సదుపాయం ప్రవేశపెట్టనుంది. దీనికి "దివ్యాంగ శక్తి" పథకంగా ప్రభుత్వం నామకరణం చేసింది. బుధవారం మంగళగిరిలో సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన నున్నారు.ఈ పథకాన్ని ప్రారంభించిన తర్వాత దివ్యాంగులతో కలిసి చంద్ర >>2

## మునిసిపాలిటీల్లో నేటి నుంచి

# ప్రత్యేకాధికారుల పాలన

**విజయవాడలో మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో 86 పుర, నగరపాలక సంస్థల్లో పాలక వర్గాల పదవీకాలం మంగళవారంతో ముగియనుంది. బుధవారం నుంచి పూర్తిస్థాయిలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమవుతుంది. 2021 మార్చిలో నిర్వహించిన ఎన్నికల్లో గెలుపొందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో పాలకవర్గాలు అప్పట్లో కొలువు తీరాయి. పరోక్ష పద్ధతిలో పాలకవర్గ సభ్యులు వారిలో ఒకర్ని నగరపాలక సంస్థల్లో మేయర్లుగా, పురపాలక సంఘాల్లో చైర్మన్లుగా ఎన్నుకున్నారు. ఐదేళ్ల పదవీకాలం మంగళవారంతో ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం వారం క్రితమే ప్రత్యేక అధికారు లను నియమించింది. మంగళ, బుధవారాల్లో వీరు బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రభుత్వం నగరపాలక సంస్థల్లో ప్రత్యేక అధికారులుగా కలెక్టర్లు, పురపాలక సంఘాల్లో జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలను నియమించింది. 2021 మార్చిలో ఏలూరు నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించినా కోర్టు కేసుల కారణంగా ఓట్ల లెక్కింపులో జాప్యమైంది.అక్కడి పాలకవర్గం పదవీ కాలం ఈఏడాది జులై 29తో >>2



# వంట గ్యాస్‌కు కొరతలేదు..

>> వాయువును పైప్డ్ నెట్‌వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసేలా చూడాలన్నారు. సీఎన్‌జీ, పీఎన్జీల విని యోగాన్ని గరిష్టంగా పెంచేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని సీఎం ఆదేశించారు.

**మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు:** ప్రస్తుతం రాష్ట్రంలో 14 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలున్నాయి అని సీఎం తెలిపారు. మరికొన్ని మెట్రిక్ టన్నుల గ్యాస్ అందుబాటులోకి రానున్నాయన్నారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. ఆస్పత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు ఎలాంటి కొరతా లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేయాలన్నారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఎల్పీజీ సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతి విని యోగదారుడి నుంచి ఓటీపీ తీసుకునే విధానాన్ని అవలంభించడం ద్వారా డొమెస్టిక్ సిలిండర్లు దుర్వినియోగం కాకుండా చూస్తున్నామని అధికారులు చెప్పారు. హెచ్ పీసీఎల్ సంస్థ 90 శాతానికి పైగా ఓటీపీలతోనే గ్యాస్ సరఫరా చేస్తోందని ఆ తర్వాత స్థానాల్లో బీపీసీఎల్, ఐఓసీఎల్ ఉన్నాయని అధికారులు తెలిపారు. ఓటీపీల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల ద్వారా సమన్వయం చేసుకుంటూ ఆర్టీజీఎస్ నుంచి సాంకేతిక సాయాన్ని ఆయా గ్యాస్ సరఫరా కంపెనీలకు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు సీఎంకు తెలిపారు. గ్యాస్ డెలివరి విషయంలో సిలిండర్లు దుర్వినియోగం కాకుండా టెక్నాలజీని ఉపయోగించి పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలో సాధారణ పరిస్థితుల్లో ఒకటిన్నర రోజుల్లోనే డెలివరి జరిగేదన్నారు. ఇప్పుడు రెండున్నర రోజులు పడుతుందని అధికారులు వెల్లడించారు. గతంతో పోల్చు కుంటే రీఫిల్ బుకింగ్ గడవు పెరిగిందని ఇలాంటి సమయంలో గతంలో మాదిరిగానే డెలివరిని ఒకటిన్నర రోజుల్లోనే అందించగలిగితే ప్రజల్లో గ్యాస్ సరఫరా విషయంలో ఆందోళన ఉండదని సూచించారు. ఎల్పీజీ సరఫరా విషయంలో ప్రజల్లోని ఆందోళనలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టళ్లు వంటి వాటిల్లో కూడా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఇక ఎల్పీజీ వినియోగం తగ్గించుకునేలా హోటళ్ల అసోసియేషన్లతో ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని సూచించారు. అలాగే ఓఎన్జీసీ, గెయిల్, బీజీఎల్ వంటి సంస్థలతో ఇంటింటికీ గ్యాస్ పైప్ లైన్ కనెక్షన్లు ఇచ్చే సంస్థలు సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ఈ క్రమంలో గ్యాస్ పైప్ లైన్ల విస్తరణకు అవసరమైన చర్యలపై దృష్టి సారించాలని అన్నారు. ఇండక్షన్ స్టవ్‌లను కూడా అందుబాటులోకి తీసుకురావాలని సీఎం అధికారులకు సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రాలకు త్వరలోనే మరింత ఎల్పీజీ కేటాయింపులను కేంద్రం చేయనున్నట్లు అధికారులు సీఎం వెల్లడించారు. వివిధ ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యల పైనా అధికారులు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు, గెయిల్, ఓఎన్జీసీ అధికారులు పాల్గొన్నారుముఖ్యమంత్రి సమీక్షలో పాల్గొన్న పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ అధికారులు హాజరయ్యారు.



మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన న్యూట్రి భారత్-2026 సదస్సుకు హాజరైన కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్

# 20లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

>> ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) నూతన కార్యాలయాన్ని మంత్రి లోకేష్ మంగళవారం ప్రారంభించారు. ముందుగా టెక్ పార్క్ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యాలయం మొత్తం కలియతిరిగారు. ఈ సందర్భంగా ఏపీఈడీబీ ఉద్యోగులకు దిశానిర్దేశం చేస్తూ గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసిందన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం కావాలి అని కోరారు. ఒప్పందాలు కాకుండా పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కఅషి చేయాలని నిర్దేశించారు. యువగళం పాదయాత్ర సమయంలో యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చానని అన్నారు. జీడీ నెల్లూరులో పాదయాత్ర చేస్తున్న సమయంలో రోడ్డు పక్కన బజ్జీలు విక్రయించే మోహన అనే మహిళను కలిశానని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం వద్దని, తమ పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తే చాలని ఆమె తనతో చెప్పారని తెలిపారు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే పెద్దఎత్తున పెట్టుబడులు సాధించిందన్నారు. దేశానికి వచ్చిన వంద రూపాయల పెట్టుబడుల్లో 25రూపాయాలు ఎపికి వచ్చాయని, ఇందుకు ఈడీబీ బఅందానికి అభినందనలు అని చెప్పారు. సీఈవో సాయికాంత్ వర్మకు తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

**ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఎపికే ప్రాధాన్యత:** గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఎపి ని ఎంచుకున్నాయని మంత్రి లోకేష్ తెలిపారు. ఇప్పుడు మనం మరింత స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ని ఉద్యోగాలు కల్పించామన్నదే ముఖ్యం అని చెప్పారు. రిలయన్స్ సీబీజీ ప్రాజెక్ట్ వల్ల పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తున్నాయని, ఇది ప్రారంభం మాత్రమేనని అన్నారు. ఉద్యోగాల కల్పనే మన సింగిల్ ఎజెండాగా ఉండాలని కోరారు. నూతన పెట్టుబడులు ఆకర్షించడంతోపాటు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్ మన ప్రధాన లక్ష్యం కావాలన్నారు. ఛాలెంజ్ గా తీసుకోవాలన్నారు. మన ఏకైక లక్ష్యం 20 లక్షల ఉద్యోగాల కల్పన అని ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకోవాలన్నారు. మీ అందరూ మీకు కేటాయించిన క్లస్టర్‌లో నిపుణులుగా మారాలని కోరారు. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించామన్నారు. వర్టికల్ ఇంటిగ్రేషన్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్ పై దఅషి సారించాలని కోరారు. ఒప్పందం కుదుర్చుకున్న ప్రతి ప్రాజెక్ట్ గ్రౌండ్ కావాలన్నారు. ప్రతి ప్రాజెక్ట్ ను సమీక్షించడం జరుగుతుందని చెప్పారు. ఏ ప్రాజెక్ట్ ఇతర రాష్ట్రాలకు వెళ్లకూడదు అని సూచించారు. అధికారులు, సిబ్బంది ఉన్నతంగా ఆలోచించాలని కోరారు. ఈ నెల 23 రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తున్నామన్నారు. ఇంతటితో తఅప్తిపడకూడదు అని చెప్పారు. ఎందుకు ఐదు స్టీల్ సిటీలు నిర్మించకూడదు ? అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఏప్రిల్ చివరినాటికి ఉండవల్లి నుంచి సీడ్ యాక్సిస్ రోడ్ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. ప్రతిఒక్కరం ఎంతో కష్టపడుతున్నామని అన్నారు. దేశం, రాష్ట్రం, ఈడీబీ గర్వపడే విధంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని మంత్రి లోకేష్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్ర మంలో ఎంఎస్ఎంఈశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ ఎమ్.అభిషిక్త్ కిషోర్ ఇతర ఉన్న తాధికారులు ఎంటీకృష్ణబాబు, సౌరభ్‌గౌర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈఏపీసెట్-2026 దరఖాస్తు గడువు పొడిగింపు

**విజయవాడ మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ ఈఏపీసెట్ -2026 దరఖాస్తు గడువును ఈ నెల 24 వరకూ పొడిగించినట్లు సెట్ కన్వీనర్ మోహనరావు తెలిపారు. రూ.1000 ఆలస్య రుసుముతో ఈనెల 28 వరకు, రూ.2వేల రుసుముతో ఏప్రిల్ 1 వరకు, రూ.4వేల రుసుముతో ఏప్రిల్ 6 వరకు, రూ.10వేల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 10వరకు గడువు ఉందని వివరించారు. తప్పుల సవరణకు ఏప్రిల్ 11 నుంచి 13 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సెట్స్. ఏపిఎస్‌హెచ్ఇ. ఎపి. జివోవి.ఇన్/వెబ్‌సైట్‌నుచూడాలని సూచించారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

## ఇమామ్, మోజన్ల గౌరవ వేతనం రూ.45 కోట్లు విడుదల

**విజయవాడ, మార్చి 17, ప్రభాతవార్త ప్రతినిధి:** ఇమామ్, మోజన్ల గౌరవ వేతనంగా మంగళవారం ఏపీ ప్రభుత్వం రూ.45 కోట్లు విడుదల చేసింది. రంజాన్ సందర్భంగా ఆరు నెలల బకాయిలను ప్రభుత్వం క్లియర్ చేసింది. నిన్న విజయవాడలో ఇఫ్తార్ విందులో సీఎం ఇచ్చిన హామీ మేరకు కొన్ని గంటల్లోనే నిధుల విడుదలకు ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 10 వేలమంది ఇమామ్‌లు, మోజన్ల ఖాతాల్లోకి నేరుగా వేతనంగా నగదు జమ అవుతుంది. 5 వేలమంది ఇమామ్‌లకు 6 నెలల వేతనం కింద రూ.30 కోట్ల చెల్లింపులు చేస్తారు. 5 వేలమంది మోజన్లకు 6 నెలల వేతనం కింద రూ.15 కోట్లు జమ చేస్తారు.

## అవినాశ్ రెడ్డి రెండోరోజు విచారణ

**విజయవాడ, మార్చి 17, ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కేసులో ముప్పిడి అవినాష్‌రెడ్డి రెండోరోజు మంగళవారం సిట్ విచారణ పూర్తి చేసింది. గుంటూరు జీజీహెచ్‌లో వైద్యపరీక్షలు చేయించిన పోలీసులు ముప్పిడి అవినాష్‌రెడ్డిని గుంటూరు జైలుకు తరలించారు. పోలీసులు బుధవారం కూడా ముప్పిడి అవినాష్‌రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు. మద్యం కుంభకోణం కేసులో ఏ7గా ఉన్న ముప్పిడి అవినాష్‌రెడ్డి ఉన్నారు. విచారణ సందర్భంలో అవినాష్‌రెడ్డి మద్యం సరఫరా ఆర్డర్ల కోసం పలువురు కసిరెడ్డినే సంప్రదించేవారని తెలిపారు. దీంతో తానూ ఓ సంస్థ ఏర్పాటు చేస్తానని, ఆర్డర్లు ఇవ్వాలని రాజ్ కెసిరెడ్డిని కోరినట్లు వివరించారు. ఆయన అంగీకరించడంతో అదాన్ డిస్టిలరీస్ ఏర్పాటు చేశామని తెలిపారు. సోదరుడు అనిరుధ్‌రెడ్డి డైరెక్టర్‌గా ఉండేవారని అవినాశ్‌రెడ్డి చెప్పారు. తర్వాత అరబిందో సంస్థకు చెందిన పెనక శరత్‌చంద్రారెడ్డి అదాన్‌లో రూ. 60 కోట్లు పెట్టుబడి పెట్టారని చెప్పారు. ఎస్‌పీవై డిస్టిలరీస్ సహా పలు డిస్టిలరీలను సబ్ లీజుకు తీసుకుని పలు బ్రాండ్లు తయారు చేసి, ఏపీఎస్‌బీసీఎల్ కు అమ్మేవాళ్లమని భారీగా ఆర్డర్లు వచ్చేవని విచారణలో వెల్లడించారు. కొన్నాళ్ల తర్వాత ఈ వాటాల వ్యవహారంలో శరత్‌చంద్రారెడ్డి, రాజ్ కెసిరెడ్డి మధ్య పెద్ద గొడవ జరిగిందని చెప్పారు. రాజ్ కెసిరెడ్డి తనను లెక్క చేయడమే మానేయడంతో తాము అదాన్ వ్యవహారాల నుంచి పూర్తిగా తప్పుకున్నట్లు చెప్పారు.

## ఆస్తి పన్ను బకాయిల్లో 50% వడ్డీ రాయితీ

**విజయవాడ, మార్చి 17, ప్రభాతవార్తప్రతినిధి:** మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఎపి ప్రభుత్వం తీపికబురు తెలిపింది. ఈనెల 31 లోపు బకాయిలు చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతం రాయితీ ప్రకటించింది. ఇప్పటికే వడ్డీతో పన్ను చెల్లిస్తే తదుపరి బిల్లులో మినహాయింపు ఇస్తామని తెలిపింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ జీవో నంబర్ 58 జారీ చేశారు. అయితే, ఇప్పటికే వడ్డీ సహా పన్ను చెల్లించిన వారు తాము నష్టపోయామని ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం మరో వెసులుబాటు కూడా కల్పించింది. అటువంటి వారు పొందే రాయితీ మొత్తాన్ని తదుపరి ఆర్థిక సంవత్సరం పన్ను బిల్లులో సర్దుబాటు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపునకు సమయం దగ్గరపడుతుండటంతో, బకాయిల వసూళ్లను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# కాబూల్‌పై పాక్ భారీ దాడి

### ఆసుపత్రి ధ్వంసం, 400 మంది మృతి

### 250 మందికిపైగా తీవ్రగాయాలు



**కాబూల్, మార్చి 17:** అఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఒక డ్రగ్ రిహాబిలిటేషన్ ఆసుపత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడులు అత్యంత బీభత్సాన్ని సృష్టించాయి. తాలిబన్ అధికార ప్రతినిధి సుహైల్ షాహీన్ ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ, ఈ దాడిలో సుమారు 400 మంది మరణించారని, మరో 250 మంది తీవ్రంగా గాయపడ్డారని ధ్రువీకరించారు. మృతుల్లో ఎక్కువ మంది రోగులేనని తెలిపారు. నిస్సహాయ స్థితిలో ఉన్న రోగులు ఉండే ఆసుపత్రిని లక్ష్యంగా చేసుకోవడాన్ని తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీనిని కేవలం యుద్ధ చర్యగా కాకుండా మానవత్వానికి వ్యతిరేకమైన నేరం అని సుహైల్ షాహీన్ అభివర్ణించారు. అంతర్జాతీయ నియమాలకు విరుద్ధంగా పౌర సౌకర్యాలపై దాడులు చేయడం పాకిస్థాన్ క్రూరత్వానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈ అమానుష ఘటనపై తాలిబన్లు తీవ్రంగా స్పందించారు. పాకిస్థాన్‌కు వారి భాషలోనే (దెబ్బకు దెబ్బ) సమాధానం చెబుతాం అని షాహీన్ హెచ్చరించారు. ఈ దాడులు ఇరు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను యుద్ధ వాతావరణానికి దారితీశాయని, తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి వెనకాడబోమని ఆయన స్పష్టం చేశారు. పాకిస్థాన్ దాడితో పాక్ ఆఫ్ఘన్ సరిహద్దుల వద్ద అత్యంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, ఈ దాడిపై ఆఫ్ఘన్ క్రికెటర్ రషీద్ ఖాన్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ఆసుపత్రులు, విద్యాసంస్థల వంటి చోట్ల దాడులు చేయడం ఆమోదయోగ్యం కాదని, అమాయక ప్రజల ప్రాణాలు తీయడం ఆపాలని కోరారు. .

## ఎసిబి వలలో చిక్కిన రాజవొమ్మంగి ఎస్.ఐ



**రాజమహేంద్రవరం, మార్చి 17, ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** తూర్పుఏజెన్సీ రాజవొమ్మంగి ఎస్.ఐ శివకుమార్ ఏసిబి వలకి చిక్కారు. రూ.15 వేలు లంచం తీసుకొంటూ మంగళవారం దాడుల్లో పట్టుబడ్డారు. రాజమహేంద్రవరం ఏసిబి డీఎస్పీ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఈదాడులు జరిగాయి. ఏసిబి సిఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం రాజవొమ్మంగి ఎంపిపి గోము వెంకటలక్ష్మి, వైస్సార్సీపీ నేత దాట్ల వెంకటేష్ రాజు జనవరి 26 తేదీ న రంపచోడవరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని కారులో తిరిగి వెళుతుండగా రాత్రి సమయంలో కారుపై దాడి జరిగింది. కారు ఆపి దాడి చేసిన కేసులో నలుగురుని గుర్తించిన పోలీసులు ముగ్గురుని అరెస్ట్ చేశారు. వారిలో నాలుగో వ్యక్తిని తప్పించే ప్రయత్నంలో రూ. 25 వేలు తీసుకొని మరలా ఈ కేసులో ఒకరినుండి రూ.15 వేలు తీసుకొంటుండగా వలపన్ని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కింద్ర జంక్షన్ వద్ద మంగళ వారం పట్టుకొన్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈదాడుల్లో ఎసిబి సిఐలు వాసు, కృష్ణ, నరేష్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమేనీ సెక్యూరిటీ ఆఫీసర్ హతం

**టెహ్రాన్, జెరూసలెం, వాషింగ్టన్, మార్చి 17:** మధ్యప్రాచ్యంలో యుద్ధ మంటలు ఆగే సూచనలు ఎక్కడా కనిపించడంలేదు. కువైట్, బాగ్దాద్, దుబాయి, యుఎఇ దేశాలే లక్ష్యంగా ఇరాన్ తనబాలిస్టిక్ క్షిపణులతో దాడులు ముమ్మరంచేస్తే ఇజ్రాయెల్ అమెరికా సహకారంతో ఇరాన్ ఐఆర్‌జీసీ సీనియర్‌కమాండర్లే టార్గెట్‌గా దాడులుచేసింది. మంగళవారం జరిపిన ఇజ్రాయెల్ ఐడీఎఫ్ దాడుల్లో ఇజ్రాయెల్ చీఫ్ ఖమైనీ భద్రతా సలహాదారు ఆలి లారీజానీని అంతంచేసినట్లు ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగాప్రకటించారు. అంతేకాకుండా బాసిజ్ ఆల్‌వలంటరీ బ్రిగేడ్ చీఫ్ ఘోలంరెజా సోలేమానిని మట్టుబెట్టామని చెపుతోంది. అయితే వీటిని ఇరాన్ ఎక్కడా ధృవీకరించలేదు. అలాగే ఇరాన్‌కూడా తమ వద్ద గూఢచర్యం చేస్తున్నారన్న ఆరోపణలపై పదిమంది గూఢచారులను అరెస్టుచేసింది. ఖొరాసన్ ఈ రజావి వీరిని అరెస్టుచేసింది. వీరంతా పది మంది కూడా కిరాయి సైనికకులని, దేశభక్తిలేని మూకలని వీరిని గుర్తించి అరెస్టుచేసామని ప్రకటించింది. కాగా యుద్ధంలో ఇప్పటివరకూ ఒక్క టెహ్రాన్‌లోనే 12ఇఏలకుపైగాభవనాలు ధ్వంసం అయ్యాయి. ఇజ్రాయెల్‌కూడా తమ దేశంలో ఇరాన్ దాడులకారణంగా 3530 మంది తీవ్రగాయాలపాలయినట్లుప్రకటించింది. వీరిలో 86 మంది ఆసుపత్రిలో చేరగా కొందరిపరిస్థితి విషమంగా ఉందని ప్రకటించింది. కాగా డ్రోన్‌నుంచి వెలువడిన పదునైన ఆయుధం అబూదాబిలో ఒక పాకిస్తాన్ జాతీయుడిని అంతంచేసింది.

## ఇద్దరు తహశీల్దార్లు, వీఆర్వోపై క్రమశిక్షణ చర్యలు

**విజయవాడ, మార్చి 17, ప్రభాతవార్తప్రతినిధి:** ఇద్దరు తహశీల్దార్లు, ఒక వీఆర్వోల పై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2016లో గురజాల మండలం గొట్టిముక్కలలో 108 మంది పేరిట ప్రభుత్వ భూములకు బోగస్ పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసిన వ్యవహారంలో, అప్పటి గొట్టిముక్కల వీఆర్వో కోటేశ్వరరావు, గురజాల ఎమ్మార్వోలు ఫణీంద్రబాబు, ప్రవీణ్ కుమార్‌లు బాధ్యులుగా విచారణలో విజిలెన్స్ కమిటీ తేల్చి చెప్పింది. వీఆర్వో కోటేశ్వరరావు, ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్‌లకు 3 ఏళ్ల ఇంక్రిమెంట్లు, ఎమ్మార్వో ఫణీంద్రబాబుకు రెండేళ్ల ఇంక్రిమెంట్లు నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని పల్నాడు కలెక్టర్‌కు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిసాయిప్రసాద్ ఉత్తర్వులు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

## దివ్యాంగ శక్తి పథకం నేటి నుంచి అమలు

>>బాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, మాధవ్ బస్సుల్లో ప్రయాణించనున్నారు. అనంతరం దివ్యాంగులకు సీఎం ఆత్మీయ విందు ఇవ్వనున్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రేపు దివ్యాంగ్‌శక్తి కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు. అనంతరం ఆర్టీసీ బస్సులో దివ్యాంగులతో కలిసి ఎమ్మెల్యేలు ప్రయాణించనున్నారు. ఆ తర్వాత దివ్యాంగులతో కలిసి ప్రజా ప్రతినిధులు భోజనం చేయనున్నారు. రాష్ట్రంలోని 11.16 లక్షల దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం ఉగాది కానుకగా దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించనుంది. ఈ పథకం ద్వారా 12.76 లక్షల మంది దివ్యాంగులతో పాటు వారివెంట వచ్చే సహాయకులకు లబ్దిచేకూరనుంది. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు సహాయకులుగా వచ్చే వారికి 50శాతం టికెట్ రాయితీ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**దివ్యాంగ శక్తి:** 40 శాతం వైకల్యం దాటిన దివ్యాంగులకు పథకం వర్తించనుంది. 4 నుంచి 21 వర్గాల దివ్యాంగులకు దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రభుత్వం విస్తరించింది. ఈ పథకం అమలు కోసం ఏడాదికి రూ.207 కోట్లను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుంది. 40 శాతం వైకల్యం దాటిన దివ్యాంగులకు పథకం వర్తించనుంది. 4 నుంచి 21 వర్గాల దివ్యాంగులకు దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రభుత్వం విస్తరించింది. ఈ పథకం అమలు కోసం ఏడాదికి రూ.207 కోట్లను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుంది. ఇంద్రధనస్సు "లో భాగంగా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని ఏపీఎస్ ఆర్టీసీ తెలిపింది. ఈ కార్యక్రమాన్ని మార్చి 18న సీఎం చంద్రబాబు లాంఛనంగా ప్రారంభిస్తారని ఆర్టీసీ ఎండీ ఆర్టీసీ ఎండీ ప్రకటించారు. 40 శాతం, ఆపైన వైకల్యం ఉన్న దివ్యాంగులను బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తారని చెప్పారు. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అమలు చేస్తామన్నారు.

# 164మందికి కళారత్న ఉగాది పురస్కారాలు

**విజయవాడ, మార్చి 17, ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీ పరాభావ నామ సంవత్సర ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పురస్కారాలు ప్రకటించింది. కళారత్న అవార్డులకు 40 మందిని, ఉగాది పురస్కారాలకు 124 మందిని, మొత్తంగా 164 మందిని ఎంపిక చేసింది., సాహిత్య విభాగంలో మన్నవ సత్యనారాయణ, ఆర్ఎ పద్మనాభరావు, నాగభైరవ ఆదినారాయణ, వెంకట సూర్యారావు, సుందరం, నారాయణరావు, కామేశ్వరరావు, బడ్డెళ్ళపాటి శ్రీ గోపాల కృష్ణలకు కళారత్న అవార్డులకు ఎంపికయ్యారు. గురువారం జరిగే ఉగాది వేడుకల్లో ఈ అవార్డును ప్రధానం చేయనున్నారు.

## మునిసిపాలిటీల్లో నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన

>> ముగియనుంది. నెల్లూరు, ఆకివీడు, జగ్గయ్యపేట, కొండపల్లి, దాచేపల్లి, గురజాల, దర్శి, బుచ్చిరెడ్డి పాలెం, బేతంచర్ల, పెనుకొండ, కమలాపురం, రాజంపేట, కుప్పం పుర, నగరపాలక సంస్థల, నగర పంచాయతీల్లో పాలకవర్గాల పదవీ కాలం ఈ ఏడాది నవంబరు 21తో ముగియనుంది. వీటిలో రెండో విడతలో ఎన్నికలు నిర్వహించారు. గత వైకాపా ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పుర, నగరపాలక సంస్థల్లో గత 20 నెలల్లో అభివృద్ధికి అడుగులు పడ్డాయి. నిర్వహణ లోపంతో పెద్ద గోతుల్లా మారిన రోడ్లకు మంచి రోజులొచ్చాయి. పాడైన కాలువలకు సైతం మరమ్మతులు చేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర వాటా నిధులివ్వని కారణంగా అసంపూర్తిగా నిలిచిపోయిన అమృత్ పథకంలో తాగునీటి ప్రాజెక్టుల కూటమి ప్రభుత్వంవచ్చాక పనుల్లో కదలిక వచ్చింది. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు రుణంతో చేపట్టిన పనులకు మళ్లీ టెండర్లు పిలిపి పనులు ప్రారంభిస్తున్నారు. మూత పడిన అన్న క్యాంటీన్లు మళ్లీ తెరవడంతో పేదల ఆకలి బాధలు తీరుతున్నాయి. నిధుల వ్యయంపై ప్రతిబంధకంగా ఉన్న సీఎఫ్ఎంఎస్ నుంచి పుర, నగరపాలక సంస్థలను ప్రభుత్వం మినహాయించడం వల్ల అవి ఊపిరి పీల్చుకున్నాయి. గతంలో ప్రతి పనికీ బిల్లుల కోసం సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేవారు. చెల్లింపుల్లో తీవ్రమైన జాప్యంతో పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకొచ్చేవారు. ఆస్తి పన్ను, పన్నేతరాల కింద వచ్చే ఆదాయం పుర, నగరపాలక సంస్థల పరిధిలోనే ఖర్చు చేసే అవకాశం 8 నెలల క్రితం కల్పించారు.

# సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

>> కుంటున్న ప్రతి ఒక్కరిదీ ఈ పార్టీ. విలువలు, విశ్వసనీయత అన్న రెండు పదాల మీదే మన పార్టీ పుట్టింది. కాబట్టి మన పార్టీ ఎప్పటికీ కూడా విలువలు, విశ్వసనీయతకు కట్టుబడి ఉంటుంది. అధికారంలో లేనప్పుడు కార్యకర్తలకు మరింత తోడుగా, దగ్గరగా ఉండాలి. మన పార్టీ చరిత్ర 15 ఏళ్ల ప్రయాణం చూస్తే, మనం కేవలం 5 ఏళ్లు మాత్రమే అధికారంలో ఉన్నామన్నారు. విపక్షంగానే మొదలయ్యాం. మనకు పోరాటాలు కొత్తకాదు. మనకంటూ ప్రత్యేక ట్రేడ్ మార్క్ ఉంది. చరిత్రలో లేని విధంగా పోరాటాలు చేశామన్నారు. మన 5 ఏళ్ల పాలనలో దాదాపు రూ.3.31 లక్షల కోట్లు అప్పు చేస్తే, అందులో డీబీటీ ద్వారా ఏకంగా రూ.2.73 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మలకు ఇచ్చాం. ఆధార్‌తో సహా అన్ని వివరాలు చెప్పగలమన్నారు. అదే ఈ ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేసిన అప్పు రూ.3.30 లక్షల కోట్లు దాటింది. మరి హామీల అమలు లేదు. సూపర్‌సిక్స్, సూపర్‌సిక్స్ గాలికెగిరిపోయాయి. కానీ విపరీతంగా అప్పు చేస్తున్నారు. మరి ఆ డబ్బంతా ఎక్కడికి పోతోంది? దీన్నే ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రతి ఇంట్లో చర్చ జరుగుతుంది. జగన్ చేయగలిగాడు. చంద్రబాబు ఎందుకు చేయడం లేదు అని. కారణం, జగన్ ప్రతి అడుగులో కూడా ప్రజలు, పేదల గురించి ఆలోచించాడు. ప్రతి అడుగులో కూడా అవినీతి జరగకుండా, ప్రతి ఇంటికి లబ్ధి నేరుగా పంపించాడు. ఈ ప్రభుత్వ మైండ్‌సెట్ సరిగ్గా లేదు. విద్యా రంగాన్ని నాశనం చేశారు. ఇంగ్లిష్ మీడియమ్ తీసేశారు. విద్యాదీవెన, వసతి దీవెన లేవు. రైతులకు పెట్టుబడి సాయం లేదు. ఉచిత పంటల బీమా లేదు. గిట్టుబాటు ధర లేదు. పేదలకు ఉచిత వైద్యం లేదు. ఆరోగ్యశ్రీ గాలికెగిరిపోయింది. నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్యం చేయడం లేదు. రూ.6 వేల కోట్లకు పైగా బకాయి పడ్డారువీరి మైండ్‌సెట్ పేదలు, అక్కచెల్లెమ్మలకు మంచి చేయాలని కాదు. చివరకు మహిళలకు సున్నా వడ్డీ కూడా చంద్రబాబు ఎగ్గొట్టాడు. మనం అమలు చేసిన చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, తోడు, చేదోడు ఏదీ కనిపించడం లేదు. 31 లక్షల ఇళ్ల పట్టాలు, 20 లక్షల ఇళ్ల మంజూరు. 10 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం. ఇప్పుడు ఏవీ లేవు. అంతా దోచుకో. తినుకో. పంచుకో. ఎక్కడిక్కడ యథేచ్ఛ దోపిడి తప్ప. అన్నారు. ఈ ప్రభుత్వంలో చూస్తుండగానే మూడు బడ్జెట్లు అయిపోయాయి. ఇంకా మిగిలింది రెండు బడ్జెట్లు మాత్రమే. ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబును తిడుతున్నారు. చూస్తుండగానే మరో ఏడాదిన్నర గడుస్తుంది. ఆ తర్వాత నా పాదయాత్ర మొదలవుతుంది. ఏడాదికి పైగా నేను ప్రజల్లో ఉంటాను. మీరూ ప్రజలతో మమేకం కండి. వారి సమస్యలపై పోరాడండి. రాబోయేది మనందరి ప్రభుత్వం. జగన్ 2.ఓలో కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని, ప్రతి ఒక్కటీ వారి ద్వారానే అమలు చేస్తామని వైయస్ జగన్ వివరించారు. ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం పార్టీ ఇంఛార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి. ఎమ్మెల్యే. ఒంగోలు నియోజకవర్గం పార్టీ ఇంఛార్జ్ చుండూరి రవిబాబుతో పాటు, జిల్లాలో పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

18-03-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
చతుర్దశి ఉ.8.24
పూర్వాభాద్ర తె.5.20
వర్జ్యం : మ.2.15-3.51
దు. ఉ.12.20-మ.1.53
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** అనుకోని సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఇతరుల విషయంలో జోక్యం వద్దు. బంధువుల కలయిక.

**వృషభం:** ఎలర్జీ వంటి స్వల్ప ఇబ్బందుల పట్ల అప్రమత్తంగా ఉండటం చెప్పదగినది. కోపతాపాలకు దూరంగా వుండండి.

**మిథునం:** చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. మీకు నచ్చిన వ్యక్తులతో ఆనందంగా గడుపుతారు.

**కర్కాటకం:** కీలక విషయాలు వాయిదాలు వేయకుండా వెనువెంటనే నిర్ణయాలు తీసుకోని లాభపడగలుగుతారు.

**సింహం:** ఉద్దేశ్యపూర్వకంగానే సెక్యురేషన్‌కు దూరంగా వుంటారు. ఋణాలు తీరి ప్రశాంతత లభిస్తుంది. వాహన సౌఖ్యం.

**కన్య :** మీ ఉన్నతిని చూసి ఓర్వలేనివారు అధికమవుతారు. విలాసాలకు అధికంగా ధనం ఖర్చుచేస్తారు. ఆరోగ్యం జాగ్రత్త.

**తుల :** జీవితభాగస్వామితో కొద్దిపాటి విభేదాలు సూచిస్తున్నాయి. సంయమనం పాటించండి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృశ్చికం:** ఏదో కొద్దిపాటి విషయాలు మినహా ఈ రోజు అన్ని విధాలా అనుకూలంగా వుంటుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**ధనుస్సు:** నూతన వ్యక్తులతో, పెద్దలతో పరిచయాలు ఏర్పడతాయి. తద్వారా మీరు కొంతమేర లాభపడతారు.

**మకరం:** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. కుటుంబ సమస్యల నుండి బయటపడతారు. ఆస్తి వివాదాలు తీరుతాయి. ధన లాభం.

**కుంభం:** పారిశ్రామిక, వైద్య, కళారంగాలలోని వారికి కూడా బాగానే ఉంటుంది. నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు.

**మీనం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అధిగమిస్తారు. స్థాన మార్పులు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఆత్మనిర్భర మిషన్ ద్వారా పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడమే లక్ష్యం

కేంద్ర సహాయ మంత్రి భగీరథ్ చౌదరి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశ్నకు లోక్‌సభలో కేంద్ర మంత్రి సమాధానం

**విజయవాడ, మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసమే కేంద్ర ప్రభుత్వం 2025 అక్టోబర్ 1వ తేదిన పప్పు దినుసులలో ఆత్మనిర్భర మిషన్ అనే కేంద్ర ప్రాయోజిత పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు మంత్రి వివరించారు. పప్పు దినుసులలో ఆత్మనిర్భర మిషన్ కింద పప్పుధాన్యాల సేకరణ కోసం వార్షిక లక్ష్యాలు, పప్పు ధాన్యాల సేకరణ, ఆంధ్రప్రదేశ్ కోసం జిల్లాలో సేకరించిన పప్పుల మొత్తానికి సంబంధించిన వివరాలు కోరుతూ విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మంగళవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. కేంద్ర క్యాబినెట్ 202526 నుంచి 203031 మధ్య ఆరు సంవత్సరాల కాలంలో రూ.11,440 కోట్లతో దేశీయంగా ఉత్పత్తిని పెంచడం, పప్పుధాన్యాలలో స్వయం సమృద్ధిని సాధించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడంతో పాటుగా రైతులకు లాభదాయకమైన ధరలను నిర్థారించడానికి, రాష్ట్రాలు చేసిన అభ్యర్థనల ఆధారంగా ధర మద్దతు పథకం (ప్రైస్ సపోర్ట్ స్కీం) నిబంధనల ప్రకారం, నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఏఎఫ్ఈడి), నేషనల్ కోఆపరేటివ్ కన్జ్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సిసిఎఫ్) ద్వారా నమోదిత, ఇష్టపడే రైతులందరి నుండి పప్పు దినుసుల సేకరణకు ఆత్మనిర్భర మిషన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని మంత్రి భగీరథ్ చౌదరి తెలిపారు. 2025–26లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 101172 మెట్రిక్ టన్నుల మేర పప్పు ధాన్యాల ఉత్పత్తి జరిగిందన్నారు.

# ఎసిబి వలలో టౌన్ ప్లానింగ్ సర్వేయర్

### రిపోర్టు ఇచ్చేందుకు రూ.50,000 లంచం తీసుకుంటూ దొరికిన వైనం

**తాడేపల్లిగూడెం, మార్చి 17 ప్రభాతవార్త:** ఏసీబీ వలలో మరో అవినీతి చేప చిక్కుకుంది. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో ఏసీబీ వరుస దాడులు చేస్తున్న నేపథ్యంలో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఉద్యోగి 50,000 లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులకు పట్టుబడటం మంగళవారం చోటుచేసుకుంది. జిల్లావ్యాప్తంగా మున్సిపాలిటీల్లో టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అవినీతి పేరుకుపోయిందని పలుమార్లు ప్రభాతవార్త వార్తలు ప్రచురించింది. ఈ క్రమంలో తాజాగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ విభాగంలో వల్లం తిప్పుతున్న పెద్ద చేపను ఏసీబీ అధికారులు టార్గెట్ చేశారు. భూమిని కొలవడానికి సరిహద్దులు గుర్తించడానికి లే అవుట్లను నిర్ధారించడానికి కొలతలు వేసేందుకు నాకెంత, రిపోర్టు ఇవ్వడానికి నాకు ఎంత అంటూ అవినీతి సొమ్ము కూడబెట్టుతూ వస్తున్న తాడేపల్లిగూడెం పురపాలక సంఘం సర్వేయర్ రౌతు రామకృష్ణ లంచం సొమ్ముతో ఏసీబీ అధికారులకు చిక్కారు. ఎంతోకాలంగా సర్వేయర్ రౌతు రామకృష్ణ పై అవినీతి ఆరోపణలు ఉన్నాయి భూ సర్వేలకు అందుకు సంబంధించిన సర్వే రిపోర్ట్ ఇచ్చేందుకు భూ యజమానుల నుంచి పెద్ద మొత్తంలో సొమ్ము డిమాండ్ చేసే వారనే ఆరోపణలు ఎప్పటినుంచో వినవస్తున్నాయి. భూ యజమానులు తమ పనులు త్వరితగతిన చేయించుకునేందుకు సర్వేయర్ రామకృష్ణ అడిగింది ఇవ్వక తప్పని పరిస్థితి దీంతో ఆయన ఉద్యోగం కొలతలు కొద్ది లక్షలు కొద్దీ కొనసాగుతోంది. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన కడకట్లలో కమ్ముల రాధా 1800 చదరపు గజాలు స్థలం ఉంది. ఆమె ప్రస్తుతానికి ఏలూరులో నివాసం ఉంటుంది. తన స్థలానికి చెందిన సర్వే రిపోర్ట్ కావాలని సర్వే రామకృష్ణను పలుమార్లు అడిగి చూసింది. అడిగిన ప్రతిసారి ఏదో ఒక సాకు చెబుతూ రోజులు గడుపుతూ వచ్చారు. ఈ క్రమంలో రాధ తాడేపల్లిగూడెం చెందిన ఒక వ్యక్తిని ఆశ్రయించింది సర్వే రిపోర్ట్ అందుకు కెజిడి అనే వ్యక్తి సర్వేయర్ రౌతు రామకృష్ణతో మాట్లాడగా రిపోర్టు ఇవ్వడానికి రూ 50 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో కెజిడి ఏలూరు ఏసీబీ అధికారులను సంప్రదించారు. మంగళవారం సర్వేయర్ రౌతు ఇంట్లోనే లంచం ఇస్తుండగా ఏసీబీ డి.ఎస్.పి జీవి కృష్ణారావు ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్లు ఎం బాలకృష్ణ కే శ్రీనివాస్ ఇతర అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం ఎసిబి అధికారులు రామకృష్ణ ఇంటిని కార్యాలయాన్ని సోదా చేశారు. రామకృష్ణను అరెస్టు చేసి విచారణ అనంతరం రాజమండ్రి రిమాండ్ కు తరలిస్తారని తెలిపింది.

## లారీ, ద్విచక్రవాహనం ఢీ, ఇద్దరు యువకులు మృతి

**గోనెగండ్ల,మార్చి 17 ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా గోనెగండ్ల, లారీ, ద్విచక్రవాహనం ఢీ కొన్న ప్రమాదంలో బోయ మునిస్వామి(31), మొండి వీరేష్(17) ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు,మృతుల బంధువులు అందించిన సమాచారం మేరకు బోయ మునిస్వామికి తల్లి మద్దమ్మ ,భార్య సిమాన్ ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు.మొండి వీరేష్‌కు తల్లి అప్పమ్మ ఉన్నారు.ఈ రెండు కుటుంబాలది కూలీ పనుల చేసి జీవనం సాగించే వారు. బోయ మునిస్వామి,మొండి వీరేష్‌లు చిన్నప్పటి నుంచి ఇద్దరు మంచి స్నేహితులు స్వంత గ్రామంలో పనులు లేక పోవడంతో జీవనం కష్టంగా మారింది.దీంతో ఈ రెండు కుటుంబాల సభ్యులు తెలంగాణా రాష్ట్రం,నాగర్ కర్నూలులోని ఇప్పలపల్లి గ్రామంకు గత రెండు నెలల క్రితం బ్రతుకు తెరువు కోసం వలస వెళ్లారు.అయితే అక్కడ పనులు చేసుకొని కొంత కూడా బెట్టుకున్నారు.ఉగాది పండుగకు స్వంత గ్రామం చేరాలని తలచి కుటుంబసభ్యులతో మంగళవారం తెల్లవారు జామున 5 గంటలకు ఇప్పలపల్లి నుంచి గోనెగండ్లకు చేరారు.ఉదయం 10.45 గంటలకు ఇద్దరు స్నేహితులు మునిస్వామి, మొండి వీరేష్‌లు గంజహళ్లి క్రాస్‌రోడ్డు దగ్గర ఉన్న తమ ద్విచక్రవాహనంలో వచ్చారు.అక్కడ స్వంత పని ముగించుకొని బస్టాండ్ దగ్గరకు ఇద్దరు ద్విచక్రవాహనం(ఏపీ 39, జే క్యూ 6383)పై వెలుతుండగా ఎమ్మిగనూరు వైపు నుంచి (ఏపీ 21 వై 6667) అనే లారీ వేగంగా అజాగ్రత్తగా వచ్చి వెనుక వైపు నుంచి ఢీ కొన్నది. దీంతో ద్విచక్రవాహనంపై వస్తున్న బోయ మునిస్వామి, మొండి వీరేష్‌లు ద్విచక్రవాహనంతో పాటు లారీ చక్రాల కింద పడ్డారు.మునిస్వామి అక్కడికక్కడే మృతి చెందారు. వీరేష్‌ను చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వీరేష్ మృతి చెందారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రబాబు తెలిపారు. స్వంత గ్రామానికి చేరుకున్న కొన్ని గంటలలోనే ఇద్దరు స్నేహితులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

### కుంటిసాకులతో పెన్షన్లు రద్దు చేయడం

## సరైన చర్య కాదు: సిపిఐ ఈశ్వరయ్య



**విజయవాడ, మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి:** కుంటిసాకులతో పెన్షన్లు రద్దు చేయడం సరైంది కాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని, గత ఎన్నికల సమయంలో ఆర్భాటంగా హామీలిచ్చి, అధికారం వచ్చిన తర్వాత కొత వేయడం ప్రారంభించిందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ భరోసా పథకంలో అర్హులైన కొత్తవారికి పెన్షన్లు అందని ద్రాక్షలా మారినట్లు తెలిపారు. అర్హులైన వారిని కొత్తగా పెన్షన్ జాబితాలో చేర్చడం లేదని, ఉన్న పెన్షన్లను కుదించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. 2024 మార్చి ఎన్నికల సమయంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 66,34,372 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య 60,96,108కి పడిపోయిందని తెలిపారు. ఈ రెండేళ్లలోనే 5,38,634 పెన్షన్లు తొలగించినట్లు పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి నాటికి 60,96,108 మంది పెన్షన్ దారులకు ప్రభుత్వం ప్రతినెలా రూ.2,632 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ లెక్కన ఏడాదికి మొత్తం రూ.31,554 కోట్లు అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్లో మాత్రం రూ.27,719 కోట్లు కేటాయించిందన్నారు. ఈ కేటాయింపుల ప్రకారం చూస్తే 53.50 లక్షల మంది పెన్షన్‌దారులకు మాత్రమే ఈ మొత్తం సరిపోతుందని తెలిపారు. ప్రభుత్వం మరో 7,45,993 పెన్షన్లను కత్తిరించే ప్రణాళికలో ఉందని ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు.



## క్రైస్తవుల సమస్యల పరిష్కారం దిశలో ప్రభుత్వం

• నారా లోకేష్ • మంత్రిని కలిసిన మతపెద్దలు

**విజయవాడ,మార్చి17 ప్రభాతవార్త ప్రతినిధి:** క్రైస్తవుల సమస్యల పరిష్కారం దిశలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.గుంటూరులో క్రైస్తవ భవన్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. క్యాథలిక్ బిషప్‌లతో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా తన ట్విట్టర్ (ఎక్స్) ఖాతా ద్వారా వెల్లడించారు. గౌరవనీయులైన క్యాథలిక్ బిషప్‌లకు ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలిపారు.ఈ భేటీ సందర్భంగా సామాజిక సాధికారత కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలు, రాష్ట్ర అభివృద్ధిలో చర్చి పోషించాల్సిన పాత్రపై ప్రధానంగా చర్చించినట్లు లోకేశ్ తన పోస్టులో వివరించారు. దీంతో పాటు విద్య, ప్రాతినిధ్యానికి సంబంధించి బిషప్‌లు లేవనెత్తిన అంశాలపైనా చర్చలు జరిపినట్టు ఆయన తెలిపారు.

## హెచ్‌పివి వ్యాక్సిన్ వినియోగంలో ముందు వరుసలో ఎపి!

**విజయవాడ, మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి:** స్త్రీలలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా నియంత్రించే హెచ్‌పివీ వ్యాక్సిన్ వినియోగంలో ముందు వరుసలో ఏపీ నిలిచింది. ఈ మేరకు వైద్య,ఆరోగ్యశాఖ వెల్లడించింది. వ్యాక్సిన్ పంపిణీ ఇటీవలే పంపించారు.ఇక వ్యాక్సిన్ పంపిణీలో అగ్రస్థానంలో మధ్య ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, ఒడిశా, మిజోరం రాష్ట్రాలు ఉన్నాయి.కేవలం 2 వారాల్లో 3 లక్షల మంది 14 ఏళ్ల బాలికలకు టీకాలును ఏపీలో అందించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించేందుకు, 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీ ప్రభుత్వం అందిస్తున్నది.ఈ వ్యాక్సిన్ 14 ఏళ్ళ బాలికలకు వారి తల్లిదండ్రులు సమ్మతి,వ్యక్తిగత ఆసక్తిపై అందిస్తారు. దేశంలోనే, రాష్ట్రంలో సర్వైకైల్ క్యాన్సర్ అధికంగా ఉన్న దశలో వ్యాక్సిన్‌తో వ్యాధి రాకుండా చర్యలు చేపట్టింది.

# ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఓ అండ్ ఎం పనులు

- **రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు**
- **మే 15 నాటికి నిర్వహణ మరమ్మతు పనులు పూర్తి చేయాలని మంత్రి నిమ్మల ఆదేశం**



**విజయవాడ, మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి:** వచ్చే ఖరీఫ్ ప్రారంభానికి ముందే అంటే మే 15వ తేదీ నాటికి ఓ అండ్ ఎం పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు. ఆదేశించారు మంగళవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఓ అండ్ ఎం పనుల పై ఇరిగేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్ని వేల కోట్లు ఖర్చుపెట్టి ఇరిగేషన్ పనులు చేసినా, నిర్వహణ సరిగా లేకపోతే, అంటే ఓ అండ్ ఎం పనులు ఏటా చేయకపోతే బూడిదలో పోసిన పన్నీరు అవుతుందన్నారు. వందల,వేల కోట్లు పెట్టి ప్రాజెక్టులు నిర్మిస్తే, వైసిపి ప్రభుత్వం మెయింటెన్స్ కూడా లేకుండా గాలికొదిలేసిందని మంత్రి విమర్శించారు. గత ప్రభుత్వంలో కనీసం కాలువల్లో తట్ట మట్టి తీయకపోగా, షట్టర్లు,డోర్లు, గేట్లకు మరమ్మత్తులు చేయ లేదన్నారు. కనీసం గ్రీజు కూడా పెట్టలేదని చెప్పారు. గత పాలకులు చేసిన తప్పిదాలే మన పాలిట శాపాలయ్యాయని అన్నారు. వీటన్నింటినీ సరిచేసుకుంటూ, ఇరిగేషన్ రంగాన్ని గాడిలో పెడుతున్నామని ఆయన వివరించారు. ఎంత దారుణం అంటే గత వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్లలో నిర్వహణ పనుల నిమిత్తం 200 కోట్లు కూడా ఖర్చు చేయకపోతే, కూటమి ప్రభుత్వం మొదటి రెండేళ్ళలోనే 878 కోట్లు మంజూరు చేసి ఖర్చు చేశామన్నారు . గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని 2026 ఖరీఫ్ ప్రారంభానికి ముందే నీటిపారుదల వ్యవస్థలను సాధారణ స్థితికి తీసుకురావాలన్నారు. అందుకుగాను ఓ అండ్ ఎం పనులు తక్షణమే చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అంతేకాక అత్యవసర పనులన్నీ అత్యంత నాణ్యతతో చేయాలని సూచించారు.

రైతుల అవసరాల కోసం చెరువుల్లో పూడిక తీసిన మట్టిని, క్యూబిక్ మీటర్ 1 రూపాయి కే, రైతులకు సరఫరా చేసేలా అనుమతులు కూడా ఇచ్చామని ఆయన అన్నారు. ఈ సమావేశం లో కడా కమిషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మానెక్‌షాతో తిరుపతి ఐఐటి ఒప్పందం



**శ్రీకాళహస్తి,మార్చి 17 ప్రభాతవార్త:** తిరుపతి ఐఐటి మరో అడుగు ముందుకు వేసింది. సామాజిక కార్యక్రమాలతో ఆకట్టుకుంటున్న తిరుపతి ఐఐటి ప్రగతి పథకంలో ఎన్నో ఒప్పందాలు చేసుకుంటూ తమ ప్రాభవాన్ని పెంచుకుంటుంది. తిరుపతి ఐఐటి డైరెక్టర్ డాక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ ఎన్నో ఆలోచనలతో ముందుకు వెళుతున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం 'మానెక్‌షా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పర్ నేషనల్ సెక్యూరిటి స్టడీస్ అండ్ రిసెర్చ్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది, దాంతో మరో విజయం దిశగా తిరుపతి ఐఐటి ముందడుగు వేసింది.ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఈభాగస్వామ్యం పరస్పర ఆసక్తి ఉన్న కీలక రంగాలైన పరిశోధన, అభివృద్ధి, విద్య మరియు శిక్షలలో సహకారారినిక ఒక బలమైన చట్రాన్ని ఏర్పాటు చేసుకుందన్నారు. మన సాయుధ దళాలకు,జాతీయ భద్రతా సంస్థలకు మద్దతుగా నిపుణుల మార్గదర్శకత్వం అందించటం,సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించుకోవటంలో రెండు సంస్థలు ఒప్పందం చేసుకుందని డైరెక్టర్ వివరించారు. ఈ ఒప్పందం భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, డిఆర్‌డిఓ, ఎన్ఎస్‌సిఎస్,ఇస్రో మరియు ఇతర భద్రతా సంస్థలతో సహా ప్రముఖ భాగస్వాముల సహకారంతో రక్షణ, ఎరో స్పేస్,అంతరిక్ష సాంకేతికతలతో అధునాతన పరిశోధన, అభివృద్ధి చేపట్టడానికి మార్గాలను తెరుస్తుందని వివరించారు. ఈ సహకారం ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్ళటానికి జాతీయ భద్రతకు అర్థవంతంగా దోహదపడే మా భాగస్వామ్యం కీలకం అన్నారు.

## మైనర్‌బాలిక అత్యాచారం కేసు

### నిందుతునికి 20 యేళ్లు జైలు

**విజయవాడ, మార్చి 17 ప్రభాతవార్తప్రతినిధి:** మైనర్ బాలికను బలవంతంగా అత్యాచారం చేసిన కేసులో నిందితునికి 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.2,000 జరిమానా ఫోక్సో కోర్ట్ జడ్జ్ వేల్పుల భవాని విధించారు. ఇబ్రహీం పట్నం పోలీసు స్టేషన్ పరిధిలో కొండపల్లి ఏరియాకు చెందిన మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితునిపై ఫోక్సో చట్టపరిధిలో కేసును నమోదు చేసారు. ఈ కేసు విచారణలో నిందితుడు కాండ్ర కొండ ఆంథోని (37) ముద్దాయి అరెస్ట్ చేసి కోర్టులో ఏ.సి.పి. హనుమంతరావు హాజరు పరిచారు. పోక్సో కోర్టు ఈ కేసును విచారించి నిందితునికి శిక్షను ఖరారు చేసింది. ఇదిలా ఉండగా...

**కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష**

బాపట్ల జిల్లా చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు సంవత్సరాల మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి ఒంగోలు పొక్సో కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శైలజ 10 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ. 5000 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. నిందితుడు బిట్ల అలియాస్ పిట్ల సూరిబాబు(45) కాలనీలో నిర్మాణంలో ఉన్న ఒక డాబా ఇంటి లోనికి తీసుకొని వెళ్ళి అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

బాలిక జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలుపగా, బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీరాల రూరల్ ఎస్ ఐ చంద్ర శేఖర్ పొక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సదరు కేసు ఒంగోలు పొక్సో కోర్టులో విచారణకు రాగా సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చి సమయానికి కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా కేసు దర్యాప్తును వేగవంతంగా నిర్వహించి, సమర్థవంతంగా ట్రయల్ నిర్వహించి నిందితుడికి జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకున్నారు.

# తిరుమల సమాచారం



## శాస్త్రోక్తంగా "ఉగాది" కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల, మార్చి 17ప్రభాతవార్త ప్రతినిధి:** మరి కొన్నిగంటల్లో కన్నులపండువగా తిరుమలలో రేపు గురువారం ఉదయం జరుపుకోనున్న తెలుగు నూతన సంవత్సరం "పరాభవనామ"ఉగాది పర్వదినం పురస్కరించుకుని మంగళవారం ఉదయం తిరుమలేశుని ఆలయంలో ఆగమోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. టిటిడి పాలకమండలి పెద్దలు, ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేశారు. ఉదయం 6గంటల నుండి 10గంటల వరకు సాగింది. ఆలయంలోపల బంగారు వాకిలి నుండి ఉప ఆలయాలు, మహద్వారం వరకు నీటితో శుభ్రంగా కడిగారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంద ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేశారు. ఆలయంలో అష్టదళ పాద పద్మారాధన సేవ రద్దయ్యింది. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఏడాదిలో నాలుగుసార్లు ఉగాది ఆస్థానం, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారాల్లో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో జెఇఒ డాక్టర్ ఎ.శరత్, ఆలయ అధికారులు ఉన్నారు.

## అన్నమయ్య కీర్తనలు ప్రజల్లోకి టిటిడి కృషి అద్వితీయం

పదాల్లో పరమార్థం.. అన్నమయ్యలో అపూర్వ వైచిత్రి: వక్తలు

**తిరుమల,మార్చి 17ప్రభాతవార్తప్రతినిధి:** వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యుల పదాల్లో ఆధ్యాత్మికతతో పాటు జీవన సారాంశం దాగి ఉందని, యువతలో భక్తి, నైతికత పెంపొందించడంలో అన్నమయ్య కీర్తనలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పలువురు వక్తలు తెలిపారు. అన్నమయ్య కీర్తనలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి టిటిడి చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో తాళ్లపాక అన్నమాచార్యుల 523వ వర్ధంతి ఉత్సవాల్లో మంగళవారం వక్తలు పాల్గొన్నారు. తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనల్లో ఉన్న భావ వైవిధ్యం అపూర్వమని తిరుపతి ఎస్వీయూనివర్సిటీ సంస్కృత విభాగ ఆచార్యులు డాక్టర్ శిరీష తెలిపారు. భక్తి, శృంగారంతో పాటు నైతిక విలువలను అన్నమయ్య ఎంతో మధురంగా వ్యక్తం చేశారని చెప్పారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఎస్వీ ప్రాచ్య పరిశోధనా సంస్థ విశ్రాంత ఆచార్యులు ఆచార్య గోవిందరాజు మాట్లాడుతూ తాళ్లపాక అన్నమయ్యతో పాటు ఆయన వంశీకులు చేసిన సేవలు అమూల్యమని అన్నారు. వారి సాహిత్యం భక్తి, ఆధ్యాత్మికత, సంస్కృతిని కలిపిన గొప్ప సంపదగా నిలిచిందని తెలిపారు. ఈ సాహిత్యాన్ని ఆంధ్ర వేదంగా చెప్పవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఈ సంపదను అందించడం అవసరమని సూచించారు

## యువత సనాతనధర్మం పట్ల విశ్వాసం ఉంచాలి

ఉగాది పర్వదినం అందరికీ శుభాలనివ్వాలి: మంత్రి కొల్లు

**తిరుమల,మార్చి 17ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి ధార్మిక కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, యువత సనాతన ధర్మం పట్ల విశ్వాసం కలిగి ఉండాలని రాష్ట్రమంత్రి కొల్లురవీంద్ర తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా, పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేశ్ చొరవ అభినందనీయమన్నారు. తెలుగునూతన సంవత్సరం ఉగాది పర్వదినం తెలుగుప్రజలందరికీ శుభాలు కలగాలని, సుఖసంపదలతో వర్థిల్లాలని ఆయన ఆకాంక్షించారు. తిరుమల ఆలయంలో ఏర్పాట్లు, అలంకరణలు అద్భుతంగా చేపడుతున్నారని అభినందించారు. మంగళవారం ఉదయం ఆలయ శుద్ధి తరువాత శ్రీవారి దివ్యరూపం మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నారన్నారు. ఈ శుభవేళ దేవదేవుడ్ని దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. కుటుంబసభ్యులతో కలసి వచ్చిన మంత్రి కొల్లురవీంద్ర ఉదయం ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## శ్రీవారి సేవలో తమిళనాడు నేతలు

**తిరుమల,మార్చి 17ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తమిళనాడు, తెలుగు రాష్ట్రాల ప్రజలకు అంతా శుభాలు కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం ప్రత్యేక విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో తమిళనాడు మంత్రి కెకెఎస్ రామచంద్రన్, సివి గణేశన్ ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎస్వి అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల,మార్చి 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరంగా రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ట్రస్ట్‌కు దాతలు విరాళాలందిస్తున్నారు. మంగళవారం ఉదయం గుంటూరుకు చెందిన వేంకటేశ్వర పౌల్ట్రీస్ సంస్థ అధినేత వేంకటేశ్వర రావు శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 10,01,116 రూపాయలు విరాళం డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు.

## ధ్వజారోహణంతో కోదండరాముని బ్రహ్మోత్సవాలు

**తిరుపతి,మార్చి 17ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తుల రామ నామ స్మరణతో ఆలయం మార్మోగింది. కంకణబట్టార్ భరత్ కుమార్ దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం 8 నుండి 9 గంటల మధ్య మేషలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామస్మరణ, రామనామ జపముల మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిష్టింపచేశారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడంతోపాటు సమాజశ్రేయస్సుకు, వంశాభివృద్ధికి ధ్వజారోహణం దోహదపడుతుందని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## తిరుపతిలో వైసిపి నిరసన

**తిరుపతి,మార్చి 17ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఛైర్మన్‌ను కలసి నిరసన తెలియజేయడానికి వెళుతున్న వైసిపి నాయకులను, మహిళలను టిడిపి నేతలు అడ్డుకుని దాడిచేశారని ఆరోపిస్తూ వైసిపి నేతలు మంగళవారం ఉదయం తిరుపతిలో నిరసన తెలిపారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బిఆర్‌అంబేద్కర్ విగ్రహం వద్ద వైసిపి నేతలు నిరసన వ్యక్తం చేశారు.అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక సంస్థ టిటిడిలో ఛైర్మన్ వ్యవహారశైలి, చేష్టలు ఫొటోలు, వీడియోలు వెలుగు చూసినా రాజీనామా చేయకపోవడం దారుణమన్నారు. ఈ నిరసనలో మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, భూమన అభినయ్‌రెడ్డి, కేతం జయచంద్రారెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, సత్యవేడు ఇన్‌చార్జి రాజేష్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవి రెడ్డి ,తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి, వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన సిపి రాజశేఖరబాబు



**విజయవాడ కార్పొరేషన్, మార్చి 17 ప్రభాతవార్త:** విజయవాడ పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబుకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మకమైన అతి ఉత్కృష్ట సేవా పతకం–2025 వరించింది. పోలీసు శాఖలో అత్యంత ప్రతిభావంతంగా, నిష్కల్మషంగా, అంకితభావంతో,అత్యుతమ సేవలందించి,విధి నిర్వహణలో నిబద్దత, ప్రజల భద్రత,నేర నియంత్రణ వంటి అంశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విశిష్టమైన సేవలందించిన ఉత్తమ సేవలకు గాను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ రాజశేఖర బాబుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన అతి ఉత్కృష్ట సేవా పతకం–2025ను ప్రకటించారు.

వార్త

ప్రపంచంలో పాపం అనేది ఒక్కటే. అది ఇతరుల్ని బాధపెట్టడం. పుణ్యం కూడా ఒక్కటే అది ఇతరుల్ని సంతృప్తిపరచడం.

-థామస్ ఫుల్లర్

# ప్రాణాంతకమేనా!

అత్యంత విషపూరితమైన, విరుగుడులేని 'పారాక్వాట్' గడ్డిమందును వెంటనే నిషేధించాలన్న ఉద్యమమొకటి బయలుదేరింది. ఈ మందును ప్రపంచంలోనే అనేకదేశాలు నిషేధించాయి. మన దేశంలోనూ కేరళ, ఒడిశా రాష్ట్రాలలో ఈ మందును నిషేధించాయి. కొన్ని దేశాల నుంచి భారత్‌కు విస్తృతంగా పారాక్వాట్ మందు దిగుమతి అవుతూ రైతుల ప్రాణాల మీదకు తెస్తోంది. రైతులు తక్షణమే పారాక్వాట్ మందు వాడకాన్ని నిలిపివేయాలని విజ్ఞప్తులు బాగా పెరిగాయి. మల్టీ నేషనల్ కంపెనీలనుంచి విస్తృత ప్రచారంలో రైతులు తమ పంటలపై ఈ మందు వినియోగం పట్ల ఆకర్షితులౌతున్నారని, వాటి దుష్ప్రభావాన్ని ఆలస్యంగా గుర్తిస్తున్నారని రైతు సంఘాలు చెబుతున్నాయి. భారతదేశం కూడా ఈ మందును నిషేధించాల్సిన అవసరం ఉంది. ఈ మందు రెండు చుక్కలు తాగినా ప్రాణాపాయమే. వ్యవసాయ క్షేత్రాలలో పారాక్వాట్ గడ్డి మందు వినియోగంతో ఆహార పదార్థాల్లో వాటి రసాయనాలు కలువడం ఆందోళన కలిగించే విషయం. గడ్డి మందేకదా! అని వదిలేస్తే గడ్డిపరకల పెరుగుదలనే కాదు మనిషి ప్రాణాలనూ హరిస్తుంది. ఇదీ తాజాగా తెలిసిన నిజం. ఇప్పటికే ఈ మందు ఎన్నో రైతుల ప్రాణాలను తీసింది. ఇంకా ఏమీ చేయలేని పరిస్థితుల్లో రైతులోకం ఈ మందును తక్షణమే నిషేధించాలని కోరుతోంది. ప్రపంచవ్యాప్తంగా 70 దేశాలకుపైగా గడ్డి, కలుపు మందులను నిషేధించగా భారతదేశంలో మాత్రం విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నందున నిషేధం అవసరమని రైతు కమిషన్ బృందం కూడా తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతూ ప్రతిపాదించింది. రైతులు క్షణికావేశానికి ఈ మందు అందుబాటులో ఉండి వారి ప్రాణాలను హరిస్తోందని రైతునేతలు అభిప్రాయపడ్డున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో గడ్డిని నిర్మూలించేందుకు హెర్బిసైడ్‌గా వినియోగించే 'పారాక్వాట్' ఒక విధంగా ఎంతో సమర్థవతమైన గరికనాశని. కానీ దానినే మరో కోణంలో చూస్తే ఎంతో మంది రైతుల ఆత్మహత్యలకు కారణమైన విషపూరిత మందుగా తేలింది. అందుకే ఈ కలుపు మందు పట్ల రైతుల్నించే వ్యతిరేకత వస్తోంది. పంటల్ని కాకుండా కలుపు మొక్కల మీద ప్రభావం చూపిస్తుంది. మరో విధంగా పంటలోని కలుపును నివారిస్తుంది. కనుక కొద్ది కాలం క్రితం రైతుకు హితకారిగానే భావించేవారు. కానీ సాగులో రాబడి లేక వ్యవసాయం వదిలిపెట్టేసే వారికో, సాగు రుణాలు తీర్చలేక ప్రకృతి బీభత్సాల బారినపడి నష్టాల పాలై రెండోదారి లేదనుకొని ఆత్మహత్యలే శరణ్యమనుకున్నవారు ఈ కలుపునాశని మందును సేవించి చచ్చిపోతున్నారన్న నిజం తెలిసింది. గడ్డి మందు ప్రాణాంతకంగా పరిణమించిన వేళ, జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లో గత కొన్నేళ్లుగా ఆ మందు తాగి ఆత్మహత్యలపాలైన ఉదంతాలు ఉండడంతో ఆ గ్రామస్థులు తమగ్రామంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని నిర్ణయం తీసుకున్నారు. తమగ్రామంలో ప్లాస్టిక్ విస్తరణను, గ్లాసులను, గడ్డితో తయారు చేసి ఏవిధమైన వస్తువులను వాడరాదని బహిష్కరిస్తూ తీర్మానం చేశారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే రూ.500ల జరిమానా, ఇలా వినియోగించిన వైనాన్ని ఎరుకపరిస్తే 250 రూపాయల పారితోషికం ఇస్తామని బహిరంగంగానే ప్రకటించారు. మరో గ్రామం చెర్లపల్లిలోనూ ఇదే తీర్మానం చేశారు. పారాక్వాట్ పురుగుమందు తయారీ, పంపిణీ విక్రయాలకు సంబంధించి వివరణ ఇవ్వాలంటూ ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విషపూరిత రసాయనాలతో కూడిన పురుగుమందు వినియోగం పట్లఏటా 200మంది మృతి చెందుతున్నారని హైకోర్టుకు లేఖ అందడంతో హైకోర్టు ఆ లేఖను ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించింది. ప్రధానంగా పారాక్వాట్ వాడకాన్ని యూరోపియన్ యూనియన్‌తోపాటు చైనా, బ్రెజిల్ వంటి దేశాలు కూడా నిషేధించాయి. అభివృద్ధి చెందిన భారతదేశం ఇంకా నిషేధించకపోతే రైతులు తమకు నిరాశానిస్పృహలు ఆవహించినప్పుడు ఈ మందు తాగి చనిపోయే అవకాశముందనివాదన. దీనిపై రైతాంగం ఆందోళన నివేదికలేకాకుండా ప్రజారోగ్య డైరెక్టర్, సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ల నుండి రిపోర్టులు కోరారు. అటు ప్రభుత్వాలు, ఇటుకోర్టు ఎవరు ఈమందుపై నిషేధంవిధించినా రైతులకు మేలు జరిగేవీలుంది. పారాక్వాట్‌వినియోగంలో గడ్డి నివారణ జరగడం మంచిదే. కాని అదే మందు రైతు ఆఖరి క్షణాలను నిర్దేశించడంతో ఎవరైనా అలాంటిమందుపై నిషేధమే కోరుకుంటారు. దాని వాడకంతో దుష్ప్రభావాలు, నియంత్రణపై విశ్లేషించుకోవాల్సిన అగత్యమేర్పడింది. పత్తి, చెరకు, తోట పంటలలో కలుపు నివారణకు రైతులకు ఎక్కువగా వినియోగిస్తుంటారు. నకిలీ విత్తనాలతో దిగుబడులురాక పంట ఉత్పత్తిదశలోనే నష్టాలుపొందే రైతు ఆత్మహత్యలవైపు మొగ్గుచూపితే ఎంతోతేలికగా తన వద్దనున్న కలుపుమందు వైపేదృష్టి మరలుతోంది. అందుచేత ప్రధానంగా ఇలాంటి పంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం మేలు. మట్టి కైనా, మనిషికైనా ఈమందు నష్టమేననేవాదనలున్నాయి. మట్టిలో ఎక్కువకాలం నిల్వ ఉండి భూసారాన్ని తగ్గిస్తుంది. వర్షపునీటితో కలిసినప్పుడు నదులు, చెరువుల్లోకి వెళ్లే నీరు జీవుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఊపిరితిత్తులను తీవ్రంగా దెబ్బతీస్తుంది. కళ్లలోపడితేకంటిచపు కోల్పోతుంది. ఒకసారిశరీరంలోకిచేరితే దానికి విరుగుడు లేనేలేదని శాస్త్రజ్ఞుల ఉవాచ. కేవలం నియంత్రణతో సరిపెట్టుకోలేం. ఈమందునుపూర్తిగా నిషేధించాలని స్వయంగా రైతులోకమే కోరడం విశేషం.



లోకులు తొందరగా నిందిస్తారు. అంతే త్వరగా అభినందిస్తారు కూడా. అందువల్ల ఇతరులు నిన్ను గురించి అనుకునే మాటలకు అంత విలువ ఇవ్వవద్దు.

రామకృష్ణ పరమహంస



అభ్యుదయాన్ని సాధించాలి అంటే చరిత్రను పునరావృతం చేయడం కాదు. కొత్త చరిత్రను సృష్టించాలి.

మహాత్మాగాంధీ

# పరాయి దేశాలపై దాడులు ప్రజాస్వామ్యమా?

ప్రస్తుత ప్రపంచం యుద్ధ మేఘాల నుంచి బయటపడాలంటే కేవలం ప్రసంగాలు సరిపోవు, తక్షణమే క్షేత్రస్థాయిలో కొన్ని విప్లవాత్మక చర్యలు చేపట్టాలి. మొదటిగా, దేశాల మధ్య నెలకొన్న వివాదాలను తుపాకీ గొట్టంతో కాకుండా, పరస్పర గౌరవంతో కూడిన 'చర్చల మేజా' ద్వారా పరిష్కరించుకోవడమే అత్యుత్తమ మార్గం. ముఖ్యంగా, ఇరాన్ వంటి దేశాలపై విధిస్తున్న అక్రమ, ఆర్థిక ఆంక్షలను తక్షణమే ఎత్తివేసి, ఆదేశాన్ని స్వేచ్ఛాయుత ప్రపంచ మార్కెట్‌లోకి అనుమతించడం ద్వారానే మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొంటుంది. అలాగే, నాటో తన విస్తరణ కాంక్షను కట్టిపెట్టి రష్యాకు భద్రతాపరమైన స్పష్టమైన హామీ ఇవ్వడం ద్వారా ఐరోపాలో రక్తపాతాన్ని ఆపవచ్చు. అణుఆయుధాల తయారీని పూర్తిగా నిషేధించేలా 'గ్లోబల్ న్యూక్లియర్ డిసార్మమెంట్' ఒప్పందాన్ని కఠినంగా అమలు చేయాలి. మానవత్వం గెలవాలంటే ఆయుధాల తయారీకి వెచ్చిస్తున్న నిధులను ఆరోగ్యం, విద్యపై ఖర్చు చేయాలి.

ఫిరోజ్ ఖాన్

ప్రస్తుత ప్రపంచ రాజకీయ యవనికపై ఇరాన్‌సౌదీ అరేబియా దేశాల మధ్య గతంలో ఎలాంటి స్నేహ సౌహార్థ సంబంధాలున్నా తాజాగా మునుపెన్నడూ లేనంతగా యుద్ధ జ్వాలలు రగులుతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కూటమి ఒకవైపు, రష్యా, చైనా, ఉత్తర కొరియా జట్టు మరోవైపు ఉక్రెయిన్ నుండి టెహ్రాన్ వరకు యుద్ధాన్ని నడుపుతుంటే, తెరవెనుక కతార్, నార్వేవంటి దేశాలు రాయబారాల పేరుతో, యెమెన్ (హౌతీలు), లెబనాన్ (హిజ్బుల్లా) వంటి గ్రూపులు ఇరాన్ మద్దతుతో ఈ గొడవల్లో కీలకపాత్ర పోషిస్తున్నాయి. క్షిపణుల వర్షం నుంచి బాంబుపేలుళ్లవరకు ప్రతిదీ ఒక పెద్ద యుద్ధానికి సంకేతంగా కనిపిస్తూ, 'ప్రజాస్వామ్యం' పేరుతో అగ్రరాజ్యాలు సాగిస్తున్న పెత్తందారీ పోరు నేడు ప్రపంచాన్ని ఆందోళనలో పడేసింది. ఒకదేశంపై మరొకటి దాడి చేస్తూ, అక్కడి చమురు, గ్యాస్ వనరులను దోచుకోవడానికి 'శాంతిని కాపాడుతున్నాం' మనే ఆధునిక రాజకీయాల్లో అతిపెద్ద మోసంగా మారింది. మధ్యప్రాచ్యంలో ఇరాన్ ఒక స్వతంత్ర, బాధ్యతాయుతమైన శక్తిగా ఎదగడాన్ని పశ్చిమ దేశాలు జీర్ణించుకోలేకపోవడం నేటి అంతర్జాతీయ రాజకీయాల్లోని చేదునిజం. 2015లో ప్రపంచదేశాల సాక్షిగా కుదిరిన జె.సి.పి.ఓ.ఎ. అణు ఒప్పందం నుండి 2018 మే 8న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా తప్పుకోవడం అంతర్జాతీయ చట్టాలను అపహాస్యం చేయడమే. ఇరాన్ తన దేశ రక్షణ కోసం క్షిపణులను అభివృద్ధి చేసుకుంటే దానిని 'ప్రపంచ ముప్పు'గా పరిగణించే అమెరికా, అదే సమయంలో తన మిత్రదేశాలకు వేల కోట్ల డాలర్ల అత్యాధునిక ఆయుధాలను సరఫరా చేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యమో ప్రపంచ దేశాలు ఆలోచించాలి. ఇటీవల 2026 ప్రారంభంలో ఇరాన్ తన శాంతియుత అణు కార్యక్రమాలను పారదర్శకంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించినా, దానిపై మళ్ళీ కఠిన ఆంక్షలు విధించడం అత్యంత శోచనీయం. ఇరాన్ తన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, తన సొంత కాళ్లపై నిలబడే ప్రయత్నం చేస్తున్నవేళ, బయటి శక్తులు కుట్రపూరితంగా అక్కడ అస్థిరతను సృష్టించడం వారి ద్వంద్వ నీతికి పరాకాష్ట. చరిత్రను పరిశీలిస్తే ఇరాన్ ఎప్పుడూ ఏ దేశంపై స్వతంత్రంగా యుద్ధాన్ని ప్రకటించిన సందర్భం లేదు. కేవలం తన ఉనికిని, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలని మాత్రమే ఆశిస్తోంది. నాటో పెత్తందారీతనం తెచ్చిన విపత్తు రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య భూభాగ వివాదం కాదు, ఇది నాటో సంస్థ చేస్తున్న అనాలోచిత విస్తరణ ఫలితం. 1991లో సోవియట్ విచ్ఛిన్నం తర్వాత తూర్పు వైపు విస్తరించబోమని ఇచ్చిన హామీని తుంగలో తొక్కడం వల్లనే 2022 ఫిబ్రవరి 24న రష్యా సైనిక చర్యకు దిగాల్సి వచ్చింది. 2026 వరకు సాగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌ను పావుగా వాడుకుంటున్న అమెరికా, ఐరోపా దేశాలు అక్కడ శాంతిని నెలకొల్పడం కంటే ఆయుధ విక్రయాలకే మొగ్గు చూపుతున్నాయి. బుచా, ఖార్కివ్ వంటి నగరాల్లో జరుగుతున్న ప్రాణనష్టానికి రష్యాను మాత్రమే బాధ్యుని చేయడం ఏకపక్షం. నాటో తన దూకుడును తగ్గించుకునిఉంటే, వేలాదిమంది ప్రాణాలు మిగిలేవి. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో ఉక్రెయిన్ యువతనుయుద్ధ ట్యాంకుల ముందుకు తోయడం గర్హనీయం. ఇది పశ్చిమ దేశాల స్వార్థపూరిత యుద్ధం తప్ప మరొకటి కాదు. నీరుగారుతున్న అంతర్జాతీయ చట్టాలు ఐక్యరాజ్యసమితి నేడు అగ్రరాజ్యాల కబంధహస్తాల్లో చిక్కుకుని విలవిలలాడుతోంది. 1945లో ఏర్పడిన భద్రతా మండలి నేటి 2026 నాటి ప్రపంచ వాస్తవాలను ప్రతిబింబించడం లేదు. అమెరికా,



రష్యా, చైనా వంటి దేశాలు తమ ప్రయోజనాల కోసం వీటోను వాడుకుంటూ శాంతి తీర్మానాలను అడ్డుకుంటున్నాయి. గాజా లేదా ఇరాన్ విషయంలో ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను అమెరికా అడ్డుకోవడం లేదు సదా సమర్థిస్తోంది. అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చే ఆదేశాలను కూడా బేఖాతరు చేసే స్థాయికి ఈ దేశాల అహంకారం పెరిగింది. ఐరాసలో భారత్ వంటి దేశాలకు శాశ్వత సభ్యత్వం ఇవ్వకపోవడం వల్ల ప్రపంచంలో ప్రజాస్వామ్యస్ఫూర్తి దెబ్బతింటోంది. కేవలం ఐదు దేశాల చేతుల్లో ప్రపంచ భవిష్యత్తును ఉంచడం అత్యంత ప్రమాదకరమైన విషయం. ఆకలి కేకల మధ్య ఆయుధ వ్యాపారం యుద్ధంవల్ల పాలకులు లాభపడవచ్చుకానీ, సామాన్య ప్రజలు మాత్రం ఆకలితో అలమటిస్తున్నారు. ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్‌పై ఆంక్షల వల్ల 2025 26లో ప్రపంచవ్యాప్తంగా గోధుమలు, వంట నూనె, చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. నల్ల సముద్రం గుండా ధాన్య రవాణాపై కుదిరిన ఒప్పందాలు వైఫల్యం చెందడం వల్ల ఆఫ్రికాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ వంటి దేశాల నుండి చమురు కొనుగోలు చేయకుండా భారత్ వంటి దేశాలపై ఒత్తిడి తీసుకురావడం వల్ల ఇంధన ధరలు పెరిగి ద్రవ్యోల్బణం ముదిరింది. ఆంక్షలు అనేవి ఆర్థిక ఉగ్రవాదంగా మారి సామాన్యుడి కడుపు కొడుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక ప్రగతిని అడ్డుకోవడానికి యుద్ధాన్ని ఒక అస్త్రంగా వాడుకోవడం ఆధునిక రాజకీయాల్లోని దౌర్భాగ్యం. యుద్ధాల వల్ల కేవలం ఆయుధ కంపెనీల జేబులు మాత్రమే నిండుతున్నాయి. వాణిజ్య ముసుగులో సైనిక మోహరింపు దక్షిణ చైనా సముద్రంలో ఉద్రిక్తతలు పెంచడం ద్వారా ఆసియా పసిఫిక్ ప్రాంతాన్ని అస్థిరపరిచేందుకు పశ్చిమ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. 1979 నాటి 'తైవాన్ రిలేషన్స్ యాక్ట్'ను సాకుగా చూపి అమెరికా తన యుద్ధ నౌకలను అక్కడ మోహరించడం చైనాను రెచ్చగొట్టడమే అవుతుంది. 2026లో తైవాన్ చుట్టూ జరుగుతున్న సైనిక విన్యాసాలు ప్రపంచ వాణిజ్యానికి పెద్ద ముప్పుగా మారాయి. సెమీకండక్టర్ల సరఫరాను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామని చెబుతూ క్వాడ్ వంటి కూటముల ద్వారా ఆసియా దేశాల మధ్య విభేదాలు సృష్టించడం సరికాదు. ఈ ప్రాంతంలో శాంతి నెలకొనాలంటే చైనా, దాని పొరుగు దేశాల మధ్య చర్చలు జరగాలి తప్ప, బాహ్యశక్తుల జోక్యం ఉండకూడదు. ఆసియా ఐక్యతను దెబ్బతీయడమే పాశ్చాత్య దేశాల అంతిమ లక్ష్యంలా కనిపిస్తోంది. ప్రస్తుతం మధ్యప్రాచ్యం యుద్ధ జ్వాలలతో రగులుతున్న తరుణంలో, భారత్ ఏ కూటమికి దాసోహం అనకుండా తన 'వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి'ని చాటుకుంటూ ఒక శాంతి దూతగా నిలుస్తోంది. అగ్రరాజ్యాల ఒత్తిడి ఉన్నప్పటికీ, ఇరాన్‌తో ఉన్న చారిత్రక సంబంధాలను కాపాడుకుంటూనే చాబహార్ ఓడరేవు వంటి కీలక ప్రాజెక్టుల ద్వారా ఆదేశాన్ని ప్రపంచంతో కలిపే వంతెనగా భారత్ వ్యవహరిస్తోంది. "ఇది యుద్ధాల యుగం కాదు' అని ప్రధాని మోదీ చాటిచెప్పిన మాటలు నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుండగా, వివాదాలను తుపాకీ గొట్టంతో కాకుండా చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ గట్టిగా నమ్ముతోంది. ఇజ్రాయెల్, ఇరాన్ వంటి పరస్పర విరుద్ధ దేశాలతో సమానమైన సంబంధాలు కొనసాగించగలిగే ఏకైక శక్తిగా భారత్ ఎదగడం అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక విశేషం. ఈ క్లిష్టసమయంలో 'వసుధైక కుటుంబం' అనే తత్వమే ప్రపంచానికి అసలైన మార్గదర్శి అని భారత్ నిరూపిస్తోంది. ప్రస్తుత ప్రపంచం యుద్ధ మేఘాల నుంచి బయటపడాలంటే కేవలం ప్రసంగాలు సరిపోవు, తక్షణమే క్షేత్రస్థాయిలో కొన్ని విప్లవాత్మక చర్యలు చేపట్టాలి. మొదటిగా, దేశాల మధ్య నెలకొన్న వివాదాలను తుపాకీ గొట్టంతో కాకుండా, పరస్పర గౌరవంతో కూడిన 'చర్చల మేజా' ద్వారా పరిష్కరించుకోవడమే అత్యుత్తమ మార్గం. ముఖ్యంగా, ఇరాన్ వంటి దేశాలపై విధిస్తున్న అక్రమ ఆర్థిక ఆంక్షలను తక్షణమే ఎత్తివేసి, ఆదేశాన్ని స్వేచ్ఛాయుతప్రపంచ మార్కెట్‌లోకి అనుమతించడం ద్వారానే మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొంటుంది. అలాగే, నాటో తన విస్తరణ కాంక్షను కట్టిపెట్టి రష్యాకు భద్రతాపరమైన స్పష్టమైన హామీ ఇవ్వడం ద్వారా ఐరోపాలో రక్తపాతాన్ని ఆపవచ్చు. అణు ఆయుధాల తయారీని పూర్తిగా నిషేధించేలా 'గ్లోబల్ న్యూక్లియర్ డిసార్మమెంట్' ఒప్పందాన్ని కఠినంగా అమలుచేయాలి. మానవత్వం గెలవాలంటే ఆయుధాల తయారీకివెచ్చిస్తున్ననిధులను ఆరోగ్యం, విద్యపై ఖర్చుచేయాలి. ప్రజాస్వామ్యం అనేది దాడులకు సాకు కాకూడదు, అది చర్చలకు వేదిక కావాలి. ●

# భారతీయ సేద్యంపై పశ్చిమాసియా సెగ

ఇ. శ్రీనివాస్ రావు

పశ్చిమాసియాలో రగులుతున్న యుద్ధ సెగలు.. వేల మైళ్ల దూరంలో ఉన్న భారతీయ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. క్షిపణుల మోతలు ఇరాన్, ఇజ్రాయెల్ సరిహద్దుల్లో వినిపిస్తున్నా.. వాటి వల్ల పెరిగే ఎరువులు, ఇంధన ధరల మోతమాత్రం మన రైతుల జేబుల్లో మోగుతోంది. ఇది కేవలం భౌగోళిక లేదా రాజకీయ సంక్షోభం మాత్రమే కాదు, మన దేశ వ్యవసాయ రంగాన్ని, ఆహార భద్రతను కుదిపేసే పరిణామం. వ్యవసాయంఅత్యంత సున్నితమైన రంగం. ప్రపంచవ్యాప్తంగా యూరియా, ఫాస్ఫేట్, పొటాష్ వంటి ఎరువుల తయారీకి అవసరమైన సహజ వాయువు సరఫరాలో పశ్చిమాసియా దేశాలదే కీలకపాత్ర. యుద్ధ ఉద్రిక్తతల వల్ల సరఫరా చైన్ దెబ్బతిని, ఎరువుల ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. దీనికి తోడు వ్యవసాయం పూర్తిగా డీజిల్‌పైనే (ట్రాక్టర్లు, మోటార్లు, రవాణా) ఆధారపడి ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగితే, ఆ భారం నేరుగా డీజిల్ రూపంలో సాగు ఖర్చును అమాంతం పెంచుతుంది. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న సాగు చేసే రైతులకు పెట్టుబడి వ్యయం తడిసి మోపెడవుతున్నా.. దానికి తగ్గ గిట్టుబాటు ధర దక్కకపోవడం వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతుంది. పశ్చిమాసియా యుద్ధంతో వాణిజ్య రవాణాకు కీలకమైన ఎర్ర సముద్రం, హోర్ముజ్ జలసంధి మార్గాల్లో కల్లోలం నెలకొంది. దీనివల్ల నౌకా రవాణా, బీమా ఖర్చులు భారీగా పెరిగాయి. దీని ప్రత్యక్ష ప్రభావం తెలుగు రాష్ట్రాల ఎగుమతులపై పడుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలనుంచి ఇరాన్, తదితర గల్ఫ్ దేశాలకు ఎగుమతి అయ్యే బియ్యం, మిర్చి, రొయ్యల (ఆక్వా) రవాణాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఎగుమతులు మందగిస్తే వేలాది మంది రైతులు, మత్స్యకారుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతుంది. అయితే, ప్రతి సంక్షోభం ఒక అవకాశాన్ని కూడా మోసుకొస్తుంది. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్న నేపథ్యంలో, ఇతర దేశాలు తమ అవసరాల కోసం ప్రత్యామ్నాయ మార్కెట్ల వైపుచూస్తాయి. మన బియ్యం, పప్పుధాన్యాలు, మసాలా దినుసులకు గ్లోబల్ మార్కెట్లో కొత్త డిమాండ్ సృష్టించుకోవడానికి ఇదొకఅవకాశం. సరైన వ్యూహంతో అడుగులువేస్తే భారతీయ రైతులకు ఇది వరంగా మారే అవకాశం లేకపోలేదు. సాగుఖర్చు పెరిగి రైతులు ఎరువుల వాడకం తగ్గిస్తే అదినేరుగా దిగుబడుల పతనానికి, తద్వారా దేశీయంగా ఆహార సంక్షోభానికి దారితీస్తుంది. ఈముప్పును ప్రభుత్వాలు ముందుగానే పసిగట్టాలి. ప్రత్యామ్నాయ దేశాలనుంచి ఎరువుల దిగుమతికి మార్గాలు అన్వేషించడం, రైతులకు డీజిల్, ఎరువులపై సబ్సిడీల భారాన్నిప్రభుత్వమే భరించడం తక్షణ కర్తవ్యం. అలాగే ఎగుమతిదారులకు అండగా నిలిచి, నూతన మార్కెట్లను అభివృద్ధి చేయాలి. పశ్చిమాసియా సంక్షోభాన్ని కేవలం విదేశీవ్యవహారాల కోణంలోనే కాకుండా, దేశీయ వ్యవసాయ, ఆర్థిక కోణంలో విశ్లేషించుకోవాలి. ●

# అభివృద్ధికి సవాలుగా అప్పుల వారసత్వం!

రామ కిష్టయ్య సంగన భట్ల

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒక అత్యంత క్లిష్టమైన, చారిత్రాత్మకమైన మలుపులో నిలిచివుంది. స్వరాష్ట్రంగా అవతరించినప్పటి నుండి ఒక దశాబ్దం కాలంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల విస్తరణ వంటి అనేక రంగాలలో గణనీయమైన పురోగతిని సాధించినప్పటికీ, ఆర్థిక నిర్వహణలో ఎదురైన సవాళ్లు ఇప్పుడు స్పష్టంగా బహిర్గతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ కేవలం ఆదాయం- వ్యయాల అంకెల సమాహారం మాత్రమే కాకుండా, తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించే ఒక సమగ్ర దిశానిర్దేశక పత్రంగా మారబోతోంది. గత పది సంవత్సరాల ఆర్థిక ప్రయాణంలో పేరుకుపోయిన అప్పుల భారం, బడ్జెట్ వెలుపల తీసుకున్న ఆఫ్‌బడ్జెట్ రుణాలు, వివిధ ప్రభుత్వ కార్పొరేషన్‌ల ద్వారా సమకూర్చుకున్న గ్యారెంటీలు, అంతకంతకూ పెరుగుతున్న సంక్షేమ పథకాల వ్యయం, మౌలిక వనరుల విస్తరణకు అవసరమైన భారీ పెట్టుబడులు వంటిఅంశాలు ఈబడ్జెట్ రూపకల్పనను అత్యంత సవాలుతో కూడిన ప్రక్రియగా మార్చాయి. అందువల్ల ఈ బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధి అనే రెండు కీలక ధ్రువాల మధ్య సమతుల్యతను ప్రభుత్వం ఎలా సాధిస్తుందన్నది రాష్ట్ర రాజకీయ, ఆర్థిక ముఖచిత్రంపై బలమైన ప్రభావం చూపనుంది. 2014లో రాష్ట్ర విభజన జరిగిన సమయంలో తెలంగాణ సుమారు 75,577 కోట్ల రూపాయల అప్పుతో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఆరంభ దశలో హైదరాబాద్ నగరం అందించే అపారమైన ఆదాయ వనరులు, పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ, ఐటీ రంగం సాధించిన అద్భుత వృద్ధి, రియల్ ఎస్టేట్ విస్తరణ వంటి అంశాలు రాష్ట్ర ఖజానాకు పుష్కలమైన నిధులను అందించాయి. అయితే ఇదే సమయంలో భారీ నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ భగీరథ వంటి ప్రతిష్టాత్మక పథకాల అమలు కోసం ప్రభుత్వం తన పరిమితులకు మించి రుణాలను సమీకరించింది. ముఖ్యంగా కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల కోసం తీసుకున్న రుణాలు నేరుగా రాష్ట్ర బడ్జెట్ లెక్కల్లో చూపకుండా వివిధ కార్పొరేషన్ల ద్వారా గ్యారెంటీలు ఇచ్చి తీసుకోవడం వల్ల, రాష్ట్రంపై ఉన్నవాస్తవ రుణభారంపై కొంతకాలం పాటు స్పష్టత లోపించింది. కాలక్రమేణా ఈ అప్పుల భారం పెరిగి ప్రస్తుతం వడ్డీలతో కలిపి దాదాపు ఏడు లక్షల కోట్ల రూపాయల మైలురాయిని చేరుకుందని ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక శ్వేతపత్రంస్పష్టం చేస్తోంది. ఈ భారీ రుణభారం ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పెను ఒత్తిడిని సృష్టిస్తోంది. రాష్ట్రం పొందేమొత్తం ఆదాయంలో సింహభాగం ఇప్పుడు అప్పుల అసలు, వడ్డీల చెల్లింపులకే ఖర్చవుతోంది. గణాంకాలను నిశితంగాపరిశీలిస్తే, ప్రతిరోజూ సగటున దాదాపు 191 కోట్ల రూపాయలకుపైగా కేవలం వడ్డీల రూపంలోనే చెల్లించాల్సి రావడం కోశాగార నిర్వహణలో ఎదురవుతున్న క్లిష్టతకు నిదర్శనం. ప్రస్తుత ప్రభుత్వం ఎదుట ఉన్న మరో ప్రధాన సవాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు. సంక్షేమ రాజ్య స్థాపనలో భాగంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి,




గృహ జ్యోతి, రైతు భరోసా వంటి పథకాలు సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నప్పటికీ, రాష్ట్ర ఖజానాపై ఇవి సుమారు 56,084 కోట్ల రూపాయల అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఇప్పటికే అమలులో ఉన్న మహిళల ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీకి కలుగుతున్న నష్టాన్ని ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ రూపంలో భర్తీ చేయాల్సి ఉంది. అలాగే గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయడం వల్ల విద్యుత్ పంపిణీ సంస్థలపై (డిస్కంలు) పడే భారాన్ని భరించడానికి బడ్జెట్‌లో భారీ కేటాయింపులు అనివార్యం. గత ప్రభుత్వ హయాం నుండే విద్యుత్ రంగం దాదాపు 80 వేల కోట్ల రూపాయల బకాయిలతో కుదేలై ఉన్న తరుణంలో, ఈ అదనపు సబ్సిడీ భారాన్ని మోయడం ఆర్థికంగా కత్తి మీద సాము వంటిదే. రైతు భరోసా కింద సాగు సాయం అందించడం, రెండు లక్షల రూపాయల వరకు పంట రుణాలమాఫీ చేయడం వంటి చర్యలకు సుమారు 31 వేల కోట్ల రూపాయల నిధులు అవసరమని అంచనా వేస్తున్నారు. ఈ నిధుల సమీకరణకు ఎఫ్.ఆర్.బి.ఎమ్ (నిశితీతీ) పరిమితులను అతిక్రమించకుండా కొత్త మార్గాలను వెతకడం ఈ బడ్జెట్ ప్రధాన లక్ష్యం కావాలి. ఆదాయ వనరుల విస్తరణ విషయంలో ప్రభుత్వం ప్రస్తుతం మూడు మార్గాలపై ఆధారపడుతోంది. అవి రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం, కేంద్ర పన్నుల్లో వాటా, కేంద్ర గ్రాంట్లు. తెలంగాణకు వస్తున్న ఆదాయంలో ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, వ్యాట్ పన్నులు కీలకమైనవి. ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లో రియల్‌ఎస్టేట్ రంగాన్ని మరింత ఉత్తేజితం చేయడం ద్వారా స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే కేవలం పన్నుల పైనే ఆధారపడకుండా, పన్నేతర ఆదాయ మార్గాలను కూడా అన్వేషించాల్సిన అవసరం ఉంది. మైనింగ్ రంగం నుండి రాయల్టీలు, ప్రభుత్వ భూముల సక్రమ వినియోగం, డిజిటల్ గవర్నెన్స్ ద్వారా వసూలయ్యే ఫీజుల ద్వారా ఆదాయాన్ని పటిష్టం చేసుకోవాలి. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధుల విషయంలో రాష్ట్రం తన వాణిని గట్టిగా వినిపించాల్సి ఉంది. 16వ ఆర్థిక సంఘం పర్యటన నేపథ్యంలో, కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలవాటాను 41 శాతంనుండి 50 శాతానికి పెంచాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. విభజన చట్టం ప్రకారం రావలసిన పెండింగ్ గ్రాంట్లు వెనుకబడిన జిల్లాల నిధులను రాబట్టుకోవడం బడ్జెట్ లోటును పూడ్చడానికి ఎంతో అవసరం. ఈ బడ్జెట్‌లో విద్యా, వైద్య రంగాలకు కేటాయింపులు పెంచడం ద్వారా మానవ వనరుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించబోతోంది. గత దశాబ్ద కాలంలో భౌతిక మౌలిక వసతులపై పెట్టిన శ్రద్ధ, సామాజిక మౌలిక వసతులపై లేదనే విమర్శను తుడిచిపెట్టేలా ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, డిజిటల్ క్లాస్ రూమ్స్ ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యాధునిక వైద్య సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మూలధన వ్యయం రెవెన్యూ వ్యయం, మధ్య సమతుల్యత సాధించడం ఇక్కడ అత్యంత ముఖ్యం. సంక్షేమం కోసం చేసే ఖర్చు 'రెవెన్యూ వ్యయం' కిందకు వస్తుంది, ఇది తక్షణ ఉపశమనాన్ని ఇస్తుంది కానీ ఆస్తులను సృష్టించదు. అదే రోడ్లు, పరిశ్రమలు, విద్యా సంస్థలపై చేసే ఖర్చు 'మూలధన వ్యయం' కిందకు వస్తుంది. ఇది దీర్ఘకాలిక ఆదాయాన్ని ఉపాధిని ఇస్తుంది. ప్రస్తుత బడ్జెట్‌లోమూలధన వ్యయాన్ని పెంచడంద్వారానేరాష్ట్ర ఆర్థిక సుస్థిరత సాధ్యమవుతుంది. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా ఐటీ, ఫార్మా, తయారీ రంగాలకు ఇచ్చేప్రోత్సాహకాలు రాష్ట్ర జిఎస్‌డిపి వృద్ధికి దోహదపడతాయి. ●

# ప్రజావాక్కు



## ఇక ఎన్నికల యుద్ధం

నాలుగు రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికల నగారా మోగింది. సాధారణ ఎన్నికల తర్వాత ప్రతీ ఏడూ దేశంలో ఎక్కడో ఒకచోట రాష్ట్రాల ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. ఈ సారి జరుగుతున్నవి మాత్రం ప్రత్యేకమైనవి. యావత్ దేశం దృష్టిని తమవైపు తిప్పుకొనేలా చేసేవి. ఏప్రిల్ 9 నుండి 29 వరకూ నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోజరిగే ఈఎన్నికలువైరిపక్షాలమధ్య నువ్వానేనా అనే తీవ్రపోటీతో జరగబోతున్నాయి. మూడు రాష్ట్రాలు తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో భాజపాయేతర పార్టీల పాలనలో ఉండగా అస్సాంలో బీజేపీ పాలన. పుదుచ్చేరిలోబీజేపీ మిత్రపక్షంతోకలిసిఅధికారంలో ఉంది. కాబట్టి అటు కేంద్రంలో ప్రతిపక్ష పార్టీలు తమ బలాన్ని కోల్పోయే పరిస్థితి రాకుండా తీవ్రంగా శ్రమించాలి. ఇటు పాలకపక్షం బీజేపీ తమకు అనువుగానిచోట అధికమయ్యే ప్రయత్నాలు చెయ్యాలి.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

## వాటర్ షెడ్ అమలు చేయాలి

వాటర్‌షెడ్ అనేది తెలంగాణ రాష్ట్రానికి దానితో పాటు భూపరివేష్టిత రాష్ట్రాలకు వరంలాంటిది. అంత మాత్రమే కాదు భూ పరివేష్టిత రాష్ట్రాలలో భూమి ఎగుడు దిగుడుగా ఉండడం వల్ల నీటిని ముఖ్యంగా వాన నీటిని ఆపి నీటిని భూమిలోకి ఇంకెట్టు చేసే సామర్థ్యం వీటికి ఉన్నదికాబట్టి భూపరివేష్టిత రాష్ట్రాలకు అది ఒక వరం. అంత మాత్రమే కాదు తెలంగాణ లాంటి రాష్ట్రాలలో ఉన్న ఎర్ర చెక్క భూములు కూరగాయలు, పండ్ల తోటల పెంపకానికి ఉపయోగపడుతాయి. కాబట్టి ప్రభుత్వం ఒక మిషన్ మోడ్‌లో వాటర్ షెడ్‌ను అమలు చేయాలి.

- భారత అవినాష్, జనగామ

## నక్రూరత్వాన్ని బయటపెడుతున్న దేశాలు

మధ్యప్రాచ్యంలో ఇటీవలపెరిగినఉద్రిక్తతలు ప్రపంచ రాజకీయాల్లో కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ముఖ్యంగా అమెరికా తీసుకున్న చర్యలవెనుక స్పష్టమైన వ్యూహాత్మక దార్శనికత కనిపించడం లేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సమయంలో యుద్ధాన్ని ప్రారంభించడానికి స్పష్టమైన కారణం లేకపోవడం, ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా ఖమేనీని లక్ష్యంగా చేసుకోవడానికి బలమైన సమర్థన లేకపోవడం చర్చకు దారితీసింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## రాజద్రోహం నేరం కింద అరెస్టు చేయాలి

చంద్రబాబు తన మెతక వైఖరి మార్చుకోవాలి. లేకపోతే చాపకిందనీరులా, చివరికి కూటమిమనుగడకేముప్పురావచ్చు. మాజీ ఐఏఎస్‌లు ఒకరిద్దరు రాష్ట్రంలోని ముఖ్యాధికారులను సమావేశపరచి రకరకాల ప్రలోభాలకు గురిచేసి , ఈసారి వచ్చేది మా ప్రభుత్వమేఅనినమ్మించి, మీకేపోస్టుకావాలో ముందుగానే కోరుకోండి, అంటు ఆశచూపిస్తూ, ప్రభుత్వంలోని గుట్టు బయటపెట్టి, ప్రభుత్వాన్ని అస్థిరతపరచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు పది రోజుల నుండి వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ సమావేశానికి వెళ్ళినవారిని గుర్తించి, వాస్తవానికి అక్కడ ఏమిజరిగింది, విషయ సేకరణ చేసి, ఆ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. పూర్వం రాజులకాలంలో ప్రభుత్వాన్ని కూల్చాలనుకున్నవారిని, రాజద్రోహం నేరం క్రింద శిక్షించేవారు. ఇదికూడా అలాంటిదే. చంద్రబాబు ఇలాగే మెతకగాఉంటే, ప్రజలు మిమ్ములను ఎన్నుకున్న లక్ష్యం నెరవేరదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## స్వీయ నియంత్రణ అవసరం

మనిషి జీవితాన్ని సక్రమంగా ముందుకు నడిపించేవి జ్ఞానంతో పాటు స్వీయ నియంత్రణ కూడా. జ్ఞానం ఉన్నవాళ్లు కూడా తన భావోద్వేగాలను, కోపాన్ని, ఆలోచనలను నియంత్రించలేకపోతే అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే జీవితంలో విజయం సాధించాలంటే స్వీయ నియంత్రణ చాలా అవసరం. స్వీయనియంత్రణ కోల్పోయినప్పుడు మనిషిచేసే చర్యలు అనేక ప్రమాదాలకు దారితీస్తాయి. చిన్న విషయాలకే కోపం రావడం, ఇతరులను దూషించడం, చేయిచేసుకోవడం వంటిచర్యలు సంబంధాలనుదెబ్బతీస్తాయి. కొన్నిసార్లు ఆకోపం తీవ్రస్థాయికి చేరుకుని హత్యలు వంటి ఘోరసంఘటనలకు కూడా కారణమవుతుంది. ఒక క్షణం ఆలోచించకుండా తీసుకునే నిర్ణయాలు జీవితాంతం పశ్చాత్తాపాన్ని మిగిల్చే పరిస్థితులను తీసుకువస్తాయి.

- డాక్టర్. వై. సంజీవ కుమార్, హైదరాబాద్

## వికలాంగులకు అవకాశం ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్ర విద్య శాఖ పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యలో వార్షిక పరీక్షలు నిర్వహించి ఆ పేపర్‌లు దిద్దడం, స్క్రూటినీ చేయడం, పర్యవేక్షణ చేయడం వంటి పనులు వికలాంగులకు అప్పగించి సామాజిక న్యాయం చేయాలి. వీరికి సహాయకులను కూడా తోటి టీచర్స్, లెక్చరర్ లను నియమించాలి. ఇది ఈ సంవత్సరం నుండి ప్రారంభం చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. | ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# కుటుంబంతో ప్రధాని మోడీని కలిసిన వరుణ్‌గాంధీ

**న్యూఢిల్లీ, మార్చి 17:** బీజేపీ నేత, పిలిభిత్ ఎంపీ వరుణ్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసల వర్షం కురిపించారు. దేశానికి, దేశ ప్రజలకు మోదీయే నిజమైన సంరక్షకుడు అని ఆయన అభివర్ణించారు. ఇటీవల తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రధాని మోదీని కలిసిన వరుణ్, ఈ భేటీ తనకు లభించిన గొప్ప గౌరవంగా పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీజీని నా కుటుంబంతో కలిసి కలవడం, ఆయన ఆశీస్సులు, మార్గనిర్దేశం పొందడం నా అదృష్టంగా భావిస్తున్నానని వరుణ్ గాంధీ తన పోస్టులో రాశారు. ప్రధాని మోదీ వ్యక్తిత్వాన్ని, నాయకత్వాన్ని కొనియాడుతూ, మీ వ్యక్తిత్వంలో అద్భుతమైన పితృ వాత్సల్యం, రక్షణ భావన ఉన్నాయి. మీతో భేటీ అయిన తర్వాత, మీరే ఈ దేశానికి, ప్రజలకు నిజమైన సంరక్షకుడనే నా నమ్మకం మరింత బలపడిదని వరుణ్ గాంధీ పేర్కొన్నారు. 1980లో సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత కాంగ్రెస్ పార్టీతో, గాంధీ కుటుంబంలోని ఇతర సభ్యులతో తీవ్ర విభేదాలు రావడంతో మేనకా గాంధీ ఆ పార్టీకి దూరమయ్యారు.

# పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం ఉండాలి

- తండ్రులను కూడా సమాన సంరక్షకులుగా గుర్తించాలి
- కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన
- దత్తత తీసుకున్న పిల్లల వయసు ఆధారంగా ప్రసూతి సెలవుల నిబంధన కొట్టివేత
- దత్తత తీసుకున్న బిడ్డకు, కన్నబిడ్డకు వ్యత్యాసం ఉండదని ధర్మాసనం వ్యాఖ్య



**న్యూఢిల్లీ, మార్చి 17:** పితృత్వ సెలవును ఒక సామాజిక భద్రతా ప్రయోజనంగా గుర్తించే చట్టాన్ని తీసుకురావాలని సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అదే సమయంలో, పిల్లల వయస్సు ఆధారంగా దత్తత తీసుకున్న తల్లులకు ఇచ్చే ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేసే నిబంధనను కొట్టివేసింది. జస్టిస్ జె.బి. పర్దివాలా, ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం, పితృత్వ సెలవు మంజూరు, దాని వ్యవధి, షరతులతో సహా అంశం కేంద్రం విధాన పరిధిలోకి వస్తుందని వ్యాఖ్యానించింది. అయితే, తండ్రులను కూడా సమాన సంరక్షకులుగా గుర్తించే చట్టపరమైన వ్యవస్థ అవసరాన్ని నొక్కి చెప్పింది. "పితృత్వ సెలవును ఒక సామాజిక భద్రతా ప్రయోజనంగా గుర్తించే నిబంధనను తీసుకురావాలని తాము కేంద్రాన్ని కోరుతున్నాము. అటువంటి సెలవు వ్యవధిని తల్లిదండ్రులు, పిల్లలు ఇద్దరి అవసరాలకు అనుగుణంగా ఉండే విధంగా నిర్ణయించాలి" అని జస్టిస్ పర్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దత్తత తీసుకున్న తల్లులకు ప్రసూతి సెలవును పరిమితం చేసే నిబంధనల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)పై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. తన తీర్పులో, సుప్రీంకోర్టు సామాజిక భద్రతా కోడ్, 2020లోని సెక్షన్ 60(4)ను కొట్టివేసింది. ఈ సెక్షన్ ప్రకారం, దత్తత తీసుకున్న బిడ్డకు మూడు నెలల కంటే తక్కువ వయస్సు ఉంటేనే దత్తత తల్లులకు ప్రసూతి సెలవుకు అర్హత ఉంటుంది. ఈ నిబంధన అసమంజసమైన వర్గీకరణను సృష్టిస్తుందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కింద సమానత్వ హామీని ఉల్లంఘిస్తుందని ధర్మాసనం పేర్కొంది. "దత్తత తీసుకున్న బిడ్డ అవసరాలు సొంత బిడ్డ అవసరాల కంటే భిన్నమైనవి కావు. బంధుత్వాన్ని అర్థం చేసుకోవడానికి సాంప్రదాయకంగా జీవశాస్త్రమే ప్రధానమైన దృక్కోణంగా ఉన్నప్పటికీ, దత్తత కూడా అంతే చెల్లుబాటు అయ్యే మార్గం. జీవసంబంధమైన కారకాలు మాత్రమే కుటుంబాన్ని నిర్ధారించవు. దత్తత తీసుకున్న బిడ్డ సొంత బిడ్డకు భిన్నమైనది కాదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది. మూడు నెలల కంటే తక్కువ వయసు ఉంటేనే దత్తత తల్లులకు ప్రసూతి సెలవులంటూ పరిమితి రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ, దత్తత తీసుకునే సమయంలో బిడ్డ వయస్సుతో సంబంధం లేకుండా, ప్రసూతి సెలవు ప్రయోజనాలు దత్తత తీసుకున్న తల్లులందరికీ సమానంగా వర్తించాలని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. దత్తత తీసుకున్న పిల్లల అవసరాలు, సొంత పిల్లల అవసరాల కంటే ఏమాత్రం భిన్నంగా ఉండవని, ముఖ్యంగా కొత్త కుటుంబ వాతావరణంలో కలిసిపోయే తొలి దశలలో ఈ తేడా స్పష్టంగా ఉంటుందని సుప్రీంకోర్టు మరింతగా నొక్కి చెప్పింది. పిల్లల సంరక్షణ బాధ్యతలలో తండ్రుల పాత్రను గుర్తించడం, వారి అభివృద్ధిని మెరుగుపరచడం వంటి విస్తృత ప్రాముఖ్యతను కూడా ఇది నొక్కి చెప్పింది. తద్వారా పిల్లల సంరక్షణ బాధ్యతలలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించవచ్చని పేర్కొంది. ప్రస్తుతం, భారత చట్టం ప్రకారం ప్రసూతి ప్రయోజన చట్టం (మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్) కింద అర్హులైన మహిళలకు 26 వారాల వరకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవును అందిస్తున్నారు. అయితే, పితృత్వ సెలవు (పిడర్నస్ హాలిడే)కు సంబంధించి సమగ్రమైన చట్టపరమైన నిబంధనలు లేవు.

## మంటల్లో పశ్చిమాసియా



### అమెరికా యుద్ధనౌకలో అగ్నిప్రమాదం..
# వందలాది సైనికులకు అస్వస్థత

**వాషింగ్టన్, మార్చి 17:** ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా కొనసాగిస్తోన్న ఆపరేషన్‌లో అమెరికా విమాన వాహకనౌక జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఎర్ర సముద్రంలో తన వంతు సహకారాన్ని అందిస్తోంది. ఇటీవల ఈ నౌకలో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఘటనను అమెరికా సైనిక అధికారులు ధ్రువీకరించారు. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం.. వారం క్రితం జెరాల్డ్ నౌకలోని ప్రధాన లాండ్రీ విభాగంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అనంతరం వెంటిలేషన్ డక్ట్‌ల ద్వారా ఇతర భాగాలకు మంటలు వ్యాపించాయి. నౌకలోని పలు ప్రదేశాల్లో దాదాపు 30 గంటల పాటు అగ్నికీలలు ఎగసిపడ్డాయి. దీంతో పలు కంపార్ట్‌మెంట్లలో ఉన్న అమెరికా సైనికులు, నావికులు విష వాయువులు పీల్చి అస్వస్థతకు గురయ్యారు. ఘటన జరిగిన సమయంలో నౌకలో 4,500 మంది సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో 600 మంది సెయిలర్ల పడకలు అగ్నికి ఆహుతి అయ్యాయి. 30 గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పివేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రాణ నష్టానికి సంబంధించి ఎటువంటి సమాచారం వెలువడలేదు. నౌకలో తీవ్రంగా మంటలు చెలరేగినప్పటికీ పెద్దనష్టం జరగలేదని అమెరికా సైనిక అధికారులు వెల్లడించారు. విమాన వాహక నౌక పూర్తిస్థాయిలో పనిచేస్తోందన్నారు. అస్వస్థతకు గురైన సిబ్బందికి చికిత్స అందిస్తున్నామన్నారు. అగ్నిప్రమాదానికి గురైన కంపార్ట్‌మెంట్లను పునరుద్ధరించడానికి చర్యల తీసుకుంటున్నామన్నారు.

# మాకు ఎవరి అవసరం లేదు: ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 17:** ఇరాన్‌తో యుద్ధం వేళ.. బలప్రయోగం ద్వారా హర్మూజ్ జలసంధిని తెరిపించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందిస్తూ.. తమకు ఎవరి అవసరం లేదన్నారు. హర్మూజ్‌లో నౌకల రవాణాను పునరుద్ధరించేందుకు తాము ఒంటరిగానే ప్రయత్నిస్తామని చెప్పారు. 'మాకు ఎవరి అవసరం లేదు. మాది ప్రపంచంలోనే అత్యంత బలమైన దేశం. అత్యంత శక్తిమంతమైన సైన్యం మాకుంది' అని అధ్యక్షుడు వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిపై మిత్ర దేశాలు కలిసి రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతోపాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

# ఇరాన్ ఆలి లారిజానీని హతమార్చాం: ఇజ్రాయెల్

**టెల్ అవీవ్, మార్చి 17:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఇరాన్ భద్రతా వ్యవహారాల చీఫ్ అలీ లారిజానీని హతమార్చామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ అధికారికంగా ధృవీకరించారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలను మరింత దట్టం చేస్తోంది. ఇజ్రాయెల్ మీడియా కథనాల ప్రకారం, రాత్రివేళ ఇరాన్‌లోని సీనియర్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. ఈ దాడిలో లారిజానీతో పాటు ఇరాన్ బసిజ్ పారామిలటరీ దళాల అధిపతి ఘోలంరెజా సొలైమానీ కూడా మరణించినట్లు తెలుస్తోంది. ఇరాన్ నుంచి దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అలీ లారిజానీ ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఇటీవల అమెరికాఇజ్రాయెల్ ఉమ్మడి దాడుల్లో మరణించిన సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీకి ఆయన అత్యంత నమ్మకస్తుడిగా, కుడిభుజంగా పేరుగాంచారు. ఖమేనీ మరణానంతరం ఇరాన్ భద్రతా వ్యవస్థలో లారిజానీ అత్యంత కీలకమైన వ్యక్తిగా మారారు. ఖమేనీ మరణంతో ఇరాన్‌లో ఇప్పటికే తాత్కాలిక నాయకత్వ మండలి పాలన సాగిస్తోంది. ఇలాంటి సమయంలో జరిగిన ఈ దాడి దేశంలో రాజకీయ అస్థిరతను మరింత పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# గంగానదిలో ఇఫ్తార్ విందు, 14 మంది అరెస్టు

**వారణాసి, మార్చి 17:** యూపీ, వారణాసిలోని పవిత్ర గంగా నదిలో కొంతమంది యువకులు ఇఫ్తార్ విందు జరుపుకోవడం వివాదంగా మారింది. దీనిపై పలు హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పోలీసులు 14 మందిని అరెస్టు చేశారు. గంగా నదిపై ఒక బోటులో ఒక వర్గానికి చెందిన యువకులు ఇఫ్తార్ విందు చేసుకున్నారు. గంగా నదిలో బోటుపై ప్రయాణిస్తూ వివిధ పదార్థాలుసహా చికెన్ బిర్యానీ వంటి నాన్ వెజ్ తిన్నారు. పైగా మిగిలిన బిర్యానీ, ఎముకలు వంటి పదార్థాల్ని నదిలోనే పడేశారు. అంతేకాదు దీన్నంతటినీ వీడియో తీసుకుని, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పవిత్రంగా భావించే గంగానదిలో విందు చేసుకోవడం, నాన్‌వెజ్‌ను నదిలో పారేయడం ఏంటని కొందరు హిందూ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై రజత్ జైస్వాల్ అనే వ్యక్తి కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలా చేయడం వల్ల తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, నిందితులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరిపారు. విందు చేసుకున్న 14 మందిని గుర్తించి, అరెస్టు చేశారు. మరికొందరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. నదిలో బోటుపై విందు చేసుకోవడానికి గల కారణాలపై నిందితుల్ని విచారిస్తున్నారు. పూర్తి విచారణ అనంతరం నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

### రష్యా వదిలేసిన 'టైమ్‌బాంబ్'
# రెండు దేశాలకు భయం భయం!



**మాస్కో, మార్చి 17:** నడి సముద్రంలో రష్యా వదిలేసిన ఓ 'చమురు బాంబ్' రెండు దేశాలను కలవరపెడుతోంది. డ్రోన్ దాడిలో సగం కాలిన చమురు నౌక.. పర్యావరణ వినాశనానికి దారితీస్తుందనే భయాలు వ్యక్తమవుతున్నాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ఆ రెండు దేశాలు ఆందోళనకు గురవుతున్నాయి. అసలేం జరిగిందంటే.. రష్యా జెండాతో ఉన్న ఆర్కిటిక్ మెటాగాజ్ చమురు నౌకపై ఈ నెల 3న దాడి జరిగింది. మధ్యధరా సముద్రంలో ప్రయాణిస్తుండగా తటస్థ జలాల్లో ఈ నౌకపై డ్రోన్లతో దాడులు చేశారు. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ నెల 11న మీడియాకు వెల్లడించింది. మాల్టాకు ఆగ్నేయాన 168 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుందని తెలిపింది. ఉక్రెయిన్ నావెల్ డ్రోన్లు ఈ దాడికి పాల్పడినట్లు ఆరోపించింది. అయితే, దీనిపై కీవ్ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ముర్మాన్స్క్‌లోని రష్యన్ ఆర్కిటిక్ పోర్టు నుంచి ఈజిప్టు వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దాడి సమయంలో నౌకలో 30 మంది సిబ్బంది ఉండగా.. వీరిలో కొందరు గాయపడ్డారు. లైఫ్‌బోట్ సాయంతో వీరు అందులో నుంచి బయటపడ్డారు. ఆయిల్ ట్యాంకర్‌ను అక్కడే వదిలేసి సిబ్బంది వెళ్లిపోయారు. అయితే, నౌకలో 900 మెట్రిక్ టన్నుల డీజిల్, 60 వేల మెట్రిక్ టన్నుల లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జి) ఉంది. ఇప్పుడిదే భయాందోళనలు కలిగిస్తోంది. ప్రస్తుతం ఈ నౌక మాల్టా, ఇటలీ తీరాల మధ్య తేలియాడుతోంది. సగం కాలిపోయి ఒకపైపునకు ఒరిగినట్లుగా ఉన్న నౌక దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇందులో నుంచి చమురు సముద్రంలోకి లీకవుతోంది. అంతర్జాతీయ జలాల్లోనే నౌకపై దాడి జరిగినప్పటికీ బలమైన గాలుల కారణంగా ఇది ఇటలీ తీరానికి కొట్టుకొచ్చే ప్రమాదం ఉందని ఆ దేశ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. చమురు, గ్యాస్‌తో నిండి ఉన్న ఈ నౌక 'టైమ్ బాంబ్'తో సమానమేనని, దాన్ని తమ దేశ పోర్టులకు తీసుకురావొద్దని ఇటలీ మంత్రులు తమ ప్రధాని జార్జియా మెలోనీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

# యూరియా కార్గోల ఎగుమతులపై ఆంక్షలు సడలించండి

### చైనాను కోరిన భారత్

**న్యూఢిల్లీ, మార్చి 17:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా భారత్‌కు ఇంధన సరఫరా తగ్గిపోయి ఎరువుల ఉత్పత్తికి ముప్పు ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో, యూరియా కార్గోల ఎగుమతులపై ఆంక్షలను సడలించాలని చైనాను భారత్ అభ్యర్థించినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. యూరియా ఉత్పత్తికి కీలకమైన ద్రవీకృత సహజ వాయువు సరఫరాలకు హార్ముజ్ జలసంధి మూసివేతతో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో, కొన్ని యూరియా కార్గోల విక్రయానికి అనుమతించాలని భారత అధికారులు చైనా అధికారులను కోరినట్టు సమాచారం. ప్రస్తుతం తక్షణ ఎరువుల కొరతను ఎదుర్కోనప్పటికీ, ఈ అంతరాయం సుదీర్ఘకాలం కొనసాగితే, జూన్‌లో నైరుతి రుతుపవనాల రాకతో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌కు ముందే మరిన్ని నిల్వలను సమీకరించుకోవాల్సిన ఒత్తిడి ప్రభుత్వంపై పడవచ్చు. ఈ నేపథ్యంలో చైనాను భారత్ కోరినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చర్చలు ఇంకా కొనసాగుతున్నాయి, ఎలాంటి నిర్ణయం తీసుకోబడలేదు. చైనా యూరియా ఎగుమతులు కోటా విధానం కింద అమలవుతాయి. ఖరీఫ్ నాట్ల సీజన్ కోసం దేశీయ సరఫరాను భద్రపరుచుకున్న తర్వాతే, ఇతర దేశాలకు కోటాలను కేటాయిస్తుంది. గత ఏడాది అనుమతించిన షిప్‌మెంట్లలో భారత్‌కు కేటాయించిన కోటా కూడా ఉంది.

**రాబోయే దిగుమతుల ప్రణాళిక**

భారత్ 2026 ఫిబ్రవరి నాటికి 9.8 మిలియన్ టన్నుల యూరియాను దిగుమతి చేసుకోగా, రాబోయే మూడు నెలల్లో అదనంగా మరో 1.7 మిలియన్ టన్నుల దిగుమతికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎరువుల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నెలాఖరులోగా లేదా ఏప్రిల్ ప్రారంభంలో ప్రభుత్వం కొత్త యూరియా దిగుమతి టెండర్‌ను జారీ చేయవచ్చని అధికార వర్గాలు తెలిపాయి.

# ఆమూడు దేశాలు మావే!

### వెనిజులా, కెనడా, గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ 'ట్రూత్' పోస్ట్



**వాషింగ్టన్, మార్చి 17:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన విస్తరణవాద కాంక్షను మరోసారి చాటుకున్నారు. వెనిజులా అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరవచ్చా స్టేట్‌హుడ్ ఎవరికైనా కావాలా అంటూ ఆయన చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు ప్రపంచ దేశాలను విస్మయానికి గురిచేస్తోంది. గతంలో కెనడాను 51వ రాష్ట్రంగా పిలిచిన ట్రంప్, గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేస్తానని ప్రకటించారు. కానీ, ఒక దేశం గురించి నేరుగా స్టేట్‌హుడ్ అనే పదాన్ని వాడటం ఇదే మొదటిసారి. జనవరి 2026లో అమెరికా జరిపిన మెరుపు దాడిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకుని అమెరికాకు తరలించారు. అప్పటి నుంచి వెనిజులాను మేమే నడుపుతామని ట్రంప్ ప్రకటిస్తూ వస్తున్నారు. వెనిజులాలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలను అమెరికా కంపెనీలు స్వాధీనం చేసుకుంటాయని, ఆ దేశ మౌలిక సదుపాయాలను బాగు చేస్తామని ఆయన చెబుతున్నారు. అంతేకాకుండా ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఏఐ ద్వారా రూపొందించిన కొన్ని మ్యాప్‌లను షేర్ చేశారు. వాటిలో కెనడా, వెనిజులా, గ్రీన్‌లాండ్ అమెరికా జెండా కింద ఉన్నట్లు చూపించారు. గ్రీన్‌లాండ్ అమెరికా టెరిటరీ 2026లో స్థాపించబడిందనే క్యాప్షన్ ఇవ్వడం ద్వారా తన ఉద్దేశాలను స్పష్టం చేశారు. ట్రంప్ చర్యలపై కెనడా, డెన్మార్క్ (గ్రీన్‌లాండ్ మాతృదేశం) ఇప్పటికే తీవ్రంగా స్పందించాయి. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఇది కేవలం ట్రంప్ ఊహ మాత్రమే, వాస్తవం కాదని కొట్టిపారేశారు. మరోవైపు వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వెనిజులా ఏ సామ్రాజ్యానికీ కాలనీ కాదంటూ ట్రంప్ వ్యాఖ్యలను ఖండించారు.

### క్షణం ఆలస్యమైతే
# మొజ్తబా చనిపోయేవారే

### తోటలోకి వెళ్లడంతో ఆయన ప్రాణాలు దక్కాయి.. ప్రోటోకాల్ హెడ్ మజహర్ హుస్సేనీ



**టెహ్రాన్, మార్చి 17:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని హతమార్చిన అమెరికాఇజ్రాయెల్ క్షిపణి దాడి నుంచి ఆయన కుమారుడు, ప్రస్తుత కొత్త నాయకుడు మొజ్తబా ఖమేనీ సెకన్ల వ్యవధిలో ప్రాణాలతో బయటపడ్డారు. క్షిపణులు భవనాన్ని తాకడానికి కొద్ది క్షణాల ముందే మొజ్తబా గది నుంచి బయటకు వచ్చి తోటలోకి వెళ్లడంతో ఆయన ప్రాణాలు దక్కాయి. ఇరాన్ అధికారుల రహస్య సమావేశానికి సంబంధించిన ఒక ఆడియో లీక్ కావడంతో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. "దేవుని సంకల్పం వల్లే మొజ్తబా క్షిపణి దాడికి ముందే ఏదో పని మీద బయటకు వచ్చి తోటలోకి వెళ్లారు. ఆయన మెట్లు ఎక్కుతున్న సమయంలోనే క్షిపణులు భవనాన్ని తాకాయని ఖమేనీ కార్యాలయ ప్రోటోకాల్ హెడ్ మజహర్ హుస్సేనీ ఆ ఆడియోలో పేర్కొన్నారు. ఈ దాడిలో మొజ్తబా కాలికి స్వల్ప గాయం మాత్రమే అయిందని ఆయన వెల్లడించారు. మొత్తం మూడు క్షిపణులు ఆ భవనంపై పడ్డాయి. అందులో ఒకటి నేరుగా అలీ ఖమేనీ ఉన్న గదిపై పడటంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. ఇరాన్ మిలిటరీ చీఫ్ మహమ్మద్ షిరాజీ శరీరం ఈ బాంబు దాడికి ఛిన్నాభిన్నమైందని, ఆయన అవశేషాలను కూడా గుర్తుపట్టలేనంతగా పరిస్థితి ఉందని హుస్సేనీ వివరించారు. మొజ్తబా బావ మిస్బా అల్ హుదా బఘేరి కనీ కూడా ఈ దాడిలో తల సగానికి తెగిపోయి ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. మొజ్తబా ఖమేనీ పరిస్థితిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దాడి జరిగినప్పటి నుంచి ఆయన ప్రజల ముందుకు రాకపోవడంతో చాలామంది ఆయన చనిపోయాడని అంటున్నారు, మరికొందరు ఆయన ముఖం పూర్తిగా వికృతమైందని చెబుతున్నారు. ఆయన అసలు బతికే ఉన్నాడో లేదో మాకు తెలియదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ స్టేట్ టెలివిజన్ మాత్రం మొజ్తబా ఇచ్చిన రాతపూర్వక సందేశాన్ని మాత్రమే ప్రసారం చేస్తోంది, దీంతో ఆయన ఆరోగ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది.

# సైనిక చర్య ముసుగులో పాక్ మారణహోమం

### కాబూల్ ఆసుపత్రిపై దాడిపట్ల భారత్ ఖండన

**కాబూల్, మార్చి 17:** ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఒక ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో 400 మందికి పైగా అమాయకులు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఇది సైనిక చర్య ముసుగులో జరిగిన మారణ హోమం అని, పాకిస్థాన్ చర్య క్షమించరానిదని మండిపడింది. తాలిబన్ ప్రభుత్వ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి 9 గంటల సమయంలో కాబూల్‌లోని 2,000 పడకల సామర్థ్యం గల ఉమిద్ అడిక్షన్ ట్రీట్‌మెంట్ హాస్పిటల్‌పై పాక్ వైమానిక దాడులు జరిపింది. ఈ ఘటనలో 400 మందికి పైగా మరణించగా, మరో 250 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడిపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. "ఇది పిరికిపంద చర్య, క్షమించరాని హింస. సైనిక లక్ష్యం కాని ఒక వైద్య సదుపాయంపై దాడి చేసి ఇంత మంది పౌరుల ప్రాణాలను తీయడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్థించలేం అన్నారు.

# భారత్ ఆర్ఎస్ఎస్, రా వ్యవస్థలపై ఆంక్షలు ప్రకటించాలి

### అమెరికా ప్రభుత్వ సంస్థ అక్కడి ప్రభుత్వానికి సిఫారసు




**న్యూఢిల్లీ, మార్చి 16 :** మత స్వేచ్ఛ ఉల్లంఘనలలో పాత్ర పోషిస్తున్నందుకు భారత్ విదేశీ నిఘా వ్యవస్థ రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్(రా), బీజేపీ మాతృ సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)లపై ఆంక్షలు విధించాలని అమెరికా ప్రభుత్వ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్(యూఎస్‌సీఆర్ఎఫ్) తన 2026 సంవత్సరం వార్షిక నివేదికలో సిఫార్సు చేసింది. భారత్‌లో మతస్వేచ్ఛకు జరుగుతున్న ఉల్లంఘనలపై ఆందోళనలు వ్యక్తం చేస్తూ కమిషన్ నివేదిక ఇవ్వడం వరుసగా ఇది ఏడవసారి. భారత్‌ను మతస్వేచ్ఛ ఉల్లంఘనలు జరుగుతున్న దేశంగా ప్రకటించాలన్న కమిషన్ సిఫార్సును అమెరికా విదేశాంగ శాఖ ఇప్పటివరకు పరిగణనలోకి తీసుకోలేదు. మత స్వేచ్ఛ విషయంలో తీవ్రమైన ఉల్లంఘనలకు బాధ్యత రా, ఆర్ఎస్ఎస్‌దేనని, ఉల్లంఘనల పట్ల సహనంతో వ్యవహరించినందుకు వీటిపై ఆంక్షలు విధించాలని కమిషన్ ఈనెల 4న విడుదల చేసిన తన నివేదికలో అమెరికన్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. 2023లో న్యూయార్క్‌లో ఓ అమెరికా జాతీయుడిపై జరిగిన హత్యాయత్నానికి సంబంధించి రాపైన, దాని అప్పటి అధికారి వికాశ్ యాదవ్‌పైన ఆంక్షలు విధించాలని తన 2025 సంవత్సరం వార్షిక నివేదికలో కమిషన్ సిఫార్సు చేసింది. భవిష్యత్తులో భద్రతా సహాయం, ద్వైపాక్షిక వాణిజ్య విధానాలను భారత్‌లో మత స్వేచ్ఛ మెరుగుదలతో అనుసంధానించాలని ట్రంప్ ప్రభుత్వాన్ని కమిషన్ కోరింది. అమెరికా పౌరుల పైన, మతపరమైన మైనారిటీలపైన బెదిరింపులు, వేధింపులు కొనసాగుతున్నాయని పేర్కొన్న కమిషన్ భారత్‌కు ఆయుధాల అమ్మకాలను నిలిపివేసేందుకు ఆయుధ ఎగుమతి నియంత్రణ చట్టంలోని సెక్షన్ 6ని అమలు చేయాలని అమెరికన్ కాంగ్రెస్‌ను కోరింది. భారత ప్రజల మత స్వేచ్ఛకు ఆర్ఎస్ఎస్ ముప్పుగా పరిణమించిందని అమెరికా ప్రభుత్వానికి చెందిన అధికారిక కమిషన్ హెచ్చరించిందని కాంగ్రెస్ సోమవారం ఎక్స్‌లో పేర్కొన్నది. మహాత్మా గాంధీ హత్య తర్వాత ఆర్ఎస్ఎస్‌పై సర్దార్ పటేల్ నిషేధం విధించడాన్ని కాంగ్రెస్ గుర్తు చేసింది. ఆర్ఎస్ఎస్, రా విభాగాలపై నిషేధం విధించాలని సిఫార్సు చేస్తూ అమెరికా కమిషన్ ఇచ్చిన తాజా వార్షిక నివేదికను విదేశీ వ్యవహారాల శాఖ సోమవారం తోసిపుచ్చింది.



### 55 మంది అభ్యర్థులతో
# కేరళం కాంగ్రెస్ తొలిజాబితా!

**తిరువనంతపురం, మార్చి 17:** కేరళంలో త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. పార్టీ మంగళవారం తొలి జాబితాను ప్రకటించింది. తొలి దశ అభ్యర్థుల ఖరారులో భాగంగా ఎన్నికల కోసం 55 మందిని కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. వీరిలో 19 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉండగా ఒక్క ఎంపీకి కూడా చోటు దక్కలేదు. అనూహ్యంగా పెరుంబవూరు ఎమ్మెల్యే ఎల్దోసే కున్నప్పిల్లికి తొలి దశ జాబితాలో చుక్కెదురైంది. కేరళంలోని 140 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 9వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. నామినేషన్లకు చివరి తేదీ మార్చి 23 కావడంతో అన్ని పార్టీలు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేశాయి. కాంగ్రెస్ పార్టీ సైతం 55 మందితో తొలి జాబితాను విడుదల చేసింది. సీనియర్లు వీ.డీ. సతీషన్ పరావుర్, రమేశ్ చెన్నితాలా హరిపాడ్ నుంచి పోటీ చేయనున్నారు. సన్నీ జోసెఫ్ పెరావుర్, కే. మురళీధరన్ వట్టియూరావు, రమేశ్ పిషరొడి పాలక్కడ్ నుంచి బరిలోకి దిగనున్నారు. ప్రధానమైన కన్నూర్, కొన్ని సీట్లకు అభ్యర్థులను ఇంకా ఎంపిక చేయలేదు. సీనియర్ నాయకులు కే. సుధాకరన్, అదూర్ ప్రకాశ్ సైతం ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కేరళంలో ఈసారి కూడా ప్రధాన పోటీ పెద్ద పార్టీల మధ్యే జరుగనుంది. సీఎం పినరయి విజయన్ సారథ్యంలోని అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్), యూనైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ కూటమి (ఎన్డీఏ) మధ్య పోటీ ఆసక్తికరంగా సాగనుంది. దాదాపు 2.71 కోట్ల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఓటర్లలో మహిళల శాతమే అధికంగా ఉండడం విశేషం. మహిళా ఓటర్లు - 1.38 కోట్లకుపైగా ఉండగా పురుష ఓటర్లు 1.31 కోట్లమంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు - 277 మంది, 18-19 ఏళ్ల మధ్య ఉన్నవారు 4.24 లక్షలకుపైనేఉన్నారు. 85 ఏళ్లకు పైబడిన వారు 2 లక్షల పైగా ఉంటే దివ్యాంగులు కూడా 2.44 లక్షల మంది వరకూ ఉన్నారు.

# మూలపేట పోర్ట్‌కు లైన్‌క్లియర్

**• 385.24 ఎకరాల భూమి బదలాయింపు • సమస్య పరిష్కారంతో వేగంగా పోర్ట్ నిర్మాణం**

**• ఉగాది ముందు శుభవార్త తెచ్చిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**



కేంద్ర మంత్రి గోయల్‌తో రామ్మోహన్‌నాయుడు భేటీ(ఫైల్)

శ్రీకాకుళం, మార్చి 17 ప్రభాతవార్త: మూలపేట పోర్టు నిర్మాణ క్రమంలో కీలక సమస్యగా మారిన 385 ఎకరాల సాల్ట్ ల్యాండ్స్ సమస్య కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవతో పరిష్కారం అయింది. ఇందుకు సంబంధించి భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధి లోని పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభా గం నుండి మంగళవారం అధికారిక ఉత్తర్వులు రావడం తో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి దిశను మార్చే కీలకమైన ప్రాజెక్ట్ మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నిర్మాణాన్ని కీలకంగా తీసుకున్న కూట మి సర్కారు తాము అధికారంలోకి వచ్చింది మొదలు పనుల్లో వేగాన్ని పెంచింది. సమస్యలను సరిచేస్తూ నిత్యం సమీక్షలు చేస్తూ నిర్మాణంలో తుదిదశకు చేరు కుంది. ప్రస్తుతం అనుసంధాన రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన పనులు జోరుగా సాగుతున్నాయి. అయితే ఇదే తరుణంలో పోర్ట్ నిర్మాణంలో వీరికి ప్రధాన సమస్యగా మారింది. నౌపాడ పరిధిలోని ఉప్పు భూముల సమస్య మొత్తంగా 385.24 ఎకరాల సాల్ట్ భూములు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని అంతర్గత వాణిజ్య విభాగం, సాల్ట్ విభాగం పరిధిలో నౌపాడ సాల్ట్ ఫ్యాక్టరీ ఆధీనంలో ఉన్నాయి. వీటిని పోర్ట్ నిర్మాణం కోసం అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వానికి, ఎపి మేరిటైం బోర్డుకు మధ్య చర్చలు నడుస్తూనే ఉన్నాయి. మూలపేట పోర్ట్ నుండి టెక్కలిని, జాతీయ రహదారిని అనుసంధానించేందుకు ఈ 385.24 ఎకరాలు కీలకంగా మారాయి. వీటి మీదుగానే వంద ఎకరాల పరిధిలో 330 అడుగుల విశాల రహదారులు, భవిష్యత్ ఎగుమతి, దిగుమతు లకు సరిపడ మౌలిక వసతులను నిర్మించాలి. వీటితో పాటు సుమారు 280 ఎకరాలు ప్రధాన పోర్ట్ విస్తరణ కోసం అవసరం కానుంది. అయితే ఈ భూముల అప్ప గింతపై ఏకాభిప్రాయం రాకపోవడంతో పోర్ట్ నిర్మా ణంకు ప్రధాన అడ్డంకిగా మారింది. ఈ సమస్య పరి ష్కారంపై దృష్టి సారించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అవకాశం దొరికిన ప్రతీసారి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి త్వ శాఖతో, డైరెక్టర్ ఆఫ్ పోర్ట్స్, పోర్ట్స్ అడ్మినిస్ట్రేషన్ సి.ఈ.ఓ, మేరిటైం బోర్డ్, శ్రీకాకుళం జిల్లా యంత్రాం గం ఇలా వరుసగా భేటిలు, సమీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంగళ వారం ఈ భూములను నౌపాడ సాల్ట్ ఫ్యాక్టరి నుండి ఎపి మేరిటైం బోర్డ్‌కు 99 ఏళ్ల లీజు ప్రాతిపదికన అప్పజెప్పుతున్నట్టు అధికారిక ఉత్తర్వులు రావడంతో శుభవార్తను రామ్మోహన్ నాయుడు జిల్లా వాసులకు తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లా, ఉత్తరాంధ్ర అభివృద్ధి దిశను మార్చ నున్న మూలపేట పోర్ట్ విషయంలో తాజా సమస్య పరిష్కారంతో కీలక అడ్డంకి తొలగిందని ఆనందం వ్యక్తం చేశారు. అన్ని అడ్డంకులు తొలగుతూ ఉండటం తో మరికొద్ది నెలల్లోనే మూలపేట పోర్ట్ అందుబాటు లోకి వస్తుంది అనే ధీమాను రామ్మోహన్ నాయుడు వ్యక్తం చేశారు. ఈ అధునాతన గ్రీన్ ఫీల్డ్ పోర్ట్‌లో మొత్తంగా మూడు కార్గో బెర్తులు, ఒక కోల్ బెర్త్, ఇతర అధునాతన సదుపాయాలు ఉండనున్నాయి. ఎగు మతి, దిగుమతుల విషయంలో ఆంధ్రప్రదేశ్‌లోనే భవి ష్యత్‌లో కీలకంగా మారనుంది మూలపేట పోర్టు. కూటమి సర్కారు భాధ్యత తీసుకున్న తరువాత స్థానిక మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ చొరవతో శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి అవుతుండ టం పట్ల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# అమ్మ ఆశయం.. అక్షర విజయం!

**• సివిల్స్ విజేత రాముకు కలెక్టర్ ఘన సత్కారం**

**• తల్లిని గౌరవించి, సత్కరించిన స్వప్నిల్ దినకర్**

శ్రీకాకుళం, మార్చి 17 ప్రభాతవార్త: ప్రభుత్వ బడిలో చదివి, పేదరికాన్ని జయించి సివిల్స్‌లో 463వ ర్యాంక్ సాధించి సత్తా చాటిన సారోతు రామును జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారులతో కలసి ఘనంగా సత్కరించారు. ఈ అపురూప ఘట్టానికి రాము తల్లి లక్ష్మి కూడా సాక్షిగా నిలిచారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది కలిసి రాముకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం, విలువైన పుస్తకాలను బహుకరించి అభినందించారు.

**ఆదర్శం... ఈ 'రాము'డి ప్రయాణం:** ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాము ప్రతి విద్యార్థికి ఒక గొప్ప ఆదర్శం. తల్లి కూలీ పనులు చేస్తూ కొడుకును తీర్చిదిద్దడం, తండ్రిని కోల్పోయినా కుంగిపోకుండా ఎన్ఐటీ వరంగల్‌లో చదివి, నేడు సివిల్స్‌లో ర్యాంకు సాధించడం సామాన్యమైన విషయం కాదని కొనియాడారు. రాము సాధించిన ర్యాంకుకు ఐపీఎస్ వస్తుందని భావిస్తున్నానని, ఐఎఎస్ కూడా వచ్చే అవకాశం ఉందని, ఏ విభాగంలో సేవలందించినా జిల్లాకు గర్వకారణమని ఆకాంక్షించారు.

**కలెక్టర్ పెద్దమనసు:** సత్కార కార్యక్రమం ముగిసిన అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. రాము తల్లిని గౌరవిస్తూ, ఆ తల్లికొడుకులను స్వయంగా కలెక్టర్ కార్యాలయం కింద వరకు తోడ్కొని వెళ్లి, మర్యాదపూర్వకంగా వీడ్కోలు పలికారు. ఉన్నతాధికారి చూపిన ఈ ఆత్మీయతకి వారిరువురు కృతజ్ఞతలు తెలిపారు.



ఈతకు వెళ్లి నీటి కుంటలో పడి

# ఆర్మీ జవాన్ మృతి

గుత్తి, మార్చి 17 ప్రభాతవార్త: అనంతపురం జిల్లా గుత్తి మండలం రజాపురం గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న నీటికుంటలో సరదాగా ఈతకు వెళ్లి ఓ ఆర్మీ జవాన్ మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసు కుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీపురం గ్రామానికి చెందిన బంగారు వెంకటేష్ కుమారుడు ఆంజనేయులు (23) నాలుగు సంవత్సరాల క్రితం అగ్నివీర్ పథకం మేరకు ఆర్మీలో చేరాడు. ప్రస్తుతం జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో విధులు నిర్వహిస్తున్నాడు. ఉగాది పండుగను పురస్కరించుకొని గ్రామానికి ఇటీవల వచ్చాడు. తన మిత్రులు సోము, హారీష్‌లతో కలసి సరదాగా రజాపురం, వైటి చెరువు గ్రామాల నడుమ ఉన్న నీటి కుంటలో ఈతకు వెళ్లారు. సోముకు మాత్రమే ఈత వస్తుంది. మిగిలిన ఇద్దరికీ ఈత రాదు. సోము బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఆంజనేయులు, హారీష్ నీటికుంట మొదలు ప్రాంతంలో సరదాగా ఈత కొట్టారు. ఈ నేపథ్యంలో ఆంజనేయులు పట్టు తప్పి లోపలికి వెళ్లిపోయాడు. స్నేహితుడు హారీష్ కేకలు విని సోము హడావుడిగా కుంటలో గాలింపు చర్యలు చేపట్టాడు. అయినా ఫలితం శూన్యమైంది. వారి కేకలు విన్న గ్రామస్తులు కుంటలో గాలించారు. అయినప్పటికీ ఫలితం శూన్యం. ఎట్టకేలకు గుంతకల్లు నుండి వచ్చిన అగ్నిమాపకదళ కేంద్రం సిబ్బంది గాలించగా జవాన్ మృతదేహం లభ్యమైంది. ఆయన మృతితో శ్రీపురం శోకంలో మునిగిపోయింది. ఈ సంఘటనపై అర్బన్ సిఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నాణ్యమైన విద్యతోపాటు విలువలు నేర్పాలి

**• విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి • ఉపాధ్యాయులకు టిటిడి జెఇఒ శరత్ పిలుపు**





తిరుమల, మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో బాటు జ్ఞానం, నైపుణ్యాలు, విలువలను పెంపొందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ ఉద్ఘాటించారు. విద్యార్థుల చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు పర్యవేక్షణ, మార్గదర్శ కత్వం, ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. మంగళవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో టిటిడి డిఇఒ వెంకటసునీలు, టిటిడి కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యా యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర మార్గదర్శకత్వం లో విద్యాసంస్థల్లో పలు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులను వారి ప్రతిభ ఆధారంగా గ్రూపులుగా విభజించి, ప్రతి గ్రూపులో అన్ని రకాల విద్యార్థులు ఉండేలా చూసి, మంచి ప్రతిభ కలిగిన వారు ఇతరులకు సహాయం చేసే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఉపాధ్యా యులు పాఠాలు మరింత బాగా బోధిస్తే పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించవచ్చని తెలిపారు. అలాగే ఉపాధి ఆధారిత కోర్సులు, కొత్త విద్యా విధానంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను సకాలంలో నవీకరించాలన్నారు. డిజిటల్ బోధన పద్ధతులు, స్మార్ట్ క్లాసులు ఉపయోగించాలని, ముందుగానే పాఠ్యాంశాల బోధన విధానం సిద్ధం చేసి బోధించే విధంగా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్‌తో పాటు వారి పురోగతిని నిరంతరం నమోదు చేయాలన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించి, విద్యార్థుల సంక్షేమంపై కూడా దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఎస్వీ సంగీత కళాశాలకు చెందిన కె.ప్రదీప్ జాతీయ స్థాయి డోలు వాయిద్య పోటీల్లో ప్రథమ బహుమతి సాధించినందుకు జెఇఒ డాక్టర్ శరత్ అభినందించారు. చెన్నైలోని సత్యభామ విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 150 విశ్వవిద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రదీప్‌కు డోలు వాయిద్యంలో శిక్షణను హెచ్ఒడి వైఎల్. శ్రీనివాస్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, ఎస్జీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ, ఎస్వీడబ్ల్యూ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ భువనేశ్వరి, ఎస్వీడబ్ల్యూ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతమ్మ, ఎస్వీ మ్యూజిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమ ముద్దుబాల పాల్గొన్నారు.



# టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడును తొలగించాలి

విజయనగరం, మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల పుణ్యక్షేత్రానికి బిఆర్ నాయుడు లాంటి స్త్రీ లోలుడును ఛైర్మన్‌గా కొనసాగించడం తిరుమల పవిత్రతను దెబ్బ తీయడమేనని, తక్షణమే నాయుడును ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలని జిల్లా పరిషత్ ఛైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి డిమాండ్ చేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక బాలాజీ జంక్షన్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వైసిపి శ్రేణుల ఆధ్వర్యంలో మంగళవారం భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం జరిగింది. శ్రీ వెంకటేశ్వర స్వామి తమ ఇలవేల్పు అని, ఇంటి దైవం అని, తన ఇంట్లో నుంచి చూస్తే ఏడు కొండలు కనిపిస్తాయని చెప్పే చంద్రబాబు కళంకిత వ్యక్తికి అతి పవిత్రమైన టిటిడిలో అత్యున్నత ఛైర్మన్ పదవిని ఎలా కట్టబెట్టారని వారు ప్రశ్నించారు. బిఆర్ నాయుడును పదవి నుంచి తొలిగించే వరకు వైసిపి పోరాటాన్ని కొనసాగిస్తుందని చిన్న శ్రీను, వీరభద్ర స్వామి స్పష్టం చేశారు.

# జిందాల్ భూ వంచనపై షర్మిల ఆగ్రహం

**కలెక్టర్‌తో చర్చిస్తా.. ప్రభుత్వానికి లేఖ రాస్తానంటూ బాధితులకు పిసిసి చీఫ్ అభయం**





శృంగవరపుకోట (విజయనగరం జిల్లా), మార్చి 17 ప్రభాతవార్త: విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలోని జిందాల్ అల్యూమినా రిఫైనరీ భూ బాధితులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి పూర్తిస్థాయిలో అండగా ఉంటామని ప్రకటించారు. మంగళవారం బాధితులు తనను కలిసి 18 ఏళ్లుగా సాగుతున్న వంచనను వివరించగా, ఆమె ఉద్వేగభరితంగా స్పందించారు. స్థానిక జామిలో జరిగిన సభలో పరిశ్రమల స్థాపన పేరుతో భూములు లాక్కుని, 18 ఏళ్ల గడిచినా అటు ఉపాధి కల్పించక, ఇటు భూములు తిరిగి ఇవ్వక పేద రైతులను వంచించడంపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2007-08 కాలంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి తెచ్చిన ప్రాజెక్ట్ అని, ఆయన మాట తప్పరన్న నమ్మకంతో సుమారు 1,100 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను ప్రభుత్వానికి అప్పగించామని కిల్తంపాలెం, ముషిడిపల్లి, మూల బొడ్డవర, పెద్దఖండేపల్లి పంచాయతీలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. "నాడు భూ యజమానులమైన మేము, నేడు పొట్టకూటి కోసం వలస కూలీలుగా మారాం" అని రైతులు వాపోయారు. 18 ఏళ్లు గడిచినా ఒక్క ఉద్యోగం రాలేదని, జిందాల్ సంస్థ ఒక్క రూపాయి పెట్టుబడి పెట్టకుండా భూములను అట్టిపెట్టుకుని భూ దందాలకు పాల్పడుతోందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. గత జూన్ 2025 నుండి స్థానిక రెవెన్యూ, కంపెనీ ప్రతినిధులు పోలీసు బలగాలతో తమను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమంగా ఖాళీ చేయిస్తున్నారని రైతులు షర్మిల దృష్టికి తీసుకెళ్లారు. రైతులతో మాట్లాడిన సందర్భంగా షర్మిల దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ని స్మరించుకున్నారు. "రాజశేఖర్ రెడ్డి బ్రతికి ఉండి ఉంటే ఇప్పటికే ఇక్కడ పరిశ్రమ స్థాపించబడి ఉండేది. ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెంది, రైతులకు, వారి కుటుంబాలకు ఎంతో మేలు జరిగేది" అని ఆమె పేర్కొన్నారు. నేడు ఆశించిన అభివృద్ధి జరగకపోవడం, రైతులు రోడ్డున పడటం అత్యంత బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి తాను తక్షణమే రంగంలోకి దిగుతానని షర్మిల హామీ ఇచ్చారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌తో స్వయంగా మాట్లాడి రైతుల సమస్యను వివరిస్తానని, అలాగే ప్రభుత్వానికి అధికారికంగా లేఖ రాసి 1,100 ఎకరాల భూములను తిరిగి రైతులకు అప్పగించాలని డిమాండ్ చేస్తానని స్పష్టం చేశారు. "రాజన్న మాట నమ్మి ఆనాడు మీరు భూములు ఇచ్చారు, నేడు అదే రాజన్న బిడ్డగా నేను మీ తరపున కొట్లాడుతాను" అని షర్మిల భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా నిలుస్తుందని, పోలీసులు, ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఎదిరిస్తామని ఆమె స్పష్టం చేశారు.

## నందిని సిధారెడ్డికి జగన్ అభినందన

విజయవాడ, మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడంపై మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సాహిత్య రంగంలో జాతీయ స్థాయిలో అత్యున్న తమైన ఈ పురస్కారం లభించడం రెండు తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని ఆయన కొనియాడారు. నందిని సిధారెడ్డి ఆధునిక తెలుగు కవిత్వంలో ఎన్నో పరిశోధనలు చేసి, తన అమూల్యమైన రచనలతో తెలుగు సాహితీ రంగానికి విశిష్ఠ సేవలు అందించారని గుర్తుచేశారు. నందిని సిధారెడ్డి కేంద్ర సాహిత్య అవార్డు రావడం, వారి సాహిత్య ప్రస్థానానికి దక్కిన గొప్ప గౌరవమని వైయస్ జగన్ ఒక ప్రకటనలో అభివర్ణించారు.

## ఏప్రిల్ 29 వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

**- పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి.దామోదర్ నాయుడు**

సచివాలయం, మార్చి 17 ప్రభాతవార్త: 4నెలల వయస్సు గల ఆవు, గేదె జాతి పశువుల్లో, దూడల్లో గాలికుంటు వ్యాధి సోకుతుందని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి.దామోదర్ నాయుడు చెప్పారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను ప్రతిరోజు మొదలుకొని ఏప్రిల్ 29వ తేది వరకు పశుపోషకుల ఇంటివద్దనే పశుసంవర్ధకశాఖ సిబ్బంది అందజేస్తారన్నారు. 4నెలల వయస్సు పైబడిన ఆవు గేదె జాతి పశువులకు, దూడలకు ఉచితంగా టీకాలు అందిస్తామన్నారు. కావున పశుపోషకుల అందరూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ విలువైన పశువులను కాపాడుకోవాలని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి.దామోదర్ నాయుడు పశుపోషకులకు విజ్ఞప్తి చేశారు.

# తిరుమలకొండను తాకిన గ్యాస్ కష్టాలు!

**- కమర్షియల్ సిలిండర్లు లేక హోటళ్లు మూత**







గ్యాస్‌లేకపోవడంతో హెచ్‌టి కాంప్లెక్స్‌లో మూతబడిన ఫాస్ట్‌ఫుడ్

తిరుమల, మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రపంచ హిందూ పుణ్యక్షేత్రం తిరుమలను గ్యాస్ కష్టాలు వెంటాడుతున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో వరుసగా జరుగుతున్న యుద్ధ వాతావరణం వల్ల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల సరఫరా తగ్గి పోయింది, కమర్షియల్ సిలిండర్లుకు డిమాండ్‌తో హోటళ్ళకు, ఫాస్ట్‌పుడ్ సెంటర్‌లకు కోత విధించారు. దీంతో చాలావరకు తెలుగు రాష్ట్రాల్లోనే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోపై ఈ ప్రభావం చూపింది. తాజాగా ఆదివారం నుండి తిరుమలను కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు రాకపోవడంతో వ్యాపారులు తలలు బాదుకుంటున్నారు.

పుణ్యక్షేత్రం తిరుమలపై వ్యాపారాలు యాత్రికుల రద్దీతోనే సవ్యంగా సాగుతాయి. భక్తుల సంఖ్య లేకుంటే వ్యాపారాలకు పెద్ద డిమాండ్ ఉండదు. అసలే వేసవి సెలవులకు ముందే తిరుమలను భక్తజనం తాకింది. సాధారణ రోజుల్లోనూ కొండపై లక్షమందికిపైగా భక్తులు చేరుకుంటు న్నారు. వీరంతా పలు రకాల ఆహారపదార్థాలు, ఫాస్ట్‌పుడ్‌లపై ఆధారపడుతుంటారు. ఇందుకు తిరుమలలో 30వరకు పెద్ద హోటళ్ళు నడుస్తుండగా 220కి పైగా ఫాస్ట్‌పుడ్ కేంద్రాలు ఉన్నాయి. వీటన్నిటికీ ఇప్పుడు కమర్షియల్ గ్యాస్ కొరత వెంటాడుతోంది. గత పదిరోజలుగా హోటళ్ళ వ్యాపారాలు నెట్టుకొచ్చి యాత్రికులకు అల్పాహారాలు, భోజనాలు, దక్షిణాది వంటకాలు తయారుచేసి అందించారు. ఇప్పుడు ఏకంగా కమర్షియల్ గ్యాస్‌పై ప్రభావం చూపడంతో సరఫరా ఆగిపోయింది. రోజుకు సరాసరి రెండువందలు వరకు కమర్షియల్ సిలిండర్ల వాడకం ఉంటుందని వ్యాపారుల కథనం.

ఇప్పుడు యుద్ధం ప్రభావంతో గ్యాస్ సమస్య తిరుమలను తాకింది. కమర్షియల్ గ్యాస్ కొరత తీవ్రంగా కనిపిస్తోంది. కొండపై సిఆర్ఒ, హెచ్‌టి, డిబి రోడ్డు ప్రాంతాల్లో చిన్న హోటళ్ళు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నడుస్తున్నాయి. వీటి నిర్వాహకులు గ్యాస్ అందక ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రిందట ఓ ప్రైవేట్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను తిరుమలకు తీసుకురావడంతో స్థానిక వ్యాపా రులు అడ్డుకున్నారు. గ్యాస్ కోసం పెద్ద ఎత్తున గుమిగూడారు. తమకు సిలిండర్లు ఇవ్వకుండా ఇతరులకు ఎలా సరఫరా చేస్తారని ప్రశ్నిస్తూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి పరిస్థితుల్లో తిరుమలలో దాదాపు అత్యధికశాతం హోటళ్ళు, ఫాస్ట్‌పుడ్ కేంద్రాలు మూతపడే పరిస్థిస్థితి వచ్చేసింది. గ్యాస్ కొరత సమస్య మాత్రం అలాగే కొనసాగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల తీవ్ర కొరత కారణంగా హోటళ్లు, టీ దుకాణాలు మూతపడుతున్నాయి.

ఇరాన్- ఇజ్రాయెల్ ఉద్రిక్తతల వల్ల సరఫరా తగ్గిందని, సిలిండర్ ధరలు పెరగడంతో పాటు దొరకడం కష్టమైందని నిర్వాహకులు చెబు తున్నారు. దీనివల్ల హోటల్స్ నిర్వాహకులు అటు టిటిడికి అద్దెలు చెల్లించలేని పరిస్థితి. ఇటు హోటళ్ళను నడుపుకుని వ్యాపారాలు చేసుకునే అవకాశం లేకపోయిందని వాపోతున్నారు. కొండపై హోటళ్ళు పూర్తిగా కమర్షియల్ గ్యాస్‌తో నడుస్తున్నాయి. వీటి నిర్వాహకులు సిలిండర్ల కోసం తంటాలు పడుతున్నారు. చాలా వరకు టీ, ఫాస్ట్‌పుడ్ సెంటర్లు గ్యాస్ లేక భక్తుల రద్దీ వేళ వ్యాపారాలు జరగక యజమానులు ఇబ్బంది పడక తప్పడంలేదు.

# గిరిజన గర్భిణుల కోసం

# 35 నూతన నిరీక్షణ వసతి భవనాలు





(ఫైల్)

**• పాడేరు ఐటిడిఎ పరిధిలో 15, రంపచోడవరం, పార్వతీపురం, చింతూరు, శ్రీశైలం, కోట రామచంద్రాపురంలో 4 చొప్పున నిర్మాణం**

**• వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**

సచివాలయం, మార్చి 17 ప్రభాతవార్త: గిరిజన గర్భిణీల కోసం 7సమీకృత గిరిజనాభివృద్ధి పరిధిలో 35నిరీక్షణ వసతి గృహాల కోసం కొత్త భవనాలు నిర్మిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో 15, రంపచోడవరం, పార్వతీపురం, చింతూరు, శ్రీశైలం, కోట రామచంద్రాపురంలో 4చొప్పున భవన నిర్మాణాల పనులు రూ.12.25కోట్లతో జరుగుతున్నాయని తెలిపారు. ఈ 35లో 22 కేంద్రాలు మే/జూన్ నెలల్లో, మరో రెండు జులై, మిగిలిన వాటిని ఈ ఏడాది చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం సీతంపేట, పార్వతీపురం, పాడేరు, రంపచోడవరం, చింతూరు, కోట రామచంద్రాపురం, శ్రీశైలం ఐటిడిఏల పరిధిలో కలపి 76 నిరీక్షణ కేంద్రాలు నడుస్తున్నాయి. ఇవి ప్రభుత్వాసుపత్రులకు అనుబంధంగానే పనిచేస్తున్నాయి. ఇందులో 41కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన వాటికి ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నాయి.

**ప్రతి భవనంలో 8గదులు:** ఒక్కో భవనంలో 8గదుల్ని నిర్మిస్తున్నారు. వీటిలో 4గదులు గర్భిణీలకు కేటాయిస్తారు. 4గదుల్లో ప్రతి దానికి ఒక మరుగుదొడ్డి నిర్మాణం కూడా జరుగుతోంది. అలాగే ఉమ్మడి వంటగది, రిక్రియేషన్ రూమ్, ఒక రిసెప్షన్ రూమ్, స్టోర్ రూమ్ ఉంటాయని, ఒక్కో భవన నిర్మాణానికి రూ.35లక్షల చొప్పున వ్యయం చేస్తున్నారు. ఈ నిర్మాణాలు జాతీయ ఆరోగ్య మిషన్ నిధులతో ఐటిడిఏ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. 27పిహెచ్‌సిలు, 6సిహెచ్‌సిలు, 2ఏరియా ఆస్పత్రులకు అనుసంధానంగా ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. పార్వతీపురం ఐటిడిఏ పరిధిలో మొండెంఖల్లు పిహెచ్‌సి, కోట రామచంద్రాపురం ఐటిడిఏ పరిధిలో బుట్టాయిగూడెం సిహెచ్‌సి, చింతూరు ఐటిడిఏ పరిధిలో రత్నాపురం ఏరియా ఆస్పత్రుల్లో ఈ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

**13వేల మంది గర్భిణీలకు ప్రయోజనం:** కొండలు, కోనల్లో నివసించే గర్భిణులను ఆశా వర్కర్, ఎఎన్ఎంలు ప్రసవ తేదికీ కనీసం వారం రోజులు ముందు ఇక్కడికి తీసుకొస్తారు. దీనివల్ల ప్రసవ సమయంలో రవాణాపరంగా, ఆరోగ్యపరంగా గర్భిణులకు సమస్యలు తప్పుతాయి. నిరీక్షణ వసతిగృహంలో గర్భిణీకి రోజుకి ఆహారం కోసం రూ.200లు సాయంగా ఉండే మరొకరికి రూ.200లు ఇస్తారు. సహాయకులుగా ఉండేవారు సదరు రోజుల్లో ఉపాధి కోల్పోయినందుకు నష్టపరిహారం కింద అదనంగా మరో రూ.200లు ఇస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు 11వేల మంది గర్భిణులు ఈ కేంద్రాల ద్వారా ప్రయోజనం పొందారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 9,500మంది వైద్యసేవలు పొందారు. ప్రస్తుత నిర్మాణాలు పూర్తయితే ఏడాదికి 13వేల మంది గర్భిణీలు ప్రయోజనం పొందే అవకాశం ఉంది.



## సిఎస్‌తో ఎన్‌డిసి ప్రతినిధి బృందం భేటీ

సచివాలయం, మార్చి 17 ప్రభాతవార్త: న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కళాశాలకు చెందిన ఎంవి పటేల్ నేతృత్వంలో 16మంది ప్రతినిధులతో కూడిన బృందం మంగళవారం ఏపి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌తో భేటీ అయింది. నేషనల్ డిఫెన్స్ కళాశాల ప్రతినిధి బృందం ప్రతి ఏటా వారి కోర్సు అధ్యయనంలో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి ఇతర అంశాలను అధ్యయనం చేయడం జరుగుతుంది. దీనిలో భాగంగా ఈ బృందం ఏపిలోని విశాఖపట్నం స్మార్ట్ సిటి అభివృద్ధి, అమరావతి ప్రజా రాజధాని అభివృద్ధి తదితర ప్రాంతాలను నేరుగా సందర్శించి అక్కడ జరిగే అభివృద్ధిని అధ్యాయనం చేయనుంది. ఎన్‌డిసి బృందం సిఎస్‌తో భేటి అయి నూతన రాజధాని నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్ళను ప్రభుత్వం అదిగమిస్తూ నిర్మాణ పనులను ఏవిధంగా ముందుకు తీసుకెళుతుందీ సీఎస్‌ను అడిగి తెలుసుకు న్నారు. ఈ సమావేశంలో బ్రిగేడియర్లు ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్, కిష్టకాంత్ శర్మ, రోహిత్ చలపతి, బినేష్‌కుమార్ పాండా, రవీంద్ర సింగ్ చేమ, బ్రిగేడి యర్ జనరల్ సెబ్సదే దూబా యిన్టిసో కమాండర్ జతిన్ సింగ్, ఎయిర్ కమాండర్ అలెగ్జాండర్ మాథ్యూ, కల్నల్ అజయ్ గురుంగ్, కీనెత్ ఆర్ హెర్రింగ్ డైనలతోపాటు ప్రియంవదా శర్మ, డిఐడి అరుణ్‌సింగ్, రాజశేఖర్ ఎన్, లెఫ్టినెంట్ కల్నల్ జమ్‌షిద్ ఖలిలోవ్ తదితర ప్రతినిధి బృందం ఉన్నారు.

## శ్మశానవాటికల్లో పరిస్థితులపై అధ్యయనం

విజయవాడ, మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని అవసరం మేరకు కొత్తవాటిని ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి మెంబర్ కన్వీనర్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్‌లు సభ్యులుగా ఉంటారు. రాష్ట్రవ్యాప్తంగా శ్మశానవాటికలు ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నాయి? మౌలిక వసతుల పరంగా అక్కడున్న లోటుపాట్లేంటి? అదనంగా శ్మశానవాటికల అవసరం ఎక్కడుంది? సౌకర్యాల కల్పన కొత్తవి ఏర్పాటుకు ఎంత నిధులు అవసరం? వంటి అంశాలను ఈ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తుంది. దాని ఆధారంగా హైకోర్టుకి ప్రభుత్వం నివేదిక సమర్పిస్తుంది. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టు శ్మశానవాటికల ఏర్పాటు , వాటిలో కనీస సౌకర్యాల కల్పన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని హైకోర్టు ఇటీవల తేల్చిచెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీల పరిధిలో శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ విజయవాడలోని గుణదలకు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్ పి.ప్రమోద్ హైకోర్టులో పిల్ వేశారు. దాన్ని విచారణకు స్వీకరించిన హైకోర్టు నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.




## రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయం

తిరుపతి హెల్త్, మార్చి 17 ప్రభాతవార్త: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని, గత పాలనలో అభివృద్ధిని విస్మరించారని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ చెప్పారు. ప్రభుత్వం కంపెనీల కోసం విశాఖపట్నం రాజధాని ప్రాంతాలలో భూములు కేటాయిస్తే తిరుపతి పార్లమెంటు సభ్యులు గురుమూర్తి కంపెనీలకు భూములు కేటాయించడానికి వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించారని, హైకోర్టు గురుమూర్తికి చివాట్లు పెట్టిన సంగతి అందరికీ తెలుసు అన్నారు. జగన్మోహన్ రెడ్డి తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఉమ్మడి గుంటూరు జిల్లా దాచేపల్లిలో రైతుల నుంచి కొన్ని వేల ఎకరాలు సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీ కోసం తీసుకొని అక్కడ చిన్న ఇటుక రాయి కూడా పెట్టలేదని, భూములు ఇచ్చిన రైతులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీని తుంగలో తొక్కిన చరిత్ర మీ నాయకుడిది అని పేర్కొన్నారు. ఇప్పటికీ 17 సంవత్సరాల కావస్తున్న వాటిపైన ఎందుకు కోర్టుకు వెళ్లలేదు అని గురుమూర్తిని సూటిగా ప్రశ్నిస్తున్న అన్నారు. చంద్రబాబు సహకారంతో రాష్ట్రం అభివృద్ధివైపు అడుగులు వేస్తుంటే, జగన్మోహన్ రెడ్డి దళితులను ద్రోహులుగా చిత్రీకరించే కార్యక్రమం చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధికి ఆటంకం కలిగించే జగన్మోహన్ రెడ్డి ఆలోచన విధానంలో ఎస్సీ రాజకీయ నాయకులు బలి కావద్దని గురుమూర్తికి సూచించారు. కేంద్రం రాష్ట్రానికి ఎన్నో విధాలుగా ఆర్థిక సహాయం చేస్తుందని, మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి అండగా ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి విష్ణువర్ధన్, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు పార్థసారథి, మండల అధ్యక్షులు శరత్ కుమార్, బిజెవైఎం నాయకులు జయకృష్ణ, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

# ఆత్మకూరు మున్సిపాల్టీని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం

**● ఎన్నికల హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది ● రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

ఆత్మకూరు (నెల్లూరు), మార్చి 17 ప్రభాతవార్త: ఆత్మకూరు మున్సిపాల్టీని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని అందుకు అన్ని రకాల ప్రత్యేక శ్రద్ధతో కృసి చేస్తామని, అందరి సమిష్టి సహకారం అవసరమని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో తుది కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మెన్లు, కౌన్సిలర్ల పదవి గడువు ముగియడంతో చివరి సమావేశం నిర్వహించి 32 గదుల అద్దె నిర్ధారణ, నాలుగు కోట్లతో నిర్మిచనున్న సిమెంటు రోడ్లు, సైడు కాలువల నిర్మాణాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లపాటు సేవలందించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లుకు వీడ్కోలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా జీవితంలో కొనసాగాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతుగా సహకరించాలని కోరారు. ఆతకూరు బైపాస్ రోడ్డు విస్తరణ, నగరవనం, స్టేడియం, సిమెంటు రోడ్లు నిర్మాణం, సైడ్ కాలువల నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయన్నారు. ఆత్మకూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మరిన్ని ప్రణాళికలను సిద్ధం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు సాధించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామన్నారు. పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా ఆత్మకూరు ఛైర్‌పర్సన్ గోపవరం వెంకటరమణమ్మ, వైస్ ఛైర్మెన్‌లు డాక్టర్ కోడూరు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, సర్దార్, కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, దగ్గుబాటి శివకోటారెడ్డి, పొడమేకల పెంచలయ్య యాదవ్, గందళ్ళ వేణు, పుచ్చులపల్లి రాధిక, షేక్ మహబూబ్‌బాషా సూరా భాస్కర్‌రెడ్డి,



మొలబంటి రాజశేఖర్, గౌస్‌బాషా, మాదాల శ్రీనివాసులు నాయుడు, చెరుకూరు కామాక్షయ్య నాయుడు, టి.తిరుపతమ్మ, జి.సంధ్య, తుమ్మల త్రివేణి, సయ్యద్ నౌషాద్‌బేగం, దిల్షాద్ బేగంలను మంత్రి ఆనం సన్మానించారు. మున్సిపాల్టీ తరపున కమీషనర్ సి.గంగాప్రసాద్ ఆధ్వర్యంలో ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మెన్లు, కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, టిడిపి నాయకుడు తాళ్ళూరు గిరినాయుడు, రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, కార్పోరేషన్ల డైరెక్టర్లు అబ్బూరి రమేష్‌నాయుడు, కంచర్ల మాధవి, టిడిపి నాయకులు పరిటాల సత్యనారాయణ, ఎల్.వి.రమణయ్య, దోర్నాదుల సురేష్‌బాబు, ఇందూరు వెంకటరమణారెడ్డి, తోడేటి వెంకటయ్య, రేష్మ, రబ్బాని, నాగులూరు చిన్నబ్బయ్య, తోట సందీప్, కాపా వెంకటసుబ్బయ్య, కొప్పోలు చిన్నపరెడ్డి, హయత్‌బాషా, కాటంరెడ్డి నర్సింహారెడ్డి, మునగపాటి సునీత, వైసిపి నాకులు సయ్యద్ జమీర్‌బాష, ముజీబుల్లా, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి కుటుంబానికి అండగా ఉంటున్నాం: మంత్రి ఆనం

సంగం (నెల్లూరు), మార్చి 17 ప్రభాతవార్త: ఇచ్చిన మాటను నిలబెట్టుకొని, అన్నదాతలకు ఏడాదికి 20 వేలు చెప్పినట్టు ఇస్తు, ప్రతి కుటుంబానికి అండగా ఉంటున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలో రైతన్న మీకోసం, మీ భూమి మీ హక్కు కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా మొదట పార్టీ జెండాను ఎగుర వేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతు అన్నారెడ్డిపాళెం గ్రామంలో 1.68 కోట్లతో అభివృద్ది పనులకు శంకుస్థాపనలు ప్రారంబోత్సవాలు చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామిలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొని వచ్చాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామిని నిలబెట్టుకుందని అన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, కిమ్స్ హాస్పటల్ డైరక్టర్ తాళ్లూరు గిరినాయుడుకి నాయకులు మెట్ట విజయకృష్ణారెడ్డి, దువ్వూరు సహకార సంఘం ప్రెసిడెంట్ బండా హరికిషోర్‌రెడ్డి, పొనకా హాజరత్‌రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఆత్మకూరు ఆర్‌డిఒ పావనీ, ఎడిఎ అనిత, తహసిల్దారు సోమ్లా నాయక్, ఎంపిడిఒ షాలెట్, మండల పార్టీ అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, సంగం సహకారం సంఘం ప్రెసిడెంట్ గుండ్ల శ్రీనివాస్‌యాదవ్, నీటి సంఘం అధ్యక్షులు సూరా శ్రీనివాసులురెడ్డి, వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, మక్తాపురం నాయకులు మోహన్‌రెడ్డి, అన్నారెడ్డిపాళెం యూత్ నాని, చరణ్, చవ్వల రమేష్, సతీష్, జనసేన నాయకులు పూసాల శ్రీదర్, దేగల నిరంజన్, నాగిశెట్టి శ్రీనివాసులు, బాను, జెండాదిబ్బ నాయకులు కంచర్ల నారాయణ నాయుడు, పర్వతాల వెంకటరత్నం, మండల తెలుగు యువత నాయకులు పెంచలయ్య, జబ్బార్, కంచర్ల నరేష్ చౌదరి, మర్రిపాడు నాయకులు జనార్ధన్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, ఆత్మకూరు మార్కెటింగ్ ఛైర్మన్ జనార్దన్ నాయుడు, డైరక్టర్ ఉక్కాల శ్రీనివాసులు, పంచాయితీరాజ్ డిఇ సుధాకర్‌రెడ్డి, పంచాయితీరాజ్ ఏఇ మల్లికార్జున, ట్రాన్స్ ఏడి సతీష్, ట్రాన్స్‌కో ఏఇ మన్మదరావు, అగ్రికల్చర్ ఏఇ శశిధర్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సాగర్ డిఫెన్స్.. మత్స్యకారులకు వరం



### రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 17 ప్రభాతవార్త: జువ్వలదిన్నె వద్ద సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ కంపెనీ వల్ల మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బంది ఉన్నట్లయితే ప్రభుత్వం వాటిని ముందుండి పరిష్కరిస్తుందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన మత్స్యకారులు, అధికారులతో ముఖాముఖిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మంత్రి కోల్లు రవీంద్ర పాత్రికేయులతో మాట్లాడుతూ సమస్యలు ఏమైనా స్థానిక నాయకుల సహకారాలతో ప్రభుత్వం దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ కంపెనీ ఏర్పాటు వల్ల మత్స్యకారులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందిని, మత్స్య సంపద ఎక్కడ ఉన్నది, సైక్లోన్, అల్ప పీడనాల వల్ల సముద్రంలో ఇరుక్కొన్న వారిని రక్షించవచ్చని తెలిపారు. ఉత్సాహం, తపన నేర్చుకోవాలనే దృక్పదం ఉన్న స్థానిక యువతకు ఉపాధి అవకాశం ఉంటుందన్నారు. సుమారు 114 ఎకరాలలో హార్బరును ఏర్పాటు చేయడం జరిగిందని, ముందు చూపుతోనే అనుబంద పరిశ్రమలు ఏర్పాటుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 20 పాయంట్ల పాలసి అమలు ద్వారా రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు రానున్నాయన్నారు. శాసన మండలి సభ్యులు బీదా రవిచంద్ర మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటం తరువాత కృష్ణపట్నం పోర్టుకు ప్రత్యామ్నాయంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బరు ఏర్పడిందన్నారు. సుమారు రూ.288 కోట్లతో హార్బరు ఏర్పాటు చేశామన్నారు.

స్థానిక శాసన సభ్యులు కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ కావలి నియోజికవర్గ మత్స్యకారులకు మంచి ఆస్తి జువ్వల దిన్నె హార్బరు అని కొనియాడారు. దళారులతో నిమిత్తం లేకుండా మార్కెటింగ్‌కు అవకాశం ఉంటుందన్నారు. విపత్తుల సమయంలో తప్పి పోయిన మత్స్యకారులను రక్షించుకొనే అవకశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తొలుత మత్స్య శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హార్బరు విశేషాలను తెలియచేసారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు బల్లి కళ్యాణ చక్రవర్తి, రాం గోపాల రెడ్డి, షిప్ యార్డ్ ఛైర్మన్ సత్య, డిప్యూటి మేయర్ రూప్ కుమార్ యాదవ్, కోటం రెడ్డి గిరిధర్ రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## మహోన్నత సేవా పతకానికి సిఎం స్పెషల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎంపిక



కె.మధుసూన్, గిరిబాబు

విజయవాడ, మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్య మంత్రి భద్రతా విభాగం స్పెషల్ సెక్యూరిటీ ఆఫీసర్ కె.మధుసూన్ మహోన్నత సేవా పతకానికి ఎంపికయ్యారు. సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్నందుకు గానూ ఆయనకు ఈ పతకం లభించింది. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి ఉగాది రోజున పతకాలు ప్రదానం చేయనున్నారు. 1996లో ఎస్ఐగా పోలీసు విధుల్లో చేరిన మధుసూధన్ నేడు డిఎస్పీగా పని చేస్తున్నారు. 2019 నుంచి చంద్రబాబుకు సిఎస్ఓగా విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ డ్రైవర్ ఎవిఎస్ గిరిబాబు కూడా ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. 1990లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విదుల్లో చేరిన గిరిబాబు, ప్రస్తుతం ఏఆర్ ఎస్ఐగా ఉన్నారు. గత 15ఏళ్లుగా చంద్రబాబు కాన్వాయ్ వాహన డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

# అమరావతిలో కాంట్రాక్టర్లకు సులభరీతిన ఇసుక

**- భూగర్భ వనరులు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా**

విజయవాడ, మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి పనుల పురోగతిలో అంతర్భాగమైన కంకర, ఇసుక, మట్టి వంటివి గుత్తేదారులకు సులభరీతిన లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని భూగర్భ వనరులు, గనులు, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి, తిరుపతి ఆర్థిక మండలి సిఇఒ ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు అదేశాల మేరకు అన్ని రకాల మైనింగ్ అనుమతుల విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ, నిబంధనల సరళీకరణను కూడా చేపట్టామన్నారు. సిఆర్డిఏతో కలిసి అమరావతి నిర్మాణ పనులకు సంబంధించి ప్రధాన గుత్తేదారులుగా ఉన్న ఎల్ అండ్ టి, మేఘా, ఎన్ సిసి, బిఎస్ సిపిఎల్, ఆర్ విఆర్ సంస్థల ప్రతినిధులతో మీనా మంగళవారం సచివాలయం వేదికగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ గుత్తేదారుల ఆకాంక్షల మేరకు సాధ్యమైనంత తక్కువ దూరంలోనే ఈ వనరులు లభించేలా చర్యలు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో ఇంకా ఎంతమేర గ్రావెల్, మట్టి, ఇసుక వంటివి అవసరం అవుతాయన్న దానిపై అంచనాలు సమర్పిస్తే తదనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేస్తామని వివరించారు. కృష్ణా జిల్లాలో అటవీ అనుమతుల పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుత్తేదార్లు మీనా దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ బాలాజీ నుండి వివరాలు తీసుకున్నారు. ఎట్టి పరిస్థితులలోనూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపవలసిందేనని, సమస్యల పేరిట పనులు అగేందుకు వీలు లేదని స్పష్టం చేసారు. కలెక్టర్ల సదస్సులో సిఎం ఏమి సూచించారన్న దానిని పరిగణన లోకి తీసుకోవాలని, సమస్యలకు పరిష్కారం చూపేందుకే మనం ఉన్నామన్న విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. సిఆర్‌డిఏ కమీషనర్ కన్నబాబు మాట్లాడుతూ మంచి మెటీరియల్ లభించాలంటే కొన్ని సందర్భాలలో దూరం వెళ్లవలసి రావాచ్చని గుత్తేదార్లు సహకరించాలని తెలిపారు. గుత్తేదార్లు మాట్లాడుతూ గతంతో పోల్చితే అనుమతులు వేగవంతం అయ్యాయని సంతోషం వ్యక్తం చేసారు. తమకు అవసరమైన కేటాయింపులు జరుగుతున్నాయని వివరించారు. సమావేశంలో భూగర్భ వనరులు, గనుల శాఖ సంచాలకులు చంద్రశేఖర్, సమీప జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ఈ హైబ్రిడ్ సమావేశంలో పాల్గొన్నారు.

## 600 బస్తాలు రేషన్ బియ్యం సీజ్

**- ముగ్గురిపై కేసు నమోదు... వాహానం సీజ్**



కోవూరు (నెల్లూరు), మార్చి 17 ప్రభాతవార్త: కావలి నుంచి చెన్నైకు మినీ కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను విజిలెన్స్ పౌరసరఫ రాల అధికారులు పట్టుకున్నారు. కావలిలోని మాలకొండ స్వామి రైస్ ట్రేడర్స్ నుంచి 600 బస్తాల రేషన్ బియ్యాన్ని ఆపిల్ బ్రాండ్‌తో ముద్రించిన ప్లాస్టిక్ సంచులలో రీ స్టైక్లింగ్ చేసి తరలిస్తున్నారు. రాబడిన సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు, జిల్లా పౌర సరఫరాల అధికారులు కావలి నుంచి చెన్నై వైపు వెళ్తున్న టీఎన్ 03 ఏపీ 4000 నెంబర్ గల మినీ కంటైనర్‌ను ఆపి తనిఖీ చేశారు. ఇందులో ఆపిల్ బ్రాండ్‌తో ముద్రించిన 600 బస్తాల బియ్యం ఉంది. దీంతో సివిల్ సప్లయిస్ జిల్లా అధికారిణి లీలారాణి, విజిలెన్స్ సీఐ నర్సింహారావులు బియ్యాన్ని తనిఖీ చేయగా ఈ తనిఖీలో అవి రేషన్ బియ్యం అని నిర్ధారణ అయింది. బియ్యాన్ని లారీతో పాటు సీజ్ చేసి కోవూరులోని ఇనమడుగులో ఉన్న ఎంఎల్ఎస్ గోదాముకు తరలించారు. ఈ అక్రమ రవాణాకు సంబంధించి కావలిలోని శ్రీ మాలకొండస్వామి రైస్ ట్రేడర్స్ యాజమాని కె. మాధవరెడ్డి, లారీ యజమాని పి. యోగానంద్, డ్రైవర్ సి. ముత్తయ్యలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



గూడూరు (నెల్లూరు), మార్చి 17 ప్రభాత వార్త: స్థానిక గమ్మళ్లపాళెం ప్రాంతానికి చెందిన రఘు(35) అనే యువకుడు ఆసుపత్రి రోడ్డులోని ఓ ఫోటో ల్యాబ్లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడితో కలసి మోటార్ సైకిల్ పై బైపాస్ రోడ్డు వైపుకు వెళ్తుండగా, అదే సమయంలో సాయి బాబా గుడి సమీపంలో ఎదురుగా నడిచి వస్తున్న ఓ వ్యక్తిని తప్పించబోయి అదుపుతప్పి మోటార్ సైకిల్ రోడ్డుపై బోల్తా పడింది. దీంతో మోటార్ సైకిల్ వెనుక కూర్చుని ప్రయాణిస్తున్న రఘు కిందపడడంతో అక్కడిక్కడకే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి ఎస్ఐ తిరుపతయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




ధ్వంసమైన పోలీసు వాహనం



ధ్వంసమైన టమోటాల ఆటో



అగంతుకుడిని తాళ్ళతో బందిస్తున్న పోలీస్, అగ్నిమాపక సిబ్బంది

# గంజాయి మత్తులో కర్ణాటక వాసి వీరంగం

**● పొలాల్లో మహిళలపై అనుచిత ప్రవర్తన ● కానిస్టేబుల్‌పై దాడి, పోలీసు వాహానంతో ఉడాయింపు ● అడ్డొచ్చిన వాహానాలను ఢీకొట్టి బీభత్సం ● వాహానం ఆగిపోవడంతో చెరువులోకి దూకిన దుండగుడు ● అగ్నిమాపక సిబ్బంది సహాయంతో వెలికితీసిన పోలీసులు ● ఆస్పత్రికి తరలింపు, కేసు నమోదు ● చిత్తూరు జిల్లా గంగవరంలో ఘటన**

గంగవరం, మార్చి 17 ప్రభాతవార్త: గంజాయి మత్తులో గంగవరంలో పోలీసు సబ్బందిని చితకొట్టి పోలీసు వాహానాన్ని తీసుకెళ్ళి ఓ ఆగంతుకుడు విధ్వంసకాండ సృష్టించిన సంఘటన చిత్తూరు జిల్లా గంగవరం మండలంలో చోటు చేసుకుంది. భార్యపై కోపంతో గంజాయి మత్తులో ఆగంతుకుడు పోలీస్ కానిస్టేబుల్‌ను బండరాయితో కొట్టి పోలీసు వాహానం నుండి పోలీసును కిందకు ఈడ్చిపడేసి పోలీసు వాహానాన్ని రహదారిపై అడ్డు వచ్చిన వాహానాలను గుద్దకుంటూ వెళ్తుండడంతో ప్రజలు తమ ప్రాణాలను అరచేతుల్లో పట్టుకుని ప్రాణాలను కాపాడుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో గంగవరం సమీపంలోని పంట పొలాల్లోకి ఓ అజ్ఞాత వ్యక్తి వచ్చాడు. పొలం పనులు చేసుకుంటున్న మహిళ రైతులు, వ్యవసాయ కూలీలతో చిత్ర విచిత్రంగా వ్యవహరిస్తూ అక్కడే ఉన్న గంగమ్మ ఆలయంలోని త్రిశూలం తీసుకుని అక్కడున్న వారిపై దాడికి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన వారు ఆగంతుకుడిని తరిమి వేశారు. ఆ ఆగంతకుడు అక్కడి నుండి 7.30 గంటలకు గంగవరం పెద్ద చెరువు సమీపంలోని వ్యవసాయ పొలాల్లోకి చొరబడి పంటను ధ్వంసం చేస్తూ అక్కడ వ్యసాయ పొలాల్లో పనులు చేసుకుంటున్న వారిపై కూడా దాడి చేయడానికి ప్రయత్నించడంతో వెంటనే అప్రమత్తమైన గంగవరం యువకులు స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. యువకులు ఆగంతుకుడిని నువ్వు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చావు? అని అడిగితే వారిని కన్నడ బాషలో నానా దుర్బాషలాడుతూ పక్కనే ఉన్న గంగవరం పెద్ద చెరువులోకి దూకేశాడు. అక్కడి నుండి 8.45 గంటలకు దండపల్లె రోడ్డులోని దర్గా వద్దకు చేరుకున్నాడు. అక్కడ కూడా ప్రజలపైకి దాడులకు పాల్పడుతుండడంతో ఓ కానిస్టేబుల్ పెట్రోలింగ్ వాహానంతో వచ్చాడు. ఆ దుండగుడిని అదుపులోకి తీసుకుకోవడానికి ప్రయత్నించగా, దుండగుడు బండరాయితో కానిస్టేబుల్ తలపై దాడి చేసి పోలీసు వాహానాన్ని మెరుపు వేగంతో దండపల్లె రోడ్డు మీదుగా పలమనేరు- మదనపల్లె జాతీయ రహదారిపై గంగవరం వైపు దూసుకెళ్లాడు. గంగవరం పోలీస్ స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న కారును వేగంగా డీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ తరువాత గంగవరం వంతెన వద్ద పలమనేరు వ్యవసాయ మార్కెట్‌కు టమోటాలు తరలిస్తున్న ఆటోను డీకొన్నాడు. ఈ ప్రమాదంలో పెద్దపంజాణి మండలం ఆకుల కొత్తూరుకు చెందిన ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వంతెన వద్ద పోలీసు వాహానం పూర్తిగా ధ్వంసమై నిలిచిపోవడంతో అగంతుకుడు పోలీసు వాహానం నుండి పరారీ అయి సమపంలోని చిగారాజుపల్లి చెరువులోనికి దూకేశాడు. విషయం తెలుసుకున్న పలమనేరు సిఐ మోహన్‌రెడ్డి, పలమనేరు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి చెరువు వద్దకు చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, స్థానిక గజ ఈతగాళ్ళు, యువకులు కలిసి చెరువులో నక్కి ఉన్న అగంతుకుడిని అతి కష్టంపై తాళ్లతో కట్టి, కావడిగా మోసుకుంటూ 108 వాహానంలో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం స్పృహలోకి వచ్చిన ఆగంతుకుడి వివరాలను పలమనేరు సిఐ మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు మేరకు బెంగళూరు యలహంక సమీపంలోని మారసంద్రకు చెందిన మునిరాజ్ కుమారుడు రత్నాకర్(40) ఓమిని వాహానంకు డ్రైవర్‌గా ఉంటూ పాఠశాలలకు విద్యార్థులను తరలించేవాడని తెలిపారు. భార్యపై కోపంతో, విరక్తితో సోమవారం రాత్రి ఇంటి నుండి వచ్చేసి ఎక్కడో పూటుగా గంజాయి సేవించి ఆ మత్తులోనే ఈ దురాగతానికి పాల్పడ్డారని తెలిపారు.

## ఉగాది పురస్కార గ్రహీతలు వీరే

అనంతపురం, మార్చి 17 ప్రభాతవార్త బ్యూరో: ఈ ఏడాది ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఉగాది పురస్కార గ్రహీతలను ఎంపిక చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 40 మందిని కళారత్న పురస్కార గ్రహీతలుగాను 124 మందిని ఉగాది పురస్కార గ్రహీతలుగాను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. యువజన అభ్యుదయం, పర్యటక, సాంస్కృతిక శాఖ ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం గ్రహీతలను ఎంపిక చేస్తూ మంగళవారం ప్రకటించింది. కళారత్న అవార్డులను 40 మందికి ఇవ్వగా, శ్రీ సత్యసాయి జిల్లా నుంచి హస్తకళల కింద డి.శివమ్మ, చిత్తూరు జిల్లా నుంచి శిల్పకళ విభాగం కింద కొండవాని పురుషోత్తమయ్య (జక్కన్న)కు అవకాశం దక్కింది. గ్రంథాలయాలకు సేవ చేసినందుకు గ్రంథాలయ ఉద్యమకారులు చంద్రశేఖర కల్కూరి (కర్నూలు జిల్లా), అన్నమయ్య జిల్లా నుంచి అవదానం, సాహిత్యం కింద లోకా జగన్నాథశాస్త్రిలకు కళారత్న అవార్డులు దక్కాయి. ఇదే విధంగా 2026 సంవత్సరం నాటికి ఉగాది పురస్కారాలు దక్కిన రాయలసీమ జిల్లాల వారిని పరిశీలిస్తే కర్నూలు జిల్లాకు చెందిన గద్వాల సోమన్నకు సాహిత్యంలో, నంద్యాల జిల్లాకు చెందిన డా.విడివి.రమణమూర్తికి సాహిత్యంలో, తిరుపతి జిల్లాకు చెందిన ఎం.శ్రీనివాస్, ధనుశ్రీకి భరతనాట్యం, కూచిపూడిలో ఉగాది పురస్కారాలు దక్కాయి. అనంతపురం జిల్లాకు చెందిన వసంత్‌కిరణ్ రాయసంకు కూచిపూడి భరతనాట్యంలోనూ, ఉరుముల సోమశేఖర్‌కు జానపదం, ఉరుములలోనూ, జర్నలిజంలో అమినేని రవిచంద్రకు ఉగాది పురస్కార గ్రహీతలుగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.

## అసెంబ్లీ మీడియా పాయింట్

# కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు జల్సాలు ఎక్కువయ్యాయి



### బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

**హైదరాబాద్,మార్చి 17 ప్రభాతవార్త :** 'హోం మంత్రిగా ఉన్న సిఎం రేవంత్‌రెడ్డి..మీ శాఖలో ఏం జరుగుతుందో తెలుసా..కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు జల్సాలు ఎక్కువయ్యాయి. అధికార దుర్వినియోగానికి పాల్ప డుతున్నాడు. ప్రైవేటు వ్యక్తులకు ఆయుధాలు ఇచ్చి కాల్పులు జరిపిస్తున్నారు. సెప్టెంబరు 2025లో కరీంనగర్ ఫైరింగ్ రేంజ్‌లో సీపీ సతీమణి, ఆమె ఐదుగురు మిత్రులతో కలిసి 10 రౌండ్లు కాల్పులు జరిపారు. ఏకే 47, పిస్టల్స్‌తో సుమారు 160 బుల్లెట్లను ప్రైవేటు వ్యక్తులు ఎలా వాడతారు?. బోనాలపల్లిలో అమృతమ్మ అనే వృద్ధురాలికి బుల్లెట్ తగిలింది. కానీ ఆమె రాయి తగిలిందని భావించింది. ఈ విషయాన్ని కప్పిపుచ్చడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.ప్రైవేటు వ్యక్తులు ఫైరింగ్ చేయడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తాను చెప్పింది తప్పని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటాను. ఇప్పుడు ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ ఎందుకు స్పందించడం లేదు. వికాస్ అగర్వాల్ అనే అధికారి ప్రైవేటు వ్యక్తికి ఇన్నోవా వాహనం ఇచ్చి పంపారు. ఇలా కొందరు అధికారుల వల్ల మొత్తం వ్యవస్థకు చెడ్డపేరు వస్తుంది. సీపీ..నన్నున్న బెదిరించలేడని, తాను భయపడే వ్యక్తిని కాదు. ఆయనకు ఇంటెలిజెన్స్ ఉంటే, మాకు లక్షలాది మంది కార్యకర్తలు సమాచారం ఇస్తారు" అంటూ కౌశిక్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**99 రోజులు పాలనకు నిధులు లేవు.. విధులు లేవు: బిఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

'సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న పనుల వల్ల ఎమ్మెల్యేలు గ్రామాల్లో ముఖం చూపెట్టు కోలేకపోతున్నారు. ఎమ్మెల్యేలు విశ్వాసం కోల్పోయారు. అత్యంత విఫల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. 99 రోజులు ప్రజాపాలన 9 రోజులుకే బొక్క బోర్ల పడింది. నిధులు లేవు.. విధులు లేవు. 99 రోజులు పాలనకు ముఖ్యమంత్రి ఏ కార్యక్రమం తీసుకున్న అట్టర్ ఫ్లాప్. కాంగ్రెస్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కాలం అయింది. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ధోరణితో ఉన్నారు. ఢిల్లీకి మూటలు తీసు కెళ్లడానికి వెళ్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. ముఖ్యమంత్రిపై విశ్వాసం కోల్పోయిన ఎమ్మెల్యేలు తమ దారి తాము చూసుకుంటున్నారు' అని అన్నారు.



**యాసంగికి రైతు భరోసా ఇవ్వలేదు: ఎమ్మెల్యే కె.సంజయ్**

'రైతుకు ప్రకృతి వైపరీత్యాలే సమస్య అనుకుంటే ఇపుడు ప్రభుత్వ వైపరీత్యాలు కూడా తోడయ్యాయి. యాసంగికి రైతు భరోసా ఇవ్వలేదు మొక్క జొన్న కొనుగోలుకు ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు లేవు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేక రైతులు రావాల్సిన ధరలో 35 శాతం నష్టపోతున్నారు. కరెంటు లేదు, పెట్టుబడి లేదు రైతు చాలా నష్టపోతున్నారు. ప్రెసెంట్ ని నాశనం పట్టించి..ఫ్యూచర్ గురించి ఆలోచన చేస్తున్నాడు ఈ సీఎం వ్యవసాయశాఖ మంత్రి కళ్లు తెరవాలి' అని అన్నారు.

**కెటిఆర్ సభను తప్పదోవ పట్టించే యత్నం : వేముల వీరేశం**

కేటీఆర్ సభను తప్ప దోవ పట్టిస్తు అబద్దాలు మాట్లాడుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'వాళ్లు చేసిన విధ్వంసాన్ని విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నిస్తే..ఆది శ్రీనివాస్ వాచ్ ఖరీదు కోటి రూపాయలు అని కేటిఆర్ సోషల్ మీడియా లో ట్రోల్ చేస్తున్నారు..అబద్ధపు ప్రచారాలను కేటిఆర్ పింక్ మీడియా ఆపాలి..ఆది శ్రీనివాస్ క్యారెక్టర్‌ను దెబ్బ కొట్టే విధంగా మాట్లాడుతున్నారు..ఆది శ్రీనివాస్ పై చేస్తున్న ఆరోపణలు వెనక్కి తీసుకొని కేటిఆర్ క్షమాపణలు చెప్పాలి'ని వీరేశం డిమాండ్ చేశారు.



**పోలీసులను అవమానిస్తున్న కౌశిక్‌రెడ్డి : ఎమ్మెల్యే నాగరాజు**

కౌశిక్ రెడ్డి తెలంగాణ పోలీసులను బెదిరిస్తుండని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ "పోలీసుల ఆత్మ స్థైర్యాని దెబ్బకొట్టే విధంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడిండు..గౌరవ ప్రదమైన పోస్ట్ లో ఉన్న కరీంనగర్ సీపీ ని కౌశిక్‌రెడ్డి అవమానిస్తున్నారు. గుండాయిజం చేస్తుండు "అని ఎమ్మెల్యే నాగరాజు విరుచుకుపడ్డారు.

**ఆ వాచ్ తీసుకుని 20వేలు ఇవ్వండి : విప్ రాంచందర్‌నాయక్**

"ఆది శ్రీనివాస్ వాచ్ ఖరీదు 90లక్షల రూపాయలు అని కేటీఆర్ అసత్య ప్రచారాలు చేస్తుండని ఆవాచ్‌ను కేటిఆర్, హరీష్ రావు తీసుకొని 20వేలు ఇవ్వండి అని ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ "ఆది శ్రీనివాస్ సభలో యాక్టివ్ గా మాట్లాడుతుండని కేటిఆర్ ఆయనపై విష ప్రచారం చేస్తున్నాడు. గతంలో సీతక్కను, ఇప్పుడు విప్ ఆది శ్రీనివాస్ పై అసత్య ప్రచారం చేస్తున్నారు.ప్రజా ధనాన్ని కొల్లగొట్టారని సొంత చెల్లె కవిత వ్యాఖ్యలకు ఇప్పటి వరకు కేటీఆర్ సమాధానం చెప్పలేదు"ని మండిపడ్డారు.

**అసత్య ప్రచారాలతో మా మనోధైర్యాన్ని తగ్గించలేదు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



అసత్య ప్రచారాలు చేసి మా మనోధైర్యాన్ని తగ్గించే మీ ప్రయత్నలు ఫలించవని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కెటిఆర్‌ను ఉద్దేశించి అన్నారు. ఈ మేరకు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'తన చెల్లె లు కవిత తమపార్టీపై చేస్తున్న వ్యాఖ్యలకు కెటి ఆర్ సమాధానం చెప్పాలని అన్నారు.ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మి పట్టం కట్టారు.. దుబాయ్ కేంద్రంగా విద్వేషపు వాట్సప్ మెసేజ్ ల ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారు. అయినా దాన్ని మేం తిప్పికొడతాం. అసెంబ్లీలో బిఆర్ఎస్ చేసే అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టే ప్రయత్నం చేశాను. దీంతో నేను పెట్టుకున్న వాచ్‌పై దుష్ప్రచారం మొదలుపెట్టారు. ఈ వాచ్ పేరు మైఖేల్ గోస్ దీని ధర 10,000 రూపాయలు.. 97 లక్షలు అంటూ ప్రచా రం చేస్తున్నారు. జబ్బలు సరుసుకొని జూబ్లీహిల్స్‌లో ఓడి పోయా రు..ప్రస్టేషన్‌లో బీసీ బిడ్డనైనా నాపైన అసత్య ప్రచారాలు చేస్తున్నారు.. ప్రజలు మీ పార్టీకి జీరో వ్యాల్యూ ఇచ్చారు..అసెంబ్లీ లో మాట్లాడిన ఫోటోను వాడి అసెంబ్లీ రూల్ నీ అతిక్రమించారు.మీ వైఖరి మారకపోతే భవిష్యత్తులో అసెంబ్లీకి కూడా రారు' అంటూ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు.

## మండలి బడ్జెట్ సమావేశాలు 6 రోజులు

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** ఈ నెల 16 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇటు శాసనసభ, అటు శాసనమండలి సభ్యులను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగించారు. అనంతరం మంగళవారం నుంచి శాసనసభ, మండలి సమావేశాలు వేరు వేరుగా కొనసాగుతున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఈ నెల 30 వరకు సమావేశాలను కొనసాగించాలని బీఏసీలో నిర్ణయించారు. అయితే ఈ నెల 30 వరకు బడ్జెట్ సమావేశాలు కొనసాగినప్పటికీ శాసనమండలి మాత్రం కేవలం 6 రోజులు మాత్రమే పనిదినాలుగా ప్రకటించింది. ఈ నెల 17, 18న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చించనున్నారు. అనంతరం ఈ నెల 19న ఉగాది పండుగ నేపథ్యంలో సెలవుదినంగా ప్రకటించారు. అనంతరం ఈ నెల 20న రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. 21న రంజాన్ పండుగ ఉండటం, 22న ఆదివారం కావడంతో రెండు రోజులు సెలవులు ఉంటాయి. అనంతరం ఈ నెల 23న బడ్జెట్‌పై చర్చించనున్నారు. 24న బడ్జెట్‌పై ప్రభుత్వం సమాధానం ఇవ్వనుంది. ఆ తరువాత 25 నుంచి 29 వరకు సభకు సెలవులను ప్రకటించారు. ఈ నెల 30న ద్రవ్యవినిమయ బిల్లును ఆమోదింప చేయడంతో బడ్జెట్ సమావేశాలను ముగించాలని బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకున్నారు.

# అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన

### గవర్నర్ ప్రసంగంపై ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ధన్యవాద తీర్మానం

### ఊహా ప్రపంచంలోకి తీసుకెళ్లింది: శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

### మండలిలో ధన్యవాదాల తీర్మానంపై మొదటిరోజు చర్చ



**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కాగా.. మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఉభయ సభల్లోనూ మొదటిరోజు చర్చ కొనసాగింది. అందులో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు శాసనమండలి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగానే గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చించనున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. తీర్మానం ప్రవేశ పెట్టాలని కోరగా టీపీసీసీ చీఫ్ ఎమ్మెల్సీ బి మహేష్ కుమార్ గౌడ్ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ప్రవేశ పెట్టారు. మరో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీర్మానాన్ని బలపరుస్తున్నట్టు తెలిపారు. దీంతో సభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను ప్రారంభించాలని మహేష్ కుమార్ గౌడ్‌ను మండలి ఛైర్మన్ సూచించారు. దీంతో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చర్చలో పాల్గొంటూ.. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైన మాట్లాడటానికి నాకు అవకాశం ఇచ్చినందుకు మీకు కృతజ్ఞతలు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర అభివృద్ధి దిశను చూపిందన్నారు. గవర్నర్ ప్రసంగం విపక్షాల వైఖరి ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ప్రజా పాలనకు అద్దం పట్టేలా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగం ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల దిశను స్పష్టంగా ఆ ప్రసంగం ప్రతిబింబించిందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీల్లో ఇప్పటికే 5 గ్యారంటీలు అమలు జరిపామని.. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, రైతుల అభివృద్ధి, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను గవర్నర్ వివరంగా చెప్పారన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గవర్నర్ ప్రస్తావించడాన్ని ప్రతిపక్ష సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రణాళికలు గవర్నర్ ప్రసంగంలో స్పష్టంగా ఉన్నాయన్నారు. రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను సోనియమ్మ ఇస్తే గత ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా చేసి మా చేతికి ఇచ్చిందన్నారు. సర్వశక్తులు కూడగట్టుకుని ఒక్కొకొ ఇటుక పేరుస్తు రైజింగ్ తెలంగాణ వైపు అడుగులు వేయిస్తున్నారని, తెలంగాణను దేశంలో నెంబర్ వన్‌గా చేయడానికి ముఖ్యమంత్రి నడుం బిగించారన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి ఆయన అడుగులు వేయిస్తున్నారు. మా పోటీ చెన్నై, బెంగళూరు, ముంబయి కాదని.. టోక్యో, సింగపూర్, న్యూయార్క్ తో అని ఆ వైపు గా పరుగులు తీయిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించి తెలంగాణ పేరును విశ్వవ్యాప్తం చేశామన్నారు. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక రంగంలోని ప్రముఖులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి పెట్టుబడులను ఆకర్షించి, ఏకంగా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి ప్రభుత్వం కొత్త చరిత్రను సృష్టించిందన్నారు. ఇటీవల బయో ఏషియా 2026 అంతర్జాయతీ సదస్సు నిర్వహించి మరో రూ. 1700 కోట్ల పెట్టుబడులను తీసుకువచ్చామన్నారు. ఫాం హౌస్ లో పట్టుబడింది మీ నాయకులు కాదా అని బిఆర్ఎస్‌ను నేతలను ప్రశ్నించారు?... డ్రగ్స్ టెస్ట్‌కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని.... కెసిఆర్ కూడా డ్రగ్స్ టెస్ట్ కి రావాలని సవాల్ విసిరారు. ప్రజా ప్రతిందులందరూ డ్రగ్స్ టెస్ట్‌కి రావాలని, చట్టం అందరికీ సమానమేనని.. ఇందులో ఎంత పెద్ద వాళ్లు ఉన్నా వదిలే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. చట్టసభలను బిఆర్ఎస్ నేతలు రాజకీయాల కోసం ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం టిఆర్ఎస్‌గా ఉద్యమించిన పార్టీ కాస్త అధికారం వచ్చాక బిఆర్ఎస్‌గా రూపాంతరం చెందిందన్నారు.తెలంగాణ అస్థిత్వాన్ని పార్టీ నుంచి తొలగించారన్నారు. 1200 మంది అమరులైతే.. వారిలో కేవలం 500 మంది కుటుంబాలకు మాత్రమే సాయం అందించారని అన్నారు. నిజాన్ని అబద్ధం చేయడానికి ప్రయత్నిస్తున్నారు తప్ప.. వాస్తవాలను ఒప్పుకోవడానికి బిఆర్ఎస్ నేతలు సిద్ధంగా లేరన్నారు.

బిఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం చేసిందని మండిపడ్డారు. మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడుతూ.. మొదటగా రాష్ట్ర ప్రభుత్వానికి, ఛైర్మన్‌కి ధన్యవాదాలు తెలిపారు. కొత్త భవనంలో శాసనమండలి సమావేశాలు నిర్వహించడానికి కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు చెప్పారు. గవర్నర్ ప్రసంగం ఊహా లోకంలోకి తీసుకెళ్లిందని విమర్శించారు. వాస్తవాలను కాదని ప్రజలను ఊహాలోకంలోకి తీసుకెళ్లేలాగా గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను ఎందుకు చట్టబద్ధత చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనలో లోపాలు జరిగాయని, వాటిని సరిచేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు భరోసాలో రూ. 23వేల కోట్ల బకాయిలను ఇవ్వాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ ఇచ్చినటువంటి హామీలను ప్రపంచంలో ఏ దేశంలో ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదన్నారు. బిజెపి పక్ష నాయకుడు ఏవిఎన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం-2020ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఎన్ఈపీ అమలుకు ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేవని దీంతో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది తగ్గుతూ వస్తోందన్నారు. సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ..రాష్ట్రంలోని రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల వరకు ఉన్న రైతు రుణాలను రుణమాఫీ చేసిందని.. కానీ రూ. 2 లక్షల కంటే ఒక్క వెయ్యి ఎక్కువ ఉన్నప్పటికీ వాటి రుణమాఫీ చేయలేదన్నారు. దీనిని పరిశీలించి వారికి రుణమాఫీ చేసేలా చూడాలన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పాలనపట్ల కొంత అసంతృప్తి ఉన్నమాట వాస్తవమని.. దానిని ప్రజా ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తోందని వెంటనే ఆర్‌టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ప్రారంభించాలన్నారు.

## ప్రతికుటుంబం ఆత్మగౌరవంతో జీవించడం ప్రభుత్వ లక్ష్యం

### గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ప్రతిపాదించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలునాయక్

### బలపరిచిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రతి కుటుంబం ఆత్మ గౌరవంతో జీవించాలనే ప్రధాన లక్ష్యంతో అభివృద్ధి సంక్షేమం పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని బాలునాయక్ నెనావత్ అన్నారు. మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం బాలు నాయక్ నేనావత్ ప్రతిపాదించగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రతిపాదనను బలపరిచారు. ప్రతిపక్ష నేత కెసిఆర్ గవర్నర్ ప్రసంగానికి కూడా రాకపోవడాన్ని ఆయన ఆక్షేపించారు. ప్రతిపక్ష నేతగా హోదా అనుభవిస్తూ ఆయన సభకు రా కుండా ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలని నల్లజెండాలతో ప్రతిపక్షం రావడం కాదు ముందు మీ నాయకుడిని వచ్చి అడమనండి ఆయన అడిగాడని సూచనలు తీసుకొనేవాళ్ళమని అన్నారు. ప్రతిపక్షనేతగా ప్రభుత్వ వసతులు పొందుతూ ఫాంహౌజ్‌కు పరిమతమైనారని దుయ్యబట్టారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్, గ్రామ పంచాయతీ, మునిసిపల్ ఎన్నికలలో మీ పార్టీ ఓటమి పాలైంది భవిష్యత్‌లో ఇక్కడ కూడా ప్రతిపక్షంగా ఉండరని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చలో ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో రైతులు వరి వేస్తే ఉరి అన్నారనీ ఆగ్రహవ్యక్తం చేశారు. సన్న బియ్యం పండించే రైతులకు రూ.500 బోనస్, యంత్ర పరికరాలు అందిస్తున్నామనీ తెలిపారు. రైతులు, ప్రజల మద్దతుతో మున్సిపల్, ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయం దక్కింది. బిఆర్ఎస్ నేతలు అబద్ధాలు ఆడి తప్పుదోవ పట్టిస్తే ప్రజలు విశ్వసించరు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు తీసుకోకపోయినా 71.86లక్షల టన్నుల ధాన్యం పండించాం. ఎల్లంపల్లి నీటితో పెద్దఎత్తున వరి పండింది. బీఆర్ఎస్ హయాంలో మోటార్లకు కూడా బిల్లులు పెండింగ్లో పెట్టారు. గత ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. ఇందిరమ్మ రాజ్యం నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ సేవలందిస్తున్నాయి అని ఆది శ్రీనివాస్ అన్నారు. గవర్నర్ ప్రసంగం ప్రభుత్వ పాలనకు అద్దంపట్టిందని అన్నారు.రాష్ట్రంలో 60లక్షల మందికి పైగా రైతులకు రైతు భరోసాను 22 తేదిన జమ చేస్తామన్నారు

## దుష్ప్రచారమే బిఆర్ఎస్ పని.. కొరవడిన ప్రతిపక్ష బాధ్యత

### పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** ప్రతిపక్ష సభ్యుడు కెటిఆర్ సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారం చివరకు చట్టసభలలో సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నార పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క శాసనసభలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తామనే సిఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన కెటిఆర్‌కు సమాధానం చెపుతూ మేం ముమ్మాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నామనీ,



మహిళా రుణాలకు సంబంధించి ఇప్పటి వరకు రూ.1,390 కోట్ల వడ్డీలను చెల్లించామీ తెలిపారు.తమ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుందని, బాధ్యత గల ప్రతిపక్షంగా దీనికి సహకరించాలని ఆమె కోరారు. ఆత్మగౌరవంతో బతికే మహిళలకు మా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందనీ చెప్పారు. గతంలో 3 వేల కోట్ల వడ్డీల భారాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం వారిపై మోపిందనీ ఆవేదన చెందారు. ఆడబిడ్డలు రూపాయి రూపాయి పోగేసి ఆదా చేసుకున్న నిధులను గత ప్రభుత్వం కాజేసిందనీ విమర్శించారు ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రూ. 57 వేల కోట్లకు పైగా రుణాలను మంజూరు చేశామని వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రతిపక్షాలు ఎగతాళి చేయడం సరికాదని హితవు పలికారు. మేము చేస్తున్న పనులను పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు చేయలేకపోయింది? అని మంత్రి సీతక్క నిలదీశారు. మొదటి నుంచి కేటీఆర్కు మహిళలంటేనే చిన్నచూపని, అందుకే ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను జీర్ణించుకోలేక నిప్పులు చెరుగుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. . ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని పదేళ్లలో చేశారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి నిర్మించలేదనీ గుర్తుచేశారు మా ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు గతంలో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేకపోయారో సమాధానం చెప్పాలని సీతక్క అన్నారు.

## ప్రకృతి వ్యవసాయంలో దేశానికే ఆదర్శంగా నిలవాలి

### ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్

### రాష్ట్రంలో 61,125 ఎకరాల్లో సాగుకు ప్రణాళిక

### 20 నుండి నర్మెట్టలో రైతు మహోత్సవం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా రైతులకు ఫార్మర్ కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఫార్మర్ కిట్‌లను పంపిణీ చేశారు. అదేవిధంగా రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో నేరుగా ముచ్చటించారు. అన్నదాతల సాగు అనుభవాలు, సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ప్రకృతి వ్యవసాయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయానికి పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని రైతులు సేంద్రీయ సాగు విధానాన్ని అవలం బించాలని సూచించారు. రూ.42 కోట్లతో ఈ పథకాన్ని అమలుచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 489 క్లస్టర్లు దాదాపు 61,125 ఎకరాలలో ఈ సంవత్సరం ప్రకృతి వ్యవసాయం సాగు విధానంలోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికా రూపొందించామన్నారు. అందుకు గాను 61,125 మంది రైతులను ఎంపిక చేసి రైతు వేదికల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఎంపిక చేసిన రైతులకు సాగులో, మార్కెటింగ్‌లో తోడ్పడే విధంగా కృషి సఖిలను క్లస్టర్‌కు ఇద్దరు చొప్పన నెలకు రూ.5000 గౌరవ వేతనంతో నియమించామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన బీజామృతం, జీవామృతం, దశపర్ణి తదితర జీవ ఉత్పాదకాలు స్వయంగా తయారు చేసుకోలేని రైతుల కోసం ప్రభుత్వం జీవ ఉత్పాదక తదితర తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రోత్సహిస్తుందని, ప్రతి బిఆర్‌సికి లక్ష రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నర్మెట్టలో రైతు మహోత్సవాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. ఈ మహోత్సవంలో వ్యవసాయ, పశుసంవర్ధక, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే దాదాపు 150 ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 22న నర్మెట్టలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా మొదటి విడుత రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 20,600 కోట్ల రైతు రుణమాఫీ ఒకే దఫాలో విడుదల చేసిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్‌లో 9 రోజుల్లో రూ. 9000కోట్లను రైతు ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు.

రైతు మహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు భారీ ఎత్తున హాజరుకావాలని పిలుపునిస్తూ, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నూనె గింజలు, పప్పు దినుసులు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు రైతులకు స్థిరమైన ఆదాయం అందించడంలో సహకరిస్తుందని, ప్రకృతి విపత్తులు, పక్షులు, జంతువుల వల్ల కలిగే నష్టాలు తక్కువగా ఉంటాయని వివరించారు.

## 19 న ఉగాది వేడుకలు

### 29 నుండి చైత్రమాస కళ్యాణ బ్రహ్మోత్సవాలు

**ఇంద్రకీలాద్రి, మార్చి 17, ప్రభాతవార్త:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానములో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు 19వ తేదీ వైభవంగా నిర్వహిస్తామన్నారు. పర్వదినమును పురస్కరించుకొని శ్రీరామనవమి వరకు వసంత నవరాత్రోత్స వములు" సందర్భముగా "ప్రత్యేక పుష్పార్చనలు" మరియు ఇతర వైదిక కార్యక్రమములు ఈ దిగువ తెల్పిన విధముగా నిర్వహించుటకు వైదిక కమిటీ వారి సూచనల మేరకు నిర్వహిస్తామని ఇఒ వికె శీనానాయక్ తెలిపారు. నిర్ణయించడమైనది. 19 ఉ. 08.00 గంటలకు శ్రీ అమ్మవారి దర్శనం ప్రారంభము. ఉ. గం. 0915 "కలశ స్థాపన", ప్రత్యేక పుష్పార్చనలు, మ. 3 గంటలకు "పంచాంగ శ్రవణం" కళావేదిక నందు. సా. 4 గంటలకు మండప పూజ, అగ్ని ప్రతిష్టాపన, రుద్రహోమం (యాగశాల నందు), సా. 6 గంటలకు వెండి రథోత్సవం' శ్రీ మల్లికార్జున మహామండపం నుండి ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 26న గురువారము ఉ. 6గంటలకు చైత్ర శుద్ధ అష్టమిన క్షేత్రపాలక శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ అభయ ఆంజనేయ స్వామి మరియు మెట్ల వద్ద గల ఆంజనేయ స్వామి వార్లకు "అభిషేకం" మరియు "నాగవల్లీ దళార్చన" (తమలపాకులతో పూజ). 27న ఉ.10 గంటలకు శ్రీ సీతారాముల కళ్యాణం కళావేదికపై జరుపుతామన్నారు. 28వ తేదీన ఉ. 09.00 గంటలకు వసంత నవరాత్రుల పూర్ణాహుతి, ఉ. గం. 10 గంటలకు శ్రీ రాముల వారి పట్టాభిషేకము" జరుగుతాయన్నారు. ప్రత్యేక పుష్పార్చనలు పాల్గొనదలచిన ఉభయ దాతలు రుసుము రూ. 2,500/ (దంపతులకు) చెల్లించి దేవస్థాన వెబ్‌సైట్ ద్వారా లేదా ఆర్జిత సేవా కౌంటర్లలో తీసుకోవాలన్నారు.

**29నుండి చైత్రమాస కళ్యాణ బ్రహ్మోత్సవాలు:**

ఈనెల 29 నుండి ఏప్రిల్ 5 వరకు దుర్గమ్మవారి ఆలయంలో చైత్రమాస కళ్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈనెల 29న ఉదయం శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లకు మంగళస్నానములు, నూతన వధూవరులుగా అలంకరణ, విఘ్నేశ్వర పూజ, 30వ తేదీ నుండి ఏప్రిల్ 2 వరకు మూలమంత్ర హవనములు, ఔపోసన, బలిహరణ, మంత్రపుష్పం, ప్రసాద వితరణ, ఈనెల 31న సాయంత్రం 7 గంటలకు శ్రీ మల్లేశ్వర స్వామివార్ల ఆలయం వద్ద రాయభారము, రాత్రి 10.30 గంటలకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దివ్య లీలా కళ్యాణమహోత్సవం, ఏప్రిల్ 1న వేదస్వస్తి, వేదాశీస్సులు, ఏప్రిల్ 2న పూర్ణాహుతి, ధాన్యకోటోత్సవం, వసంతోత్సవం, అవభృథస్నానోత్సవం, మూలకబలి, ధ్వజావరోహణ, ఏప్రిల్ 3న శ్రీగంగా పార్వతి సమేత శ్రీ మల్లేశ్వర స్వామివార్ల నదీవిహారం, 4వ తేదీ, 5వ తేదీల్లో పవళింపు సేవ నిర్వహిస్తామన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మార్చి 17, ప్రభాతవార్త:** పంచాయితీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పైళ్ల గణపతిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్, చాగంటి వెంకటయ్య, పొట్టా యాదమ్మ, వంగూరు రాములు, ఎస్వీ రమ, కూరపాటి రమేష్, పుప్పాల శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు.

మంగళవారం తెలంగాణ పంచాయితీ కార్మికులు వారి వేతనాలు, ఉద్యోగ భద్రత మరియు పని విధానాలపై అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు.

ఇందిరాపార్కు వద్ద వారిని అడ్డుకున్న పోలీసులు అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్క రించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మార్చి 18, 19 తేదీలలో అన్ని మండల, జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని ప్రకటించారు.



అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నిస్తున్న పంచాయతీ కార్మికులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

# ఇది బామ్మల బడి !



**చదువుకోవడానికి స్కూలుకెళ్లే పిల్లల్ని చాలామందినే చూస్తుంటాం. కానీ, పుస్తకాల బ్యాగులు తగిలించుకుని గులాబీ రంగు చీరలు కట్టుకుని మరీ బడికెళ్లే ఈ బామ్మల గురించి తెలుసా?** లేదంటే ఇది చదివేయండి.

ఆజీబాయీచీశాల... మహారాష్ట్రలోని థానే జిల్లా ఓ మారుమూల పల్లెటూరులో ఉన్న బామ్మల బడి ఇది. 2016లో మహిళా దినోత్సవం రోజున నిరక్షరాస్యులైన వృద్ధ మహిళలకోసం దీన్ని ఏర్పాటు చేశారు. కరవు, వ్యవసాయ సంక్షోభం... వంటి సమస్యలతో సతమతమవుతున్న చోట మహిళలకు అక్షరాస్యత అవసరమని భావించారు స్థానిక టీచర్ యోగేంద్ర బంగర్. ఈయన ఆలోచనకు మోతీరామ్ దలాల్ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారం అందించడంతో ఈ బడి ఏర్పాటైంది. రోజూ మధ్యాహ్నం 2-4 గంటల వరకు ఇక్కడ తరగతులు నిర్వహించారు.



దీంతో ఒత్తిడి లేకుండా ఇంట్లో పనులన్నీ చక్కబెట్టుకుని ఎంచక్కా బడికి వచ్చేస్తారీ విద్యార్థులు. సమానత్వ భావన, శక్తికి సూచనగా రూపొందించిన గులాబీ రంగు చీరల్ని యూనిఫాం ధరించి మరీ హాజరవుతారు.

నడవలేని నానమ్మ, చూపు తగ్గిన అమ్మమ్మ... ఇలా 60-94 ఏళ్ల మధ్య వయసులే వీరంతా.

అక్షరాలు, పదాలు, పద్యాలు, అంకెలు, ఆట పాటలు నేర్చుకుంటున్నారు. అందరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నాయట. అంతేనా, బస్సుల మీద పేర్లు చదువుతున్నారు. తమ బ్యాంకు లావాదేవీలు తామే నిర్వహించు కుంటున్నారు. ఇది చాలదూ! నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదని చెప్పడానికి స్త్రీ సాధికారతకు చక్కని ఉదాహరణగా వివరించ డానికీనూ!

# 26 నిమిషాల కునుకు !

రాత్రి నిద్ర సరిపోలేదు, చిన్న కునుకేస్తే తలభారం తగ్గుతుంది అని అప్పుడప్పుడూ అనుకుంటాం. ఈ ఆలోచన మంచిదే. అయితే ఆ లోటును పూడ్చడానికి గంటలతరబడి నిద్రపోనక్కర్లేదు, 26 నిమిషాలకు కునుకు సరిపోతుందంటోంది నాసా అమెస్ రిసెర్చ్ సెంటర్. ఈ నిద్ర రోజువారీ ఉత్పాదకతలో మెరుగైన మార్పును తీసుకురాగలదట. నిద్ర సరిపోనప్పుడు పగటివేళ కాసేపు నడుము వాల్చాలనుకుంటాం. దీనివల్ల ఉత్సాహం పెరగడం కాదు, ఉన్న శక్తి కూడా తగ్గినట్లు అనిపిస్తుంది. బద్ధకమూ తీరదు. బదులుగా 20-30. నిమిషాల పవర్ న్యాప్ చాలంటున్నారు పరిశోధకులు. ఇది మన మెదడు చురుకుదనాన్ని పెంచుతుందని చెబుతున్నారు. నిద్రలేమి వల్ల కలిగే అలసట దూరమవుతుందట. మనం నిద్రపోయేట ప్పుడు స్లీప్ సైకిల్స్ దశల వారీగా సాగు తాయి. ఒక్కొక్క సైకిల్ 90 నుంచి 120 నిమిషాల వరకూ కొనసాగుతుంది. సాధారణంగా నిద్రలోకి జారిన తర్వాత, క్రమేణా గాఢనిద్ర దశలోకి ప్రవేశి స్తాం. అయితే రెప్పలు మూతబడుతోన్న వెంటనే 20-30 నిమిషాలు



కునుకు తీస్తే సరిపో తుంది. అలా నిద్రలోకి వెళ్లేముందే మనం 15, 20, 26... ఇలా ఇంత టైం అని అనుకుంటే అదే సమయానికి మెల కువ వచ్చేస్తుంది. ఈ నిద్ర రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండేలా చేస్తుందని అధ్యయనం చెబుతోంది. కునుకు తీస్తేనే మెదడు రిఫ్రెష్ అవు తుందనిపిస్తే మన శరీరం విశ్రాంతినిస్తుందని తెలుసు కోవాలి. నిద్రలేమి సమస్యను గుర్తించాలి. పరిష్కారంగా 26 నిమిషాల కునుకు మంత్రం పఠించడానికి ప్రయత్నిం చాలి. అయితే ఈ న్యాప్ సమయం మధ్యాహ్నం 13 గంటల మధ్య మాత్రమే మంచిదంటున్నారు నిపుణులు.

# టైమ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి..



మనం స్నేహితులను కలవడానికి వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ జామ్ అయిదనుకోండి. అప్పుడు మీకు ఏమనిపి స్తుంది? అబ్బా ఈ ట్రాఫిక్‌లో ఎంతసేపూ సమయం గడవదే అనే కదా! అదే మరి స్నేహితులతో సరదాగా ముచ్చట్లాడు తుంటే ఏమనివి స్తుంది. అప్పుడు

**టైమ్ అయిపోయిందా! అని కదా. సమయం ఎప్పుడూ ఒకలానే ఉంటుంది. మరిమనికి ఎందుకు అలా అనిపిస్తుందో తెలుసా!**

'సమయమే డబ్బు', 'సమయాన్ని ఆదా చేయడం, ఖర్చుచేయడం' లాంటి మాటలు ప్రస్తుత జీవనశైలిలో మనం సమయానికి ఇచ్చే ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా ఇవి పట్టణ వాతావరణంలో నివసించే వారికి బాగాసరిపోతాయి. ఎందుకంటే వీళ్ల ప్రకృతి సూచనల కంటే ఇంట్లో గడియారాన్ని అనుసరించే రోజువారీ పనులు చేసుకుంటారు కాబట్టి. నిజానికి సమయంపై ఇంతలాధారపడడం, మన ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపిస్తుందని టుర్కూ యూనివర్సిటీ చేసిన పరిశోధనల్లో వెల్లడైంది. సమయం సరిపోవట్లేదు అనే భావనా ఇందులో నుంచి వచ్చిందేనట. అందుకే నగారల్లో ఉండేవారు ఎక్కువగా ప్రకృతిలో ఎక్కువ సమయం గడిపేలా చూసుకోవాలి. అప్పుడే మనకు 'బ్యాలెన్స్‌డ్ సెన్స్ ఆఫ్ టైమ్ వస్తుంది. సహజసిద్ధ వాతావరణంలో ఉండేవారికీ, పట్టణ వాతావరణంలో ఉండేవారికీ సమయాన్ని గడపడంలో తేడా ఉంటుందట. అంతేకాదు కొంతమందిని గతంలో జరిగిన చేదు విషయాలూ, చెడు సంఘటనలూ వర్తమానంలో పదేపదే గుర్తుకు వస్తూ వేధిస్తుంటాయి. అటువంటి వారూ ప్రకృతిలో గడపడం వల్ల వాటినుంచి బయటపడ గలుగుతారట. అందుకే మన నగరాలు పట్టణాలను పార్కులూ, పచ్చదనం ఉండేలా నిర్మించుకోవాలని పరిశోధనలు సూచిస్తున్నాయి.

# దయాస్వరూపిణి

**కోల్‌కత్తా సమీపంలోని ఆ ఊరు కరవుకాటకాలతో** విలవిల్లాడు తోంది. గ్రామస్థుల ఆకలి బాధలు చూసి పల్లెలోని రామచంద్రముఖర్జీ, శ్యామసుందరీదేవి దంపతులు చలించి పోయారు. రామభక్తులైన వాళ్లిద్దరూ తమకు పండిన ధాన్యంతో అన్నార్తులకు భోజన ఏర్పాట్లు చేశారు. వేడివేడిగా పులగం వండి కుటుంబసభ్యులతో కలిసి వడ్డించసాగారు. గ్రామస్థులు ఆవురావురుమంటూ విస్తళ్ల వద్దకు వచ్చారు. ఆకలితో నకనకలాడుతూ ఉండటంతో పులగం వడ్డించిన వెంటనే గబగబా తిన బోయారు. కానీ అది చాలా వేడిగా ఉండటంతో తినటం ఇబ్బందిగా ఉంది. వాళ్ల పరిస్థితిని రామచంద్ర పదేళ్ల కూతురు దూరం నుంచి గమనించింది. పరుగున లోనికెళ్లి విసనకర్ర తెచ్చి, పదార్థాలు చల్లబడేందుకు విసరసాగింది. అది చూసి అంతా ఉద్విగ్రతకు లోనయ్యారు. చిన్ననాటి నుంచే ఇలా తన మాతృ హృదయాన్ని, కరుణాంత రంగాన్ని ఆవిష్కరించిన ఆ దయామయి మరెవరో కాదు. రామకృష్ణపరమహంస ధర్మపత్ని, రామకృష్ణ సంఘజనని అయిన శారదాదేవి. పరుల కష్టాన్ని తన కష్టంగా భావించి పరితపించే సానుభూతి ఆధ్యాత్మిక జీవనానికి ప్రథమ అర్హత అని పసివయసులోనే నిరూపించారామె. తదనంతర కాలంలో ఆమె అన్నపూర్ణాదేవి అయ్యారు. పరమహంస శిష్యుల క్షుద్బాధనే కాదు. ఆధ్యాత్మిక పిపాసను కూడా తీర్చారు. స్థాయీ భేదం లేకుండా అందరూ శారదాదేవి మాతృప్రేమను ఆస్వాదించినవారే! ఎందరో విదేశీయులు కూడా ఆ ప్రేమమూర్తికి ప్రియశిష్యులయ్యారు. ఎవరు తనను ఆశ్రయించినా నీకొక అమ్మ ఉందని గుర్తుంచుకో! అమ్మను నేనుండగా.. ఇక భయమెందుకు? మంచివాళ్లే కాదు, తెలిసీ తెలియక చెడు నడత నడిచినవాళ్లు కూడా నా బిడ్డలే. పిల్లవాడు బట్టల్ని మురికి చేసుకుంటే. తల్లి దూరం పెడుతుందా? అంటూ అమిత ఆదరణతో అందరికీ సాంత్వననిచ్చేవారు. అందుకే రామకృష్ణ పరమహంస ప్రత్యక్ష శిష్యుడు స్వామి అభేదానంద శారదాదేవిని. శరణన్న ఆర్తుల దుఃఖాలను ఉపశమింపజేసే తల్లి, యోగీంద్రుడైన రామకృష్ణులతో పూజలందుకున్న జగజ్జనని, యుగధర్మాన్ని ఆవిష్కరించిన తల్లి, భక్తి విజ్ఞానాలను ప్రసాదించే దయాస్వరూపిణి అయిన శారదాదేవికి నిత్యం నమస్కరిస్తున్నాను అంటూ కీర్తించారు.



# అవిసెగింజల పొడి



**కావాల్సినవి:** అవిసె గింజలు అరకప్పు, సెనగపప్పు పావుకప్పు, మినపప్పు పావుకప్పు, ఎండుమిర్చి పది, చింతపండు నిమ్మకాయంత, కరివేపాకు రెబ్బ, నూనె చెంచా, ఉప్పు కావాలి.

**తయారీ:** అడుగు మందంగా ఉంటే ఒక కడాయి తీసుకుని దానిలో ముందుగా సెనగపప్పుని ఎర్రగా అయ్యేంతవరకూ సన్నమంట మీద వేయించి పక్కనపెట్టుకోవాలి. తర్వాత మినపప్పు, అవిసె గింజలని విడివిడిగా వేయించు కోవాలి. చివరిగా కడాయిలో కాస్త నూనె వేసుకుని అందులో ఎండుమిర్చి, చింతపండు, కరివేపాకు వేసి వేయించు కోవాలి. అన్ని చల్లారాక మిక్సీలో సెనగపప్పు. మినపప్పులని కలిపి మిక్సీ పట్టుకోవాలి. అవిసెగింజలని విడిగా.. మరీ మెత్తగా కాకుండా మిక్సీపట్టాలి. లేదంటే అవి వేడికి గడ్డ కట్టేస్తాయి. చివరిగా ఎండుమిర్చి కూడా ఆడించుకుని ఉప్పువేసి దానికి కలుపుకొంటే అవిసెగింజల పొడి సిద్ధం. ఈ పొడి అన్నంలోకి లేదా కూరల్లో వేసుకున్నా బాగుంటుంది. చెమ్మ లేకుండా డబ్బాలో దాచిపెడితే రెండు నెలల వరకూ నిల్వ ఉంటుంది... అవిసె గింజలు బరువు తగ్గుతాయి. జుట్టు, చర్మానికి మేలు చేస్తుంది.

# పిల్లలతో సరదాగా కబుర్లు



చెబుతున్నప్పుడో, చిన్ననాటి స్నేహితులు బొమ్మలతో ఆడదాం ! కలిసినప్పుడో... ఒకప్పుడు అది నా ఫేవరెట్ బొమ్మ, ఆ కార్టుని వదలకుండా చూసేవాళ్లం అని గుర్తు తెచ్చుకుంటూ ఉంటాం కదా! తలచుకున్నప్పుడు తెలియకుండానే ఆనందం. ఆరోజులు తిరిగొస్తే బాగుంటుందన్న చిన్న ఆశ. అంతలోనే అది అసాధ్యమని తేలగానే నిరాశతోకూడిన చిన్న నిట్టూర్పు. అలాకాకుండా ఆ బాల్యం కొనసాగిద్దామా? దాన్నే కిడల్టింగ్ అంటున్నారు. ఇప్పుడది ఓ ట్రెండ్ కిడ్, అడల్ట్ కలిపి కిడల్టింగ్ పిలుస్తున్నాం. అంటే ఏమీలేదు... చిన్నతనాన్ని గుర్తుచేస్తూ మనలో ఆనందాన్ని నింపే పనులు చేయడమంటే, మెత్తగా, చూడగానే హత్తుకోవాలనిపించే టెడ్డీలంటే ఇష్టమా? ఇంకేం అవకాశమున్నప్పు డల్లా కొనుక్కోండి. కార్టూన్లంటే ప్రాణమా... హాయిగా చూసేయండి. వీడియోగేమ్‌లు, డ్రాయింగ్, కలర్ నింపడం, ఇసుకలో ఆడటం... మరీ ఈ వయసులో ఏం చేసిన మీమాంసలు పోక చక్కగా చేసుకుంటూ పోండి, ఊహే ఎంత బాగుందో కదా! ఇది చేసే మేలూ ఎక్కువే ఎంతైనా నచ్చిన పనులు కదా... ఉంటే తెలియకుండానే ఒత్తిడి పరారైపోతుంది. అంతేనా... వీడియోగేమ్‌లు, లెగోస్, బొమ్మలు గీయడం వంటివాటికి బుర్రకి పనిచెప్పాలి. దీనితో సృజనాత్మకత పెరుగుతుంది. యాంత్రిక జీవితంలో పడి ఎన్నింటిని మిస్ అవుతున్నామో కదా! ఇవి చిన్నతనాన్ని గుర్తు చేయడమే కాదు... చిన్న చిన్న వాటిల్లో ఆనందాన్ని వెతుక్కోవడమూ నేర్పుతాయి. కొన్నిసార్లు ఒక్కరమే ఆడాలనిపించదు. దీంతో మన పెద్దవాళ్లనో, స్నేహితులనో, పిల్లలతో ఆటలోకి లాగేస్తాం. ఇది తెలియకుండానే బంధాలను దగ్గర చేస్తుంది. మొత్తంగా తిరిగి చిన్నపిల్లలుగా ప్రవర్తిస్తూ జీవితంలో ఆనం దాన్ని వెతుక్కుంటామన్న మాట, ఇంటి బాధ్యతలు, ఆఫీసు ఒత్తిళ్లు అన్నీ పక్కనపెట్టి అయిపోదామా ఓసారి చిన్నపిల్లలం?

# తెర



ప్రముఖ దర్శకుడు మహేష్ చంద్ర దర్శకత్వంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, పథ్వీరాజ్, కేదార్ శంకర్, మణి చందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'పిఠాపురంల్లో'. దీనికి ఉప శీర్షిక 'అలా మొదలైంద్థి'. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్‌పై దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. జి.సి. క్రిష్ సంగీత దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలోని 'మక్కుళు మక్కుళు కాలేజూ యవ్వన మర్కట గ్యారేజ్జూ పాటను ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఆవిష్కరించారు. ఈ పాటను శ్రీరామ్ తపస్వి రాశారు. ఈ సందర్భంగా వినాయక్ మాట్లాడుతూ 'నేను కో డైరెక్టర్‌గా చంద్ర మహేష్ గారి దగ్గర 'చెప్పాలని ఉంది' చిత్రానికి పనిచేశాను. దర్శకుడు చంద్ర మహేష్ మాట్లాడుతూ 'ఈ వారంలో ఈ సినిమా ట్రయిలర్ విడుదల చేస్తున్నాం. ఏప్రిల్‌లో చిత్రాన్ని విడుదల చేస్తాం. నా కెరీర్‌లోనే ఇదొక మంచి సినిమాగా నిలిచిపోతుంద్థి అని తెలిపారు.

# ఘనంగా 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీ రిలీజ్



'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా 'గబ్బర్ సింగ్' స్థాయి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను: పవర్ స్టార్ పవన్ కళ్యాణ్

'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలు. దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్తగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి ఎస్. తమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. అంచనాలు ఆకాశాన్ని తాకు తున్న వేళ, మాస్ సినిమాకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి ఉగాది కానుగా మార్చి 19వ తేదీన 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ సందర్భంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. "ఉస్తాద్ భగత్ సింగ్ ప్రీ వేడుకకు హాజరైన అభిమానులకు, లైవ్ లో వేడుకను వీక్షిస్తున్న ప్రజలకు నమస్కారాలు. సినిమా నాకు చాలా ఇష్టమైనవి. నాకు అన్నం పెట్టింది సినిమా. ఈరోజు ప్రజలకు సేవ చేసే గుర్తింపు ఇచ్చింది సినిమా. అందుకే నా నిర్మాతలు బాగుండాలని కోరుకుంటాను. సినిమా కోసం ఉత్సాహంగా వచ్చే నా అభిమానులకు ఆనందం కలగాలని కోరుకుంటాను. అన్నారు.

# 'పోలీస్ కంప్లైంట్' టీజర్ విడుదల



సౌతిండియా ప్రేక్షకుల ముందుకు యాక్షన్, కామెడీ, హారర్ థ్రిల్లర్ కలగలిపిన సినిమాను తీసుకురాబోతున్నారు దర్శకుడు సంజీవ్ మేగోటి. వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, రాగిణి ద్వివేది, కృష్ణ సాయి ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం పోలీస్ కంప్లైంట్థ్ కన్నడ వెర్షన్ టీజర్‌ను బెంగళూరులో సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమం చిత్రబృందం, అతిథుల సందడితో హర్షాతిరేకంగా జరిగింది. ఈ వేడుకకు 'దేవ్థి చిత్రం ద్వారా గుర్తింపు పొందిన నటి ప్రేమ, 'దండుపాళ్యం్థ ఫేమ్ పూజా గాంధీ, కన్నడ ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ఆర్.కె. విశ్వనాధ్ ముఖ్య అతిథులుగా హాజరై టీజర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాట్లాడిన ఎన్.ఆర్.కె. విశ్వనాథ్, దర్శకుడు సంజీవ్ మేగోటి పదేళ్ల తర్వాత మళ్లీ ఒక మంచి కథతో కన్నడ ఇండస్ట్రీలోకి రావడం ఆనందంగా ఉందని అభినందించారు. ఈ సినిమా ఘన విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. నటి ప్రేమ చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలుపుతూ, సినిమా బ్లాక్ బస్టర్ సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నటి రాగిణి ద్వివేది మాట్లాడుతూ, పోలీస్ కంప్లైంట్ కథ ఎంతో ఆసక్తికరంగా ఉందని, ఇది ప్రేక్షకులను ఆకట్టుకునే సస్పెన్స్ థ్రిల్లర్ అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తక్కువ సమయంలోనే ఇంత క్వాలిటీతో సినిమాను నిర్మించిన దర్శక నిర్మాతలను అభినందించారు. అలాగే వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్‌చంద్ర వంటిప్రతిభావంతులైన నటులతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు.

# 'రాకాస' ఏప్రిల్ 3న రిలీజ్



'రాకాస' తెలుగు రాష్ట్రాల హక్కులను సొంతం చేసుకున్న శ్రీ లక్ష్మీ నరసింహా మూవీ మేకర్స్ ఏప్రిల్ 3న రిలీజ్ కానున్న ఫ్యాన్సీ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాకాస్థపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రారంభం నుంచి వైవిధ్యమైన కంటెంట్, ప్రమోషనల్ ప్లానింగ్‌తో ఈ సినిమా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా ఈ సినిమా రిలీజ్‌కు ముందే జరిగిన థియేట్రికల్ బిజినెస్ డీల్ ఇందుకు ఉదాహరణ. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఈ సినిమా థియేట్రిల్ రైట్స్‌ను శ్రీ లక్ష్మి నరసింహా మూవీ మేకర్స్ భారీ మొత్తానికి సొంతం చేసుకున్నారు. రాకాస సినిమా విడుదలకు సిద్ధమవుతోన్న సమయంలో ఈ లేటెస్ట్ డీల్‌తో 'రాకాస్థా చిత్రానికి డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ మరింత బలపడింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను శ్రీ లక్ష్మీ నరసింహా మూవీ మేకర్స్ విడుదల చేస్తుండగా.. ఓవర్‌సీస్‌లో మేకర్స్ భారీ స్థాయిలో రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ విషయాలతోనే కాకుండా ఈ సినిమాకు నాన్ థియేట్రికల్ రంగంలో కూడా మంచి డీలింగ్స్ కుదిరాయి. మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా..ఆడియో హక్కులను సారెగమ దక్కించుకుంది. రాకాస్థ సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలకు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో రెస్పాన్స్ సూపర్బ్‌గా ఉంది. ఇటీవలే విడుదలైన మూవీ టైటిల్ గ్లింప్స్ ఇప్పటికే 1.9 మిలియన్ వ్యూస్‌ను రాబట్టుకోగా, టీజర్ 2.8 మిలియన్ వ్యూస్ దాటి ఆన్‌లైన్‌లో ఆడియెన్స్‌ను నుంచి మంచి స్పందనను రాబట్టుకుంటోంది.

# సందడిగా 'యూత్' మూవీ ఫ్రెషర్స్ మీట్



కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముదు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ "యూత్". ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 26న "యూత్" మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. కమ్ విత్ యువర్ గ్యాంగ్, నోట్ నో ఏజ్ లిమిట్ అనే స్లోగన్‌తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా ఫ్రెషర్స్ మీట్ కార్యక్రమం పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్ లో సందడిగా నిర్వహించారు. మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి మాట్లాడుతూ ఈ2సీ అంటే మేము రెగ్యులర్ గా చిల్ అయ్యే ప్లేస్, మా గూగుల్ మ్యాప్ లో లొకేషన్ అది. ఈ రోజు ఆ పేరు పోస్టర్ మీద ఉండటం చూస్తుంటే హ్యాపీగా ఉంది. డైరెక్టర్ సాయి మార్తండ్ మాట్లాడుతూ "యూత్" సినిమాను మేమే తీసుకోవాలని అనుకున్నాం. కానీ ఇంతలో వినీత్, సందీప్ తీసుకున్నారు. కెన్ వర్సటైల్ పర్సన్. యాక్టింగ్, రైటింగ్, లిరిక్స్, సింగింగ్..ఇలా అన్నీ తానే టాప్ క్లాస్ లో చేస్తుంటాడు. నాకు మన మోళిలా అనిపిం చాడు. హీరో మోళి తనూజ్ మాట్లాడుతూ "యూత్" మూవీ టీజర్ చాలా బాగుంది. నేను సినిమా మొత్తం చూశాను. కంప్లీట్ ఎంటర్ టైనింగ్ మూవీ ఇది. మన తెలుగు ఆడియెన్స్ కు బాగా నచ్చుతుంది. హీరోయిన్ ప్రియాన్షి యాదవ్ మాట్లాడుతూ "యూత్" మూవీతో తమిళంతో పాటు తెలుగు ఆడియెన్స్ కు పరిచయం కావడం సంతోషంగా ఉంది. హీరోయిన్ మీనాక్షి మాట్లాడుతూ తెలుగు

# కాలం మారింది చిత్ర నిర్మాతకు మందకృష్ణమాదిగ అభినందనలు



మానవులందరూ ఒకటే కులం, ఒకటే మతం అనే నినాదంలో సీనియర్ జర్నలిస్టు, రాష్ట్రపతి అవార్డుల గ్రహీత వాశిరాజు ప్రకాశం నిర్మించిన 'కాలం మారింది' చిత్రం 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ఆబాల గోపాలం అభినందనలు అందుకున్నారు. ప్రముఖ నాయకులు మందకృష్ణమాదిగ నిర్మాత ప్రకాశంను అభినందిచారు. అయితే ఇలాంటి ఉత్తమ చిత్రాలు తెలుగులో రాయాలని ఆయనను కోరారు. కళాతపస్వీ కె.విశ్వనాథ్ దర్శకత్వంలో తయారయిన 'కాలంమారింది' చిత్రం 55 సంవత్సరాల నక్రితమే ఉభయ తెలుగు రాష్ట్రాలలో శతదినోత్సనాలు, సంబరాలు జరుపుకున్నది. తన పట్ల చూపిన ఆత్మయతకు మందకృష్ణ మాదిగకు వాశిరాజు ప్రకాశం అభినందానాలు తెలుపుతూ, త్వరలో మరో 'కాలం మారింది చిత్రం నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు ఆనందంగా తెలిపారు.

# సీఎస్‌కే డేంజరస్ కాంబినేషన్




కాసుల క్రికెట్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ మరో పది రోజుల్లో తెరలేవనుంది. ఏ జట్టు కాజట్టు భారీ అంచనాలతో బరిలోకి దిగుతున్నాయి. కానీ అందరి చూపు మాత్రం చెన్నై సూపర్ కింగ్స్‌పైనే. ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో సీఎస్‌కే ఒకటి. పదిసార్లు ఫైనల్ చేరిన ఏకైక జట్టు. ఏకంగా అయిదుసార్లు విజేతగా నిలిచింది. అలాగే 12 సార్లు ప్లే ఆఫ్‌కు వచ్చింది. మోస్ట్ సక్సెస్‌ఫుల్ కెప్టెన్ ధోనీ ఈసారి కూడా ప్లేయర్‌గానే దిగబోతున్నాడు. ఇదే అతనికి చివరి ఐపీఎల్‌గా పరిగణిస్తుండడంతో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై భారీగా అంచనాలు పెరిగాయి.

### సంజూ సాంసన్

టీ20 ప్రపంచకప్ హీరో. టాప్ ఫామ్‌లో ఉన్నాడు. పవర్ ప్లేలోనే మ్యాచ్ స్వరూపాన్ని మార్చగలడు. అగ్రెసివ్ బ్యాట్స్‌మన్

### ఆయుష్ మాత్రే

అండర్19 ప్రపంచకప్ నెగ్గిన భారత జట్టు కెప్టెన్. అదే జోరును ఐపీఎల్2026లో కొనసాగిస్తాడని సీఎస్‌కే ఆశలు పెట్టుకుంది.

### రుతురాజ్ గైక్వాడ్(కెప్టెన్)

మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే గైక్వాడ్ ఈ సీజన్‌కు కూడా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. టాప్ ఆర్డర్ బ్యాట్‌మన్, స్కోరుకు బేస్ ఇస్తాడు.

### డీవాల్డ్ బ్రేవిస్

ఈ సౌతాఫ్రికా స్టార్ ఆటగాడు గొప్ప ఫామ్‌లో ఉన్నాడు. కొద్ది రోజుల తర్వాత సీఎస్‌కేకు అందుబాటులోకి వస్తాడు. మంచి ఫినిషర్.

### కార్తిక్ శర్మ

19 ఏళ్ల యువ వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్. ఇన్నింగ్స్‌ను ఓపెన్ చేస్తాడు. ఐపీఎల్ వేలంలో ఏకంగా 14.20 కోట్ల ధర పలికాడు.

### నాథన్ ఇల్లీస్

ఈ ఆస్ట్రేలియన్ ప్లేయర్ చక్కని ఫామ్‌లో ఉన్నాడు. సీఎస్‌కే పేస్ అటాక్ ప్రధాన అస్త్రం.

(వార్త క్రీడా విభాగం)

చెన్నై సూపర్ కింగ్స్ గత రెండు సీజన్లలో పేవల ఫామ్ చాటింది. లీగ్ స్టేజ్‌లోనే నిష్క్రమించింది. 2025 సీజన్‌లో అయితే మరీ ఘోరం. ఆడిన 14 మ్యాచ్‌ల్లో పది మ్యాచ్‌ల్లో ఓడింది. పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. సీఎస్‌కే ఐపీఎల్ చరిత్రలో ఇదే పూర్ షో. 2026 ఐపీఎల్ కొత్త సీజన్‌కు యువత, అనుభవం కలగలిసిన జట్టులో సీఎస్‌కే వస్తోంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ నేతృత్వంలోని సీఎస్‌కేకు పటిష్ట బ్యాటింగ్ లైనప్ ఉంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ జట్టు బ్యాటింగ్‌కు ప్రధాన ఆధారం. టీ20 ప్రపంచకప్ హీరో సంజూ సాంసన్ చేరడంతో టాప్ ఆర్డర్ మరింత బలపడింది. ఎంఎస్ ధోనీ, శివమ్ దూబే, దేవాల్డ్ బ్రేవిస్ లాంటి ఫినిషర్లు జట్టులో ఉన్నారు. పెద్ద స్కోర్లు చేయగల సామర్థ్యం ఉంది. ఆయుష్ మాత్రే, ఉర్విల్ పటేల్, కార్తిక్ శర్మ వంటి కొత్త టాలెంట్ సీఎస్‌కేకు ఉంది. జట్టులో పలువురు ఆల్‌రౌండర్లు ఉండడం పెద్ద ప్లస్. స్పిన్ విభాగంలో నూర్ అహ్మద్, రాహుల్ చాహల్ వంటి మంచి ఆప్షన్స్ ఉన్నాయి. యంగ్ గన్స్, అనుభవం, లెజెండ్ ధోనీ కాంబినేషన్‌తో ఉంది.

### నూర్ అహ్మద్

ఈ యువ స్పిన్నర్ నూర్ అహ్మద్ గత ఐపీఎల్‌లో చక్కగా రాణించాడు. ఏకంగా 24 వికెట్లు సాధించాడు. సీఎస్‌కే అమ్ములపొదిలోని స్పిన్ అస్త్రం. స్పిన్ బౌలింగ్‌లో కీలక పాత్ర.

### మహేంద్ర సింగ్ ధోనీ

44 ఏళ్ల వయస్సులోనూ అతని లీడర్‌షిప్, ఫినిషింగ్, వికెట్ కీపింగ్ నైపుణ్యాలు సీఎస్‌కేకు పెద్ద ఆస్తి. ఐపీఎల్‌లో ఆడతాడని సీఎస్‌కే ఇప్పటికే స్పష్టం చేసింది. అయితే అతని పాత్ర కీపర్‌గా, బ్యాట్స్‌మెన్‌గానా లేదా ఇంఫాక్ట్ ప్లేయర్‌గానా అన్నది తేలాల్సి ఉంది.

### శివమ్ దూబే

శివమ్ దూబే-టీ20 ప్రపంచకప్‌లో సిక్సర్ల మోత మోగించాడు. బ్యాటింగ్, బౌలింగ్‌లో కీలక పాత్ర పోషించగల ఆటగాడు. స్లాగ్ ఓవర్ల లో హార్డ్ హిట్టింగ్‌కు పెట్టింది పేరు. పవర్ హిట్టర్, మిడిల్ ఓవర్లలో గేమ్ మార్చగలడు.

### ప్రశాంత్ వీర్

ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్‌కు కూడా ఐపీఎల్ వేలంలో 14.20 కోట్ల ధర సీఎస్‌కే వెచ్చించింది. రవీంద్ర జడేజా స్థానాన్ని భర్తీ చేయగల సూపర్ ఆల్‌రౌండర్.

### అన్షులల్ కంబోజ్

యువ సంచలనం అన్షుల్ కంబోజ్‌పై కూడా సీఎస్‌కే భారీ అంచనాలు ఉన్నాయి. 2025 సీజన్‌లో స్థిరంగా రాణించాడు.

### ఖలీల్ అహ్మద్

సీఎస్‌కే ఓపెనింగ్ బౌలర్. పవర్ ప్లేలో వికెట్లు తీసి శుభారంభం ఇవ్వగలడు.

## దుబాయ్ టు హైదరాబాద్
# సానియా మీర్జా

**హైదరాబాద్:** భారత మాజీ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా... కుమారుడితో కలిసి దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. తమ ఇంటిపైన యుద్ధ విమానాల శబ్దాలు విన్నామని. క్షిపణులను అడ్డగించడం చూశామని, క్షిపణి శకలాలు తమ ఇంటి సమీపంలోనే పడినట్లు సానియా మీర్జా తెలిపింది.

టెన్నిస్ క్రీడాకారిణులకు మద్దతిచ్చే లక్ష్యంతో ది నెక్ట్స్ సెట్ పేరుతో కంపెనీని ప్రారంభించినట్లు సానియా పేర్కొంది. దీని ద్వారా యువ కోచ్‌లు, ఫిజియోలు, పోషకాహార నిపుణులతో పాటు ఆర్థిక సహాయం అందుబాటులోకి వస్తాయని, తద్వారా సహాయక సిబ్బంది ఖర్చు గురించి చింతించకుండా క్రీడాకారిణులు శిక్షణపై దృష్టి పెట్టగలరని తెలిపింది. ప్రపంచ స్థాయి మహిళా టెన్నిస్ క్రీడాకారిణిని తయారు చేయడానికి భారత్ ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని సానియా అభిప్రాయపడింది.






## లక్ష్య చేధనలో కుప్పకూలిన దక్షిణాఫ్రికా
# రెండో టీ20లో కివీస్ ఘనవిజయం

**హామిల్టన్:** సౌతాఫ్రికాతో సొంతగడ్డపై అయిదు టీ20ల సిరీస్ ఆడుతున్న న్యూజిలాండ్ బోణీ చేసింది. హామిల్టన్ వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై 68 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి టీ20లో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకుంది.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఓపెనర్ టామ్ లాథమ్(11), టిమ్ రాబిన్సన్(1) నిరాశపరిచినా, మరో ఓపెనర్ కాన్వే...ప్రొటీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. రెండు సిక్స్‌లు, మరో 5 బౌండరీల సహాయంతో 49 బంతుల్లోనే 60 పరుగులు సాధించాడు. స్లాగ్ ఓవర్లలో జోష్ క్లార్కసన్ 26 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో న్యూజిలాండ్ స్కోరు 175 రన్స్‌కు చేరుకుంది. మిగతా బ్యాట్స్‌మెన్లలో నిక్ కెల్లీ 12 బంతుల్లో 21 రన్స్, మిచెల్ సాంట్నర్ 14 బంతుల్లో 20 రన్స్‌తో ధాటిగా ఆడారు. సౌతాఫ్రికా బౌలర్లలో ముల్డర్ 2 వికెట్లు పడగొట్టాడు. 176 రన్స్ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా.. కివీస్ బౌలర్ల ముందు పేకమేడలా కూలింది. ఆరంభం నుంచి వేగంగా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లలో కొన్నోర్ ఎస్తరూజెన్ (8)ను బెన్ సియర్స్ వెనక్కి పంపగా.. వియాన్ ముల్డర్ (16)ను సాంట్నర్ అవుట్ చేశాడు. వన్‌డౌన్‌లో వచ్చిన టోనీ జార్జి (1) మెకాంచీ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. లోయర్ ఆర్డర్‌లో జార్జ్ లిండే మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. 12 బంతుల్లోనే మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 33 రన్స్ సాధించాడు. మిగతా బ్యాట్స్‌మెన్ చేతులెత్తేయడంతో ప్రొటీస్ 15.3 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌటైంది. కివీస్ బౌలర్లలో లాకీ ఫెర్గూసన్, బెన్ సియర్స్ చెరో మూడు వికెట్లతో చెలరేగగా.. సాంట్నర్ రెండు, మెకాంచి, జేమ్స్ నీషమ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. న్యూజిలాండ్ సౌతాఫ్రికా మధ్య శుక్రవారం నాడు ఆక్లాండ్‌లో మూడో టీ20 మ్యాచ్ జరగనుంది.

# 24 యేళ్లకే హార్డ్‌కోర్ట్ సూపర్ సెట్

**కాలిఫోర్నియా:** ఇటలీ యువ సంచలనం జానిక్ సినర్ చరిత్ర చరిత్ర సృష్టించాడు. ఇండియన్ వెల్స్ టైటిల్ నెగ్గడం ద్వాఆరా హార్డ్‌కోర్ట్ సూపర్ సెట్ పూర్తి చేశాడు. ఈ ఘనత సాధించిన అతిపిన్న వయస్కుకుడిగా జానిక్ సినర్ నిలిచాడు. జోకోవిచ్, ఫెదరర్‌లను అధిగించాడు. జోకోవిచ్ 31 ఏళ్లలో, రోజర్ ఫెదరర్ 30 ఏళ్లలో హార్డ్‌కోర్ట్ సూపర్ సెట్ సాధిస్తే... జానిక్ సినర్ 24 ఏళ్ల వయస్సులోనే ఈ ఫీట్ అందుకున్నాడు. హార్డ్‌కోర్టులపై జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్, యూ.ఎస్. ఓపెన్, ఏటీపీ ఫైనల్స్, ఇండియన్ వెల్స్, మయామి, సిన్సినాటి, షాంఘై, పారిస్, కెనడియన్ ఓపెన్‌లు నెగ్గితే సూపర్ సెట్‌ను పూర్తి చేసినట్లవుతుంది. హార్ట్‌కోర్టులపై జరిగే ఆరు మాస్టర్స్ టైటిల్ గెలిచిన ఫీట్ రోజర్ ఫెదరర్, జోకోవిచ్ పేరిట ఉంది. ఈ జాబితాలో జానిక్ సినర్ కూడా చేరాడు. ఇండియన్ వెల్స్ సినర్ కెరీర్‌లో ఆరో మాస్టర్స్ టైటిల్.

ఫైనల్లో వరల్డ్ నెంబర్ టూ జానిక్ సినర్ 7-6, 7-6తో అతికష్టంపై 11వ ర్యాంకర్ కజకిస్తాన్ ఆటగాడు మెద్వదెవ్‌ను ఓడించాడు. 1990లో మాస్టర్స్ సిరీస్ మొదలయ్యాక ఒక్క సెట్ కూడా కోల్పోకుండా రెండు మాస్టర్స్ సిరీస్ టైటిల్స్ నెగ్గిన తొలి ఆటగాడిగా సినర్ రికార్డు నెలకొల్పాడు. గెలవకుండా మిగిలిపోయిన ఇండియన వెల్స్‌ను నెగ్గడం సంతోషంగా ఉందన్నాడు సినర్. తనకు ఇది గొప్ప వారంగా పేర్కొన్నాడు. ఇప్పుడు ఈ విజయాన్ని సాధించడం తనకు చాలా విలువైనదిగా సినర్ తెలిపాడు.



# 11 యేళ్లలో రూ.9.75 లక్షలకోట్ల రుణాల రద్దు

**న్యూఢిల్లీ, మార్చి 17:** దేశంలోని బ్యాంకులు గడిచిన 11 ఏళ్లలో ఏకంగా రూ.9.75 లక్షల కోట్ల విలువైన రుణాలను రైటాఫ్ (రద్దు) చేశాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ రైటాఫ్‌ల ప్రక్రియ ఆర్బీఐ మార్గదర్శకాలు, బ్యాంకుల బోర్డులు ఆమోదించిన పాలసీల మేరకే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. బ్యాం కులు మొండి బకాయిలను (ఎన్పీయే) రైటాఫ్ చేస్తాయి. ముఖ్యంగా నాలుగేళ్ల తర్వాత పూర్తి ప్రొవిజనింగ్ చేసిన ఖాతాలను ఈ జాబితాలో చేర్చుతారు. రైటాఫ్ చేయడం అంటే రుణగ్రహీతల బాధ్యతలను రద్దు చేయడం కాదు. దీనివల్ల రుణగ్రహీతలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు అని ఆయన వివరించారు. రుణాలు తీసుకున్న వారు వాటిని తిరిగి చెల్లించాల్సిందేనని, రద్దుచేసిన ఖాతాల నుంచి కూడా బకాయిల వసూలు ప్రక్రియను బ్యాంకులు కొనసాగి




స్తాయని చౌదరి తెలిపారు. వివిధ రికవరీ పద్ధతుల ద్వారా ఈ వసూళ్లను కొనసాగిస్తారని ఆయన పేర్కొన్నారు. ఏడాది వారీగా గణాంకాలను పరిశీలిస్తే201920 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.1.59 లక్షల కోట్ల రుణాలు రైటాఫ్ అయ్యాయని మంత్రి తెలిపారు. అప్పటి నుంచి ఈ మొత్తం తగ్గుతూ వచ్చిందని, 2024-25లో రూ.47,568 కోట్లకు చేరిందని వెల్లడించారు. 2014-15లో రూ.31,723కోట్లు, 2015-16లో రూ. 40,416 కోట్లు, 2016-17లో రూ.68,308 కోట్లు, 2017-18లో రూ.99,132 కోట్లు రైటాఫ్ చేసినట్లు వెల్లడించారు. మరోవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలను పాటించనందుకు పేమెంట్ అగ్రిగేటర్ సంస్థ క్యాష్‌ఫ్రీ పేమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌పై రూ.3.1 లక్షల జరిమానా విధించింది. ఎస్క్రో ఖాతా నుంచి కొన్ని 'అనుమతిలేని డెబిట్‌లు' చేసినట్లు ఆర్బీఐ గుర్తించింది. ఈ నెల 9న జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ పెనాల్టీ విధించినట్లు ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. 2024 ఏప్రిల్ నుంచి 2025 జూన్ మధ్య కాలంలో కంపెనీ కార్యక లాపాలపై జరిపిన తనిఖీల్లో ఈ ఉల్లంఘనలు బయట పడినట్లు పీటీఐ తెలిపింది. మొదట క్యాష్ ఫ్రీకి నోటీసులు ఇచ్చి, ఆ తర్వాత ఆరోపణలు రుజువు కావడంతో జరిమానా విధించామని ఆర్బీఐ వివరించింది. ఈ చర్య కేవలం నియంత్రణ పరమైన లోపాలపైనేనని, కంపెనీకి, కస్టమర్లకు మధ్య జరిగిన లావాదేవీల చెల్లుబాటును ప్రశ్నించే ఉద్దేశం లేదని ఆర్బీఐ స్పష్టం చేసింది.

# మార్కెట్లను బలపరిచిన గ్లోబల్ సెంటిమెంట్

## రెండోరోజూ లాభాల్లోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, మార్చి 17:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు రెండోరోజు కూడా భారీ లాభాల్లోనే ముగిసాయి. అంతర్జాతీయదోరణులు సానుకూలంగా మారడం, అమెరికా ఇరాన్ వివాదం మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు పెరుగుదల వంటివి ఉన్నప్పటికీ ఇన్వెస్టర్లలో నమ్మకాలు పెరిగాయి. దీనితో బిఎస్‌ఇ, ఎన్ఎస్‌ఇలు రెండూ కూడా లాభపడ్డాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 567.99 పాయింట్లు లాభపడి 76,070.84 పాయింట్ల వద్ద ట్రేడింగ్‌ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 172.35 పాయింట్లుపెరిగి 23,581.15 పాయింటలవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. రెండు సెషన్లలో సెన్సెక్స్ 2.02శాతం, నిఫ్టీ 1.86శాతం లాభపడ్డాయి. ఎటర్ల్ 7శాతం, భారతి ఎయిర్‌టెల్ 2.13శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.25శాతం వంటివి నిఫ్టీకి ఊతం ఇచ్చాయి. బిఎస్‌ఇ 150 మిడ్‌క్యాప్‌సూచీ 1.08శాతం, బిఎస్‌ఇ 250 స్మాల్‌క్యాప్‌సూచీ 0.43శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్లపరంగా చూస్తే బిఎస్‌ఇలో 2362 కంపెనీలు పెరిగాయి. 1892 కంపెనీలు క్షీణిస్తే 183 షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్పిడి కౌంటర్లలో డాలరుతో రూపాయి మారకం విలువలు 92.40వద్దముగిసాయి. ముందురోజు 92.28వద్దముగిస్తే ఈరోజు 11 పైసలు దిగువకు వెళ్లింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ రెండోతేదీ సెటిల్‌మెంట్లు పెరిగి రూ.1,56,200కి చేరింది. అమెరికా డాలర్ సూచీలో ఇతర కీలక కరెన్సీలతో పోలిస్తే 99.52శాతం పటిష్టంగా ఉంది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముగిచమురు మేనెల సెటిల్‌మెంట్లకుగాను 3.30 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 103.51 గానడిచింది. ఎటర్నల్ 6.15శాతంపెరిగితే తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ 1.34శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.10శాతం




చొప్పున పెరిగాయి. నోసిల్‌కూడా 6.92శాతం పెరిగింది. ఎన్ఎండిసి 2.11శాతం పైపైకి ఎగబాకింది. పూర్వాంకారా 1.70శాతం, ఒబరాయ్ రియాల్టీ 3.35శాతం, ప్రోస్టార్మ్ ఇన్ఫోసిస్టమ్స్ 1.73శాతం, పెరిగాయి. కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ 3.23శాతం ఎగువకు దూసుకుపోయింది. సన్‌ఫార్మా కూడా 0.46శాతం, టాటామోటార్స్ 0.93శాతంపెరిగితే రెడింగ్టన్ 1.80శాతం, మాస్టెక్ షెడ్ 0.76శాతం చొప్పున దిగజారాయి.

# రూ.9వేల కోట్ల నిధుల కోసం ఐపిఒకు మణిపాల్ హాస్పిటల్స్

**ముంబయి, మార్చి 17:** కార్పొరేట్ కంపెనీలే కాకుండా కార్పొరేట్ ఆసుపత్రులు కూడా ఐపిఒ రూటుకు వచ్చేస్తున్నాయి. తాజాగా మణిపాల్ హాస్పిటల్స్ ఐపిఒద్వారా నిధులు సమీకరించేందుకు నిర్ణయించింది. రూ.9 వేలకోట్లు నిధులు సమీకరణకోసం సెబీ మరికొద్దిరోజుల్లోనే డిఆర్‌హెచ్‌పి దాఖలుచేస్తుందని సమాచారం. భారత్‌లో ఒక కార్పొరేట్ ఆసుపత్రి భారీస్థాయిలో నిధులు సమీకరణకు ఐపిఒకు రావడం ఇదే మొదటిసారి అని తెలుస్తోంది. టీమ్‌సెక్ మద్దతున్న ఈ కంపెనీ మార్కెట్ విలువలు రూ.1.2 లక్షలకోట్లుగా ఉన్నాయి. సింగపూర్‌ప్రభుత్వ సంస్థ టీమ్‌సెక్ హోల్డింగ్స్, మణిపాల్ సంస్థలు భారత్‌లోనే అత్యంత విలువైన వైద్యసేవలందించే ఆసుపత్రిగా పేరుసాధించారు. చిన్నచిన్న ఆసుపత్రులను కొనుగోలుచేయడం ద్వారా భారీ విస్తరణ దిశగా వెళుతోంది. సహ్యాద్రి హాస్పిటల్స్ కొనుగోలుకు చర్చలు సాగిస్తోంది. జూన్‌లోనే కెకెఆర్ 600 మిలియన్ డాలర్ల ఆర్థికసాయం ప్యాకేసి మణిపాల్ వైద్యసేవల వృద్ధికి అద్దం పడుతోంది. ప్రస్తుతం భారత్‌లోమాక్స్ హెల్త్‌కేర్ అత్యధిక సంఖ్యలో హాస్పిటల్‌చైన్ నిర్వహిస్తోంది. ఇటీవలికాలంలోనే డా.అగర్వాల్ హెల్త్‌కేర్‌కూడా లిస్టింగ్ అయింది. హెల్త్‌కేర్; వైద్యవిద్య, బీమా రంగాల్లో మణిపాల్ 10వేల 500 పడకల ఆసుపత్రులు నిర్వహిస్తోంది.




# ఇపిఎఫ్‌ఒ కనీస పింఛన్ పెంపు!

## ప్రభుత్వానికి ప్యానెల్ సిఫారసు

**న్యూఢిల్లీ, మార్చి 17:** ఈపీఎఫ్‌ఒలో చందాదారులుగా ఉండే ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత పొందే పెన్షన్‌కు సంబంధించి గుడ్‌న్యూస్ వచ్చింది. కనీస పెన్షన్ పెంపుపై చాలా కాలంగా ఉద్యోగులు, పెన్షనర్లు పోరాటం చేస్తున్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.1000 కనీస పెన్షన్ సరిపోడవం లేదని, ద్రవ్యోల్బణాన్ని అనుసరించి పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కనీస పెన్షన్ పెంపుపై పార్లమెంటరీ ప్యానెల్ కేంద్ర ప్రభుత్వానికి కీలక ప్రతిపాదనలు చేసింది. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ ఈపీఎస్ 1995 కింద ప్రస్తుతం అందిస్తున్న కనీస పెన్షన్ రూ.1000 మొత్తాన్ని పెంచాలని పార్లమెంటరీ ప్యానెల్ సూచించింది. ఈ మొత్తం వాస్తవికంగా, సహేతుకంగా ఉండాలని అభిప్రాయపడింది. ఈ మేరకు లేబర్, టెక్స్ టైల్స్, స్కిల్ డెవలప్మెంట్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 5వ రిపోర్ట్‌లో పలు అంశాలను ప్రస్తావించింది. ఈపీఎస్ పథకంలో భాగంగా కనీస పెన్షన్ పెంచాలని పెన్షనర్లు చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. పార్లమెంటరీ కమిటీ ఈ అంశంపై సానుకూల ప్రతిపాదనలు చేయడం ఊరట కల్పించే విషయంగా చెప్పవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో కనీస పెన్షన్ రూ.1000 ఏ మాత్రం సరిపోడవం లేదని, దాన్ని రూ.7500లకు పెంచాలని పెన్షనర్లు కోరుతున్నారు. ఇదే డిమాండ్‌తో ఇటీవలే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 3 రోజులు ధర్నా సైతం నిర్వహించారు. ఈ క్రమంలోనే పార్లమెంటరీ స్థాయీ సంఘం స్పందించింది. కనీస పెన్షన్‌పై ఇప్పటికీ పింఛనుదారుల నుంచి పలుమార్లు విజ్ఞాపనలు, వినతి పత్రాలు వచ్చినట్లు గుర్తు చేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, జీవన వ్యయాలు పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం ఇస్తోన్న కనీస పెన్షన్ ఏ మాత్రం సరిపోదని కమిటీ అభిప్రాయపడింది. కాబట్టి ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ 1995ని పునఃసమీక్షించాలని కోరింది. కనీస పెన్షన్ మొత్తాన్ని పెంచాలని ప్రతిపాదనలు చేసింది. అందుకు తగినట్లుగా కేటాయింపులు




చేయాలని సూచించింది. లేబర్ కోడ్స్ అమలును కమిటీ స్వాగతించింది. లేబర్ కోడ్స్ అమలులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో శాశ్వత కోఆర్డినేషన్, ఇంటరాక్షన్ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ప్రభుత్వం ఇచ్చే వివిధ పథకాల అమలు తీరుతెన్నులనూ ఈ బోర్డు పరిశీలిస్తుందని తెలిపింది. పని ప్రదేశంలో ప్రమాదం జరిగినప్పుడు రెగ్యులర్ వర్కర్ల మాదిరిగానే కాంట్రాక్టు వర్కర్లకు పరిహారం అందడంలో జాప్యం జరుగుతోందని, వారికి సత్వరమే పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ కింద సామాజిక భద్రత ప్రయోజనాలను మరింత మందికి విస్తరించేందుకు ప్రస్తుతం ఉన్న వేతన పరిమితిని తక్షణమే సవరించాలని తెలిపింది.

# కమర్షియల్ వాహనాల ధరలు పెంచుతున్న 'టాటా'

**ముంబయి, మార్చి 17:** టాటా గ్రూప్‌నకు చెందిన వాణిజ్య వాహనాల తయారీ సంస్థ టాటా మోటార్స్ కమెర్షియల్ వెహికల్స్ తమ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. కంపెనీకి చెందిన వివిధ వాణిజ్య వాహనాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఒక్కో వాహనంపై గరిష్ఠంగా 1.5శాతం వరకు ధరలు పెరుగుతాయని తెలిపింది. సవరించిన ఈ కొత్త ధరలను వచ్చే నెల ఏప్రిల్ 1 నుంచే అమలులోకి తీసుకొస్తున్నామని తెలిపింది. పెరుగుతున్న కమోడిటీ ధరలు, తయారీ ఖర్చుల కారణంగానే వాహనాల ధరలను పెంచాల్సి వస్తోందని తెలిపింది. పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, ఇతర తయారీ వ్యయాల ప్రభావాన్ని పాక్షికంగా భర్తీ చేయడానికి ఈ ధరల పెంపు అనివార్యం అయిందని కంపెనీ చెపుతోంది. అంతకు ముందు ఈ ఏడాది



2026, ఫిబ్రవరి నెలలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ తమ కార్లు ఇతర వాహనల ధరలను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపింది. ముడి సరుకుల ధరలు పెరగడంతోనే ధరలు పెంచాల్సి వస్తున్నట్లు తెలిపింది. టీఎంపీవీఎల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శైలేష్ చంద్రా వెల్లడించారు. దాదాపు ఏడాది కాలంగా కంపెనీ అధిక తయారీ ఖర్చులను భరిస్తోందని, ఈ ప్రభావం ధరలను పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. త్రైమాసిక ఫలితాల ప్రకటన సందర్భంగా ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ముడిసరుకులు మెటల్స్, కాపర్ ధరలు భారీగా పెరుగుతున్న క్రమంలో కంపెనీ తయారీ వ్యయాలు భారీగా పెరిగిపోయినట్లు తెలిపారు. ముడి సరుకుల ధరలు పెరగడంతో కంపెనీ ఆదాయాలు దాదాపు 2 శాతం మేర పడిపోవచ్చని అంచనా వేశారు. అందుకే ధరలు పెంచాల్సి వస్తోందని స్పష్టం చేశారు. దేశంలోని ప్రధాన ఆటోమేకర్స్ అయిన ఆడి, హ్యుందాయ్ కంపెనీలు ఇప్పటికే తమ కంపెనీకి చెందిన కార్ల ధరలను పెంచుతున్నట్లు ప్రకటనలు చేశాయి. దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ కంపెనీగా ఉన్న మారుతీ సుజుకీ సైతం ముడి సరుకుల ధరల పెంపు కారణంగా ధరలను పెంచే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జర్మనీ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఆడీ ఇటీవలే ధరల పెంపు ప్రకటించింది.

# వచ్చే ఏప్రిల్ నుంచే ఐటి కొత్తరూల్స్

**న్యూఢిల్లీ, మార్చి 17:** ఈ ఏడాది వచ్చే ఏప్రిల్ 1 నుంచి మన దేశంలో ఇన్‌కమ్ టాక్స్ (ఆదాయపు పన్ను) నిబంధనల్లో భారీ మార్పులు రాబోతున్నాయి. దాదాపు 60 ఏళ్ల నాటి పాత చట్టం స్థానంలో ఆదాయపు పన్ను చట్టం 2025 అమల్లోకి వస్తోంది. ఇప్పటివరకు ప్రీవియస్ ఇయర్, అసెస్మెంట్ ఇయర్ అని రెండు వేర్వేరు పేర్లు కొనసాగేవి. కొత్త చట్టం ప్రకారం వీటన్నిటినీ కలిపి కేవలం ట్యాక్స్ ఇయర్ అని పిలుస్తారు. డైరెక్ట్ టాక్స్ చెల్లించే సామాన్య ఉద్యోగులకు ఒక మంచి వార్త. పాతపద్ధతిలో గానీ, కొత్త పద్ధతిలో గానీ ఆదాయపు పన్నురేట్లలో ఎటువంటి మార్పులు చేయడంలేదు. అంటే మీరు కట్టే పన్నుభారం పెరగదు. ఐటీ రిటర్న్లు దాఖలు చేసే గడువు తేదీలను ప్రభుత్వం కొంచెం పెంచింది. సొంతంగావ్యాపారం లేదా ఏదైనా వృత్తి చేసే వారు ఇప్పుడు జూలై 31కి బదులు ఆగస్టు 31 వరకు రిటర్న్లు దాఖలు చేయవచ్చు. ఐటీఆర్1,




ఐటీఆర్2 ఫైల్ చేసే వారికి మాత్రం పాత గడువు జూలై 31 అలాగే ఉంటుంది. మీరు ఫైల్ చేసిన రిటర్న్లులో ఏవైనా తప్పు లుంటే వాటిని సరిచేసి మళ్ళీ ఫైల్ చేయడానికి గడువును 9నెలల నుంచి 12 నెలలకు పెం చారు. 9 నెలలు దాటిన తర్వాత ఫైల్ చేస్తే రూ. 1,000 నుండి రూ. 5,000 వరకు ఫీజు కట్టాల్సి ఉంటుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.